


# గౌతమ్ న్యూస్

తెలుగు దిన పత్రిక




హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 104, ఎడిటర్,భీముడు నాయక్ పేజిలు : 12, వెల రూ. 1 గురువారం - 16 - మే - 2024

PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## నా గురించి ఆయనకు సమాచారం ఎవరు ఇచ్చారో?: అమిత్ షాపై ప్రియాంక గాంధీ ఆగ్రహం

మహిళల కార్యకలాపాలపై నిఘా వేయడం ఏమిటని మండిపాటు

మహిళలు ఎవరు ఏం చేస్తుంటారు, ఎప్పుడు ఎక్కడ ఉన్నారనే దానిపై దృష్టి సారిస్తాం



## ఇక ఏటా 750 కిలోల బంగారం ఉత్పత్తి!

దేశంలోనే తొలి ప్రైవేటు బంగారు గని ఏపీలో సిద్ధం..

కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని జొన్నగిరిలో ఏర్పాటవుతున్న బంగారు గని రూ. 200 కోట్ల పెట్టుబడి పెట్టిన డెక్కన్ గోల్డ్ మైన్స్.. 250 ఎకరాల భూసేకరణ 60 శాతం పూర్తయిన ప్లాంటు నిర్మాణం.. ఇప్పటికే రోజుకు కిలో బంగారం ఉత్పత్తి

## అధికారంలో ఉన్నానని రేవంత్ రెడ్డి గుర్తించాలి...



ఉద్యోగులను ముఖ్యమంత్రే నమ్మకపోతే ఎలా?

ఉద్యోగులు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని, అలాంటి వారిని తాము ఎప్పుడూ విమర్శించలేదన్న కేటీఆర్

ప్రభుత్వాన్ని నడపడం రేవంత్ రెడ్డికి చేతకాక ఉద్యోగులపై విమర్శలు చేస్తున్నారని వ్యాఖ్య

ఉద్యోగులను అవమానించడం రేవంత్ రెడ్డికి తగదన్న కేటీఆర్

ముఖ్యమంత్రికి రైతుల కష్టాలు కనిపించడం లేదా? అని ప్రశ్న

# ఏ పార్టీకి ఎన్ని సీట్లు?

- తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలకు, ఆంధ్రప్రదేశ్‌లో 25 లోక్‌సభ సీట్లతోపాటు 175 అసెంబ్లీ సీట్లకు పోలింగ్
- జూన్ 4న జడ్జిమెంట్
- లోక్‌సభ ఎన్నికల్లో 64.93 శాతం పోలింగ్ నమోదైంది
- పది స్థానాల్లో 70 శాతానికిపైగా పోలింగ్ నమోదవడం విశేషం
- కరీంనగర్, జహీరాబాద్, ఆదిలాబాద్ లో కూడా అత్యధికంగా పోలింగ్ నమోదైంది



హైదరాబద్ :లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు దక్కించుకోవడానికి తెలంగాణలో అధికార కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతోపాటు విపక్ష పార్టీ తీవ్రంగా శ్రమించాయి. తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలకు, ఆంధ్రప్రదేశ్‌లో 25 లోక్‌సభ సీట్లతోపాటు 175 అసెంబ్లీ సీట్లకు సోమవారం పోలింగ్ జరిగింది. దాదాపు 5 కోట్ల మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. అభ్యర్థుల భవితవ్యం ఇప్పుడు ఈవీఎంలలో నిక్షిప్తమైంది. జూన్ 4న జడ్జిమెంట్ వెలువడనుంది. ఈ క్రమంలో ఓటర్ల మూడు ఎలా ఉంది అన్న చర్చ తెలంగాణలో జరుగుతోంది.



## బెంగాల్‌లో బీజేపీ 30 సీట్ల వరకు గెలుచుకుంటుంది: అమిత్ షా



- 2029 వరకు మోదీయే ప్రధానిగా ఉంటారన్న అమిత్ షా
- 2029 తర్వాత కూడా మోదీయే తమ నాయకుడిగా ఉంటారని స్పష్టీకరణ
- బెంగాల్‌లో జరుగుతున్న దౌర్జన్యాలపై హైకోర్టు జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి

## ఏపీలో హింసాత్మక ఘటనలపై ఈసీ సీరియస్..!




- రాష్ట్రంలో పోలింగ్ తర్వాత చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై వివరణ కోరిన ఈసీ
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు సమన్లు

# కాయ్ రాజా కాయ్..

- ఏపీలో రెచ్చిపోతున్న బెట్టింగ్ రాయుళ్లు..
- కోట్లల్లో బెట్టింగ్స్
- ఏపీలో ఎన్నికలు రసవత్తరంగా సాగాయి. ఎట్టకేలకు ఈఎంఐ లు స్ట్రాంగ్ రూమ్‌లకి చేరాయి.
- అయితే రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 4 తేదీన డిసైడింగ్ డే కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.
- అధికారంలోకి వచ్చే పార్టీ ఏదీ? ఎన్నిసీట్లు?
- ఏ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు?
- ఏ అభ్యర్థికి ఎంత మెజార్టీ వస్తుంది?




అమరావతి: పల్నాడు, కడప జిల్లాలో అభ్యర్థులు, స్థానాలతో పాటు చంద్రబాబు పోటీ చేసిన కుప్పం, నారా లోకేష్ కంటెస్ట్ చేసిన మంగళగిరి, పవన్ కల్యాణ్ పోటీచేసిన పిఠాపురంలో మెజార్టీలపై భారీ ఎత్తున పందేలు జరుగుతున్నట్లు సమాచారం.. ముఖ్యంగా చెప్పాలంటే దేశ వ్యాప్తంగా పవన్ కల్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురంపై భారీ అంచనాలు పెరిగిపోయాయి. పిఠాపురంలో గెలుపోటములు ఒకరకమైన బెట్టింగ్ అయితే.. ఎక్కువగా మెజార్టీపై లక్షల్లో పందేలు జరుగుతున్నట్లు వినిపిస్తోంది.. లోకేష్ బరిలో ఉన్న మంగళగిరిపై పందేం రాయుళ్లు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారని సమాచారం.. పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం, సత్తెనపల్లి, పెదకూరపాడు లో మెజారిటి పై పందేలు నడుస్తున్నాయి.. జనసేన తరపున పులపర్తి రామాంజనేయులు, వైసీపీ నుంచి గ్రంథి శ్రీనివాస్‌ల మధ్య మెజారిటీపై

## ఏపీ ఎన్నికల్లో ప్రముఖుల నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం ఇలా..!




చంద్రబాబు పోటీ చేసిన కుప్పం నియోజకవర్గంలో 85.87 శాతం పోలింగ్

వైఎస్ జగన్మోహన్ రెడ్డి పోటీ పడిన పులివెందులలో 81.34 శాతం పోలింగ్ నమోదు

జనసేనాని పవన్ కల్యాణ్ బరిలో నిలిచిన పిఠాపురం నియోజకవర్గంలో 86.36 శాతం ఓటింగ్

## అమెరికా అధ్యక్ష భవనంలో వీనుల విందుగా 'సారే జహాసే అచ్ఛా' పాట



ఆసియా అమెరికన్ల సలహా సంఘం కార్యక్రమంలో ఆలపించిన మెరైన్ బ్యాండ్

## నేను హిందూ ముస్లిం పేరు ఎత్తలేదు..




- అధిక సంతానంతో బాధపడుతున్న పేదలను ఉద్దేశించే మాట్లాడానని స్పష్టీకరణ
- హిందువులు, ముస్లింలంటూ వేరు చేసి ఓటు బ్యాంకు రాజకీయాలు చేయబోనని వ్యాఖ్య
- ఒకవేళ అలా చేస్తే ప్రజాజీవితంలో కొనసాగే అర్హత కోల్పోతానని వెల్లడి
- గోధ్రా అల్లర్ల పేరుచెప్పి ముస్లింలలో తనకున్న ఇమేజ్ ను ప్రత్యర్థులు చెడగొట్టారని మండిపాటు

# బాబు ప్రమాణం అక్కడ నుంచేనా

## వైసీపీ అధికారంలోకి వస్తే జగన్ విశాఖ నుంచి ప్రమాణ స్వీకారం

కూటమి నేతలు అయితే జూన్ 4న పండగ చేసుకుందామని ప్రకటిస్తున్నారు

140 సీట్లకు తగ్గవని కూటమి నేతలు అంచనా

జూన్ 4న తొలి ట్రెండ్స్ లోనే విజయం ఖాయం అవుతుందని కూడా కూటమి నేతలు ధీమా వ్యక్తం



అమరావతి : వైసీపీ అధికారంలోకి వస్తే జగన్ విశాఖ నుంచి ప్రమాణ స్వీకారం చేస్తారు. ఆ విషయం ఎన్నికల ప్రచారంలో జగన్ చెబుతూ వచ్చారు. ఇపుడు ఆయన పార్టీ నేతలూ అదే చెబుతున్నారు. వైసీపీ ఈ విషయంలో కచ్చితంగానే ఉంది. అధికారంలోకి వస్తున్నామని కూడా జోస్యం చెబుతోంది. వైసీపీ సంగతి అలా ఉంచితే టీడీపీ విషయం ఏమిటి అన్న చర్చ వస్తోంది. అనూహ్య ఫలితాలు వస్తాయని చంద్రబాబు చెబుతున్నారు. కూటమి నేతలు అయితే జూన్ 4న పండగ చేసుకుందామని ప్రకటిస్తున్నారు. కానీ టీడీపీ ఎపుడు ఎక్కడ ప్రమాణం చేస్తుంది అన్నది చెప్పడం లేదు. 2014లో చంద్రబాబు జూన్ 8న ప్రమాణం చేసారు. ఆనాడు ఆయన గుంటూరు జిల్లాలో ప్రమాణం చేశారు. ఈసారి కూడా టీడీపీ అధికారంలోకి వస్తే చంద్రబాబు అమరావతిలో ప్రమాణం చేస్తారా అన్న దాని

## ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై 'నో కామెంట్' అన్న కిషన్ రెడ్డి...



- సమాధానం చెప్పే వరకు వదలని మీడియా
- ఢిల్లీలో కిషన్ రెడ్డి మీడియా సమావేశం
- ఎన్డీయే అలయెన్స్‌లో ఉంది కదా ఏం చెబుతారని ప్రశ్నించిన మీడియా
- తెలంగాణ అధ్యక్షుడిగా మాట్లాడుతున్నా
- కేంద్రమంత్రిగా ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించిన జర్నలిస్టులు
- ఏపీలో ఎన్డీయే కచ్చితంగా గెలుస్తుంది

## నా గురించి ఆయనకు సమాచారం ఎవరు ఇచ్చారో?: అమిత్ షాపై ప్రియాంక గాంధీ ఆగ్రహం

ఢిల్లీ: కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై ఏఐసీసీ అగ్రనాయకురాలు ప్రియాంకగాంధీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మహిళల కార్యకలాపాలపై ఆయన నిఘా వేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు సహా ఎవరు ఏం చేస్తుంటారు? ఎప్పుడు, ఎక్కడ ఉన్నారు? అనే దానిపై ఆయన దృష్టి సారిస్తుంటారన్నారు. తాను కొన్నిరోజుల క్రితం తన కూతురును చూసేందుకు థాయ్‌లాండ్ వెళ్లానని... ఈ అంశాన్ని అమిత్ ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించారన్నారు. 'అవును... నేను థాయ్‌లాండ్ వెళ్లాను. అయితే ఈ సమాచారం ఆయనకు ఎవరు ఇచ్చారో చెప్పగలరా? ఆయన దగ్గర సమాచారం ఉన్నప్పుడు అబద్ధాలు చెప్పాల్సిన పనేంటి?' అని ప్రియాంక మండిపడ్డారు. అంతకుముందు, అమిత్ షా మాట్లాడుతూ... గాంధీ కుటుంబ సభ్యులు ఎన్నికల సమయంలో మాత్రమే అమేథి, రాయ్‌బరేలి నియోజకవర్గాల్లో పర్యటిస్తారని విమర్శించారు. ఆ నియోజకవర్గాలను గాంధీ కుటుంబం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. సోనియాగాంధీకి ఆరోగ్య సమస్యలు ఉన్నాయని... మరి రాహుల్, ప్రియాంక గాంధీ మాటేమిటని నిలదీశారు. గతంలో రాయ్‌బరేలి నియోజకవర్గంలో పలు దురదృష్టకర సంఘటనలు జరిగినా గాంధీ కుటుంబసభ్యులు వచ్చిన దాఖలాలు లేవన్నారు. కొందరు క్రమం తప్పకుండా థాయ్‌లాండ్, బ్యాంకాక్ వెళతారని ఎద్దేవా చేశారు.

## ఇక ఏటా 750 కిలోల బంగారం ఉత్పత్తి!

### దేశంలోనే తొలి ప్రైవేటు బంగారు గని ఏపీలో సిద్ధం..

అమరావతి: దేశంలోకెల్లా తొలి ప్రైవేటు బంగారు గని ఆంధ్రప్రదేశ్ లో సిద్ధమవుతోంది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని జొన్నగిరిలో బంగారు గనిని డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థ అభివృద్ధి చేస్తోంది. సుమారు 250 ఎకరాల భూసేకరణ చేపట్టి భూగర్భం నుంచి పసిడిని వెలికితీసేందుకు రూ. 200 కోట్ల పెట్టుబడితో భారీ ప్లాంట్ నిర్మిస్తోంది. ఇప్పటికే 60 శాతం పనులు పూర్తవడంతో పైలట్ స్థాయిలో రోజుకు కిలో బంగారం ఉత్పత్తి చేస్తున్నట్లు సంస్థ ఎండీ హనుమ ప్రసాద్ తెలిపారు. ఈ ఏడాది చివరికల్లా పూర్తిస్థాయి కార్యకలాపాలు మొదలైతే ఏటా 750 కిలోల బంగారం ఉత్పత్తి జరుగుతుందని చెప్పారు. మరోవైపు చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో కొన్ని బంగారం గనులను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండీసీ) ఆసక్తి చూపుతోంది. ఈ గనులను అప్పగించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరింది. దక్కన్ గోల్డ్ మైన్స్ కు దేశంలో వివిధ ప్రాంతాల్లో గనులు ఉన్నాయి. ఆఫ్రికాలోని మొజాంబిక్‌లో లిథియమ్ గనులను ఆ సంస్థ తాజాగా కొనుగోలు చేసింది. రోజుకు 100 టన్నుల లిథియం, ఇతర ఖనిజాలను వెలికి తీసేందుకు భారీ ప్లాంట్లు నిర్మిస్తోంది. ఇందుకోసం స్థానికంగా ఉన్న మరో కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. తాజాగా రాజస్తాన్‌లో అమ్మకానికి పెట్టిన రెండు బంగారు గనులను సొంతం చేసుకొనేందుకు వేదాంతా గ్రూపు సంస్థ అయిన హిందూస్థాన్ జింక్, జిందాల్ పవర్, జేకే సిమెంట్ పోటీపడుతున్నాయి. రాజస్తాన్‌లోని కంక్రియా గారా గోల్డ్ బ్లాక్, భూకియా-జగ్‌పురా గోల్డ్ బ్లాక్‌లను ఆ రాష్ట్ర ప్రభుత్వం వేలం వేస్తోంది. తాజాగా వేలంలో పాల్గొనేందుకు సాంకేతిక అర్హత సాధించిన కంపెనీల్లో అవి కూడా ఉన్నాయి.

## బెంగాల్‌లో బీజేపీ 30 సీట్ల వరకు గెలుచుకుంటుంది

ఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ 24 నుంచి 30 స్థానాల వరకు గెలుచుకుంటుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. బెంగాల్‌లో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 2029 వరకు మోదీయే ప్రధానిగా ఉంటారని స్పష్టం చేశారు. 2029 తర్వాత కూడా మోదీయే తమ నాయకుడిగా ఉంటారన్నారు. బెంగాల్‌లో జరుగుతున్న దౌర్జన్యాలపై హైకోర్టు జోక్యం చేసుకోవాలని కోరారు. పాకిస్థాన్ వద్ద అణుబాంబు ఉందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని... వారి వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్ చేశారు. సందేశ్‌కాళీ ఘటన విషయంలో మమతా బెనర్జీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మత ప్రాతిపదికన మహిళలపై బెంగాల్‌లో దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు.

## ఏపీలో హింసాత్మక ఘటనలపై ఈసీ సీరియస్..!

అమరావతి: ఏపీలో పోలింగ్ తర్వాత పలు చోట్ల చోటుచేసుకున్న హింసాత్మక సంఘటనలపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) తీవ్రంగా స్పందించింది . ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు సమన్లు జారీ చేసింది. ఏపీలో పోలింగ్ తర్వాత చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై వివరణ కోరింది. వ్యక్తిగతంగా ఎన్నికల సంఘం ముందు హాజరై వివరణ ఇవ్వాలని సీఎస్, డీజీపీకి ఆదేశించింది. పల్నాడు, చంద్రగిరి, తిరుపతి, తాడిపత్రి, నంద్యాల జిల్లాలో జరిగిన హింసను ఎందుకు కంట్రోల్ చేయలేకపోయారని ప్రశ్నిస్తూ వ్యక్తిగతంగా ఢిల్లీకి వచ్చి వివరణ ఇవ్వాలని ఆదేశించింది. పోలింగ్ జరిగి రెండు రోజులు కావస్తున్నా రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక ఘటనలు, అల్లర్లు అదుపులోకి తీసుకురాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో గురువారం వారిద్దరు ఢిల్లీకి వెళ్లనున్నారని తెలుస్తోంది. ఈసీకి వాస్తవ పరిస్థితులు వివరించనున్నారు.

## అమెరికా అధ్యక్ష భవనంలో వీనుల విందుగా 'సారే జహాసే అచ్ఛా' పాట

ఢిల్లీ : విదేశాలలో మన దేశానికి చెందిన పాటలు వినిపిస్తే ఆ ఆనందమే వేరు.. అలాంటిది ఏకంగా అగ్రరాజ్యం అమెరికా అధికారిక భవనంలో 'సారే జహాసే అచ్ఛా..' అంటూ బ్యాండ్ వినిపిస్తే ఆ జోష్ మామూలుగా ఉండదు. సోమవారం అమెరికా అధ్యక్ష భవనంలో ఓ విందుకు హాజరైన భారత సంతతి అతిథులకు ఈ అనుభవమే ఎదురైంది. వైట్ హౌస్ అఫీషియల్ బ్యాండ్ సారే జహాసే అచ్ఛా వాయించడంతో వారంతా ఎంకరేజ్ చేశారు. యూఎస్ సర్జన్ జనరల్ డాక్టర్ వివేక్‌మూర్తి ఉత్సాహంగా డ్రమ్స్ వాయించారు. ఆసియా అమెరికన్లు, స్థానిక హవాయియన్, పసిఫిక్ ఐలాండర్‌లపై అధ్యక్షుడి సలహా సంఘం ఏర్పాటై పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా వైట్ హౌస్ లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన అతిథులకు భారతీయ వంటకం సమోసాతో పాటు పానీపూరీలతో విందు ఇచ్చారు. అతిథులను ఉద్దేశించి అమెరికా ప్రెసిడెంట్ జో బైడెన్ మాట్లాడుతూ.. వందల ఏళ్ల క్రితం ఆసియా నుంచి వలస వచ్చిన వారిని స్థానిక హవాయియన్లు ఆదరించారని పేర్కొన్నారు. తమ భూములు ఇచ్చి వారిని తమలో కలిపేసుకున్నారని చెప్పారు. అలా ఇరువర్గాల వారసత్వం దేశ చరిత్రలో భాగమైందని చెప్పారు. కాగా, ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను ఇండియన్ అమెరికన్ కమ్యూనిటీ లీడర్ అజయ్ జైన్ భూటోరియా ట్విట్టర్ లో షేర్ చేశారు.

## ఏపీ ఎన్నికల్లో ప్రముఖుల నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం ఇలా..!

అమరాతవతి: ఏపీలో ఈసారి భారీగా పోలింగ్ నమోదైన విషయం తెలిసిందే. బుధవారం సీఈఓ ముకేశ్‌కుమార్ మీనా ప్రత్యేకంగా మీడియ సమావేశం నిర్వహించి రాష్ట్రంలో నమోదైన పోలింగ్ వివరాలను క్లుప్తంగా వివరించారు. రాష్ట్రంలో మొత్తంగా 81.86 శాతం పోలింగ్ నమోదయినట్లు తెలిపారు. ఇందులో ఈవీఎంల ద్వారా 80.66 శాతం, పోస్టల్ బ్యాలెట్‌తో 1.2 శాతం పోలింగ్ నమోదైందని వెల్లడించారు. గత ఎన్నికలతో పోలిస్తే 2.09 శాతం పోలింగ్ పెరిగిందని మీనా తెలిపారు. ఈ నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, వైసీపీ అధ్యక్షుడు, సీఎం జగన్, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్, టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, నందమూరి బాలకృష్ణ వంటి ప్రముఖులు పోటీ చేసిన వారి వారి నియోజకవర్గాల్లో ఎంత శాతం పోలింగ్ నమోదయిందనే వివరాలను ఇప్పుడు మనం తెలుసుకుందాం. మాజీ సీఎం చంద్రబాబు పోటీ చేసిన కుప్పం నియోజకవర్గంలో 85.87 శాతం పోలింగ్ నమోదయింది. ఇక ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పోటీ పడిన పులివెందులలో 81.34 శాతం పోలింగ్ నమోదైతే, జనసేనాని బరిలో నిలిచిన పిఠాపురం నియోజకవర్గంలో 86.36 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. టీడీపీ యువనేత నారా లోకేశ్ పోటీ చేసిన మంగళగిరిలో 85.74 శాతం ఓటింగ్ జరిగింది. అలాగే నందమూరి బాలకృష్ణ బరిలో ఉన్న హిందూపూర్ నియోజకవర్గంలో 77.82 శాతం పోలింగ్ నమోదు కాగా, షర్మిల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కడపలో 78.73 పోలింగ్ జరిగింది.

## కాయ్ రాజా కాయ్..

మొదటి పేజి తరువాయి



పందేలు నడుస్తున్నాయి.. టీడీపీ రెబల్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే శివరామరాజు, వైసీపీ అభ్యర్థి పివియల్ నరసింహరాజు బరిలో ఉండటంతో ఇక్కడ త్రిముఖ పోటీ నెలకొంది. దీంతో ఉండిలో ఆసక్తికరమైన బెట్టింగ్ జరుగుతుంది. మరీ ముఖ్యంగా.. ఇండిపెండెంట్ శివరామరాజుపై పందేలు భారీగా వేస్తున్నట్లు సమాచారం.. దెందులూరు అభ్యర్థుల మెజార్టీలపైన కూడా బెట్టింగ్ రాయుళ్లు పందేలు వేస్తున్నారని సమాచారం.. ప్రభుత్వం ఏర్పాటు చేసే పార్టీపై 1:5 చొప్పున అంటే లక్షకు 5 లక్షల రూపాయలు బెట్టింగ్ పెడుతున్నారని రాష్ట్ర వ్యాప్తంగా టాక్ వినిపిస్తోంది. చోటా నేతలు, కొందరు వ్యాపారులు మధ్యవర్తుల అవతారమెత్తారని సమాచారం.. ఒకటి నుంచి 5 శాతం కమీషన్ డిమాండ్ చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది.. సినీ, రాజకీయ, వ్యాపార రంగాల వారితోపాటు ప్రైవేటు ఉద్యోగులు, యువకులు, చిరువ్యాపారులు 50 వేల నుంచి కోటి రూపాయల వరకు పందెం కాస్తున్నట్లు చెబుతున్నారు.. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే ప్రభుత్వంపైనే ఎక్కువగా పందాలు జరుగుతున్నాయని పేర్కొంటున్నారు...

# అధికారంలో ఉన్నానని రేవంత్ రెడ్డి గుర్తించాలి...

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను అధికారపక్షంలో ఉన్నానని గుర్తించాలని... ప్రభుత్వ ఉద్యోగులను ముఖ్యమంత్రే నమ్మకపోతే ఎలా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. విద్యుత్ కోతలపై ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. విద్యుత్ కోతలకు కొంతమంది ఉద్యోగులు కారణమని, హరీశ్ రావు వారితో కుట్రపూరితంగా అలా చేయిస్తున్నారన్నారు. ఈ వ్యాఖ్యలపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. తమ పదేళ్ల పాలనలో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేశామన్నారు. కానీ ఇప్పుడు స్వయంగా ముఖ్యమంత్రి విద్యుత్ ఉద్యోగులపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్యోగులు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని... అందుకే తాము ఉద్యోగులను ఎప్పుడూ విమర్శించలేదన్నారు. ప్రభుత్వాన్ని నడపడం రేవంత్ రెడ్డికి చేతకాక ఉద్యోగులపై విమర్శలు చేస్తున్నారన్నారు. ఉద్యోగులను అవమానించడం ఆయనకు తగదన్నారు. పోలీసులను, ఉద్యోగులను తిట్టడానికి ఆయన ప్రతిపక్షంలో లేరని... ముఖ్యమంత్రిగా ఉన్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చురక అంటించారు. పోలింగ్ విధులకు వెళ్లిన టీచర్లపై లాఠీఛార్జ్ చేయడం ఏమిటని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ అయిదు నెలల కాలంలో శ్వేతపత్రాలు అంటూ కొంతకాలం, మేడిగడ్డ ప్రాజెక్టు అంటూ మరికొంతకాలం సమయాన్ని వృథా చేసిందన్నారు. అప్పుల విషయంలో కాంగ్రెస్ నేతలవి చిల్లర రాజకీయాలు అని మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ అని చెప్పి యువతను దగా చేశారన్నారు.

### ముఖ్యమంత్రికి రైతుల కష్టాలు కనిపించడం లేదా?

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతుల కష్టాలు కనిపించడం లేదా? రాజకీయాలు పక్కన పెట్టి రైతులకు న్యాయం చేయాలని కేటీఆర్ కోరారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పలు ప్రాంతాల్లో రైతులు రోడ్డెక్కారన్నారు. ప్రభుత్వం వెంటనే ఎఫ్‌సీఐ ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే రైతుల తరఫున రోడ్డెక్కుతామని... ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని.. మీ వెనుక కేసీఆర్ తో పాటు బీఆర్ఎస్ ఉందని ధైర్యం చెప్పారు. నల్గొండ-వరంగల్-ఖమ్మం పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేస్తున్న రాకేశ్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియదని తీన్మార్ మల్లన్నను ఉద్దేశించి విమర్శించారు. ఆయన మీడియాను అడ్డుపెట్టుకొని బ్లాక్ మెయిల్ చేస్తారని ఆరోపించారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని రేవంత్ రెడ్డి చెప్పారని... ఇప్పటికే ఐదు నెలలు పూర్తయిందని, మరో ఆరేడు నెలల్లో ఈ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు రావాలంటే మండలిలో బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తున్న రాకేశ్ రెడ్డిని గెలిపిస్తే ఆయన ప్రభుత్వాన్ని నిలదీస్తారన్నారు.

ఇవాళ కావాల్సింది అధికార స్వరాలు కాదు.. ధిక్కార స్వరాలు.. రావాల్సింది ప్రశ్నించే స్వరాలు అని అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రశ్నించే రాకేశ్‌రెడ్డి వంటి ఉత్సాహవంతుడు, యువకుడైన వ్యక్తి శాసనమండలికి ఎన్నిక కావాలని తెలిపారు. నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై పార్టీ నాయకులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమయ్యారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. నల్గొండ-ఖమ్మం-వరంగల్ ఉమ్మడి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గత నాలుగు పర్యాయాలు తమకు అవకాశమిచ్చారని కేటీఆర్ అన్నారు. గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు శాసనమండలిలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారని.. రావాల్సిన ఉద్యోగాలు, వసతుల విషయంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీలు నిబద్ధతతో పనిచేశారని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా వంచించిందో చూస్తూనే ఉన్నారని.. తొమ్మిదిన్నరేండ్లలో విద్యా వ్యాప్తికి, మౌలిక వసతుల కల్పనకు పనిచేసిందో చూశారని పేర్కొన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో పాటు, ప్రతి జిల్లాలో విద్యావ్యాప్తికి, విద్యావంతుల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కేసీఆర్ ప్రభుత్వం పనిచేసిందని తెలిపారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు దేశంలోనే అత్యధికంగా పే స్కేలు ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన 30 వేల ఉద్యోగాలు తానే ఇచ్చానని రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని విమర్శించారు. ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకుండా, ఒక్క పరీక్ష నిర్వహించకుండా 30 వేల ఉద్యోగాలు ఇచ్చానని రేవంత్ రెడ్డి బొంకుతున్నారని ఎద్దేవా చేశారు. గెలిచిన ఏడాదిలోపే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని రేవంత్ రెడ్డి మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఈప్రభుత్వానికి ఐదు నెలల కాలపరిమితి ముగిసిందని.. ఇంకా ఆరేడు నెలల్లో రెండు లక్షల ఉద్యోగాలు కావాల్సి ఉందన్నారు. ఈ ఉద్యోగాలు భర్తీ కావాలంటే.. ప్రశ్నించే గొంతు ఉండాలి, ప్రశ్నించే పార్టీ ఉండాలని స్పష్టం చేశారు. ప్రజలకు న్యాయం జరగాలి, విద్యావంతులకు న్యాయం జరగాలంటే.. ప్రశ్నించే రాకేశ్ రెడ్డి ఉత్సాహవంతుడైన యువకుడు శాసనమండలిలోకి రావాలని పిలుపునిచ్చారు. ఇవాళ కావాల్సింది అధికార స్వరాలు కాదు.. ధిక్కార స్వరాలు.. రావాల్సింది ప్రశ్నించే స్వరాలు అని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వాన్ని నిలదీసే స్వరాలు కావాలని అన్నారు. శాసన మండలిలో ఒక యువకుడు, ఉత్సాహవంతుడైన రాకేశ్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఎప్పటికప్పుడు పార్టీలు మార్చడమే కాకుండా, మీడియాను అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేసే వ్యక్తి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నాడని విమర్శించారు. ఆయన ఎప్పుడు ఏ పార్టీలో ఉంటాడో తెలియదని.. ఎప్పుడు ఎవర్ని నిందిస్తారో తెలియదని అన్నారు. గతంలో నల్గొండలో నయీంను చూశామని.. ఇటువంటి వ్యక్తులకు చట్టసభల్లో అవకాశమిస్తే అలాంటి వ్యక్తులను తయారు చేసినట్టు అవుతుందని విమర్శించారు.

## ఏ పార్టీకి ఎన్ని సీట్లు?

మొదటి పేజి తరువాయి

పార్టీలతోపాటు విశ్లేషకులు కూడా ఓ అంచనాకు వస్తున్నారు. ఇక లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు దక్కించుకోవడానికి తెలంగాణలో అధికార కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతోపాటు విపక్ష పార్టీ బీఆర్ఎస తీవ్రంగా శ్రమించాయి. కాంగ్రెస్ తరఫున సీఎం రేవంత్‌రెడ్డి అన్నీతానై నడిపించారు. పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, మల్లికార్జునఖర్గేలను కూడా రాష్ట్రానికి తీసుకువచ్చి ప్రచారం చేయించారు. ఇక బీజేపీ అయితే ప్రచారంలో దూకుడు ప్రదర్శించింది. షెడ్యూల్‌కు ముందు నుంచే ప్రధాని మోదీతోపాటు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, బీజేపీ జాతీయ అధ్యక్షుడు, పొరుగు రాష్ట్రాల ఎంపీలను రంగంలోకి దించింది. మిగతా పార్టీలకు అందనంతగా ప్రచారంలో దూకుడు ప్రదర్శించింది. ప్రధాని మోదీ ఏకంగా నాలుగుసార్లు తెలంగాణలో ప్రచారం నిర్వహించారు. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో తీవ్ర నైరాశ్యంలో ఉన్న ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు ఊపు తెచ్చేందుకు మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగారు బస్సు యాత్రతో పది నియోజకవర్గాలను చుట్టేశారు. మరోవైపు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు కూడా అభ్యర్థుల తరఫున ప్రచారంలో పాల్గొన్నారు. ఇక సోమవారం నిర్వహించిన తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో 64.93 శాతం పోలింగ్ నమోదైంది. పది స్థానాల్లో 70 శాతానికిపైగా పోలింగ్ నమోదవడం విశేషం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల నియోజకవర్గాలు మినహా రాష్ట్రంలోని మిగతా 13 స్థానాల్లో 60 శాతం నుంచి 70 శాతం వరకు ఓటింగ్ నమోదైంది. పెరిగిన ఓటింగ్ ఎవరికి లాభిస్తుందన్న చర్చ జరుగుతోంది. పార్టీలు ఎవరికి వారు అనుకూలంగా లెక్కలు వేసుకుంటున్నాయి. ఇక లోక్‌సభ నియోజకవర్గాల వారీగా నమోదైన పోలింగ్ శాతం పరిశీలిస్తే.. ఆదిలాబాద్‌లో 7.96, పెద్దపల్లిలో 67.88 శాతం, కరీంనగర్‌లో 72.33 శాతం, నిజామాబాద్‌లో 71.50 శాతం, జహీరాబాద్‌లో 74.54, మెదక్‌లో 74.38 శాతం, మల్కాజ్‌గిరిలో 50.12 శాతం, సికింద్రాబాద్‌లో 48.11 శాతం, హైదరాబాద్‌లో 46.08 శాతం, చేవెళ్లలో 55.45 శాతం, మహబూబ్‌నగర్‌లో 71.54 శాతం, నాగర్‌కర్నూల్‌లో 68.29 శాతం, మహబూబాబాద్‌లో 70.68 శాతం, వరంగల్‌లో 68.29 శాతం, ఖమ్మంలో అత్యధికంగా 75.19 శాతం పోలింగ్ నమోదైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్‌గిరిలో ఈసారి పోలింగ్‌శాతం బాగా తగ్గింది. హైదరాబాద్, సికింద్రాబాద్‌లో కూడా ఓటర్లు పెద్దగా స్పందించలేదు. ఇక కాంగ్రెస్‌కు కంచు కోటలుగా భావించిన భువనగిరి, ఖమ్మం నియోజకవర్గాల్లో ఈ ఎన్నికల్లో అత్యధిక శాతం పోలింగ్ నమోదైంది. ఈ రెండు నియోజకవర్గాల్లో పోలింగ్‌లో అగ్రస్థానంలో ఉన్నాయి. కరీంనగర్, జహీరాబాద్, ఆదిలాబాద్ లో కూడా అత్యధికంగా పోలింగ్ నమోదైంది. ఫలితాలు జూన్ 4న వెలువడనున్నాయి. ఓటర్లు ఎవరికి పట్టం కట్టారు అనేది ఆరోజు వెల్లడికానుంది.

## నేను హిందూ ముస్లిం పేరు ఎత్తలేదు..

ఢిల్ల : లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా తాను చేసిన 'అధిక సంతానం ఉన్నవారు' వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోదీ వివరణ ఇచ్చారు. తాను కేవలం ముస్లింలను ఉద్దేశించి అనలేదని.. అధిక సంతానంతో ఇబ్బంది పడుతున్న ప్రతి పేద కుటుంబం గురించి ఆ మాటలు అన్నానని స్పష్టం చేశారు. ఒకవేళ హిందూవులు, ముస్లింలంటూ తాను వేరు చేసి మాట్లాడితే ఆ రోజు నుంచి ప్రజాజీవితంలో కొనసాగే అర్హత కోల్పోతానని వ్యాఖ్యానించారు. న్యూస్ 18 చానల్ కు తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ అంశంపై ప్రధాని సుదీర్ఘంగా మాట్లాడారు. 'నేను ముస్లింల పట్ల ప్రత్యేక ప్రేమ కనబరచను. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం నేను పనిచేయను. అందరితో కలసి అందరి అభివృద్ధి అనే నినాదాన్నే నమ్ముతాను. కానీ నేను ఆ మాటలు అన్నట్లు ప్రచారం కావడం నన్ను షాక్ కు గురిచేసింది. అధిక సంతానం ఉన్నవారి గురించి నేను మాట్లాడితే అది ముస్లింలను ఉద్దేశించే అని ఎవరు చెప్పారు? పేద కుటుంబాలన్నింటిలోనూ ఈ పరిస్థితి నెలకొంది. పేదరికం ఉన్న చోట మతంతో సంబంధం లేకుండా అధిక సంతాన సమస్య ఉంటుంది. నేను హిందువు లేదా ముస్లిం పేరు ఎత్తలేదు. ఎందరు పిల్లల బాగోగులు చూసుకోగలరో అంతమందినే కనాలి. ప్రభుత్వమే మీ పిల్లల బాగోగులు చూసుకోవాలనే పరిస్థితి కల్పించకూడదు' అని మోదీ వ్యాఖ్యానించారు. తాను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు 2002లో గోధ్రా రైలు దహనం ఘటన అనంతరం జరిగిన అల్లర్ల గురించి మోదీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. గోధ్రా అల్లర్ల పేరుచెప్పి ముస్లింలలో తనకున్న ఇమేజ్ ను తన రాజకీయ ప్రత్యర్థులు చెడగొట్టారని మోదీ పేర్కొన్నారు. 'ఇది ముస్లింలకు సంబంధించిన అంశం కాదు. ముస్లింలు వ్యక్తిగతంగా తనను ఎంతగా అభిమానించినా వారు ఏది చేయాలో, ఏది చేయకూడదో ఓ నిరంతర ఆలోచనా తరంగం వారిని నిర్దేశిస్తుంది. నా ఇంటి చుట్టుపక్కల ముస్లిం కుటుంబాలే నివసిస్తున్నాయి. ఈద్ పండుగ రోజు మా ఇంట్లో వంట చేసుకొనే వాళ్లం కాదు. ముస్లిం కుటుంబాల ఇళ్ల నుంచే మాకు వంటకాలు వచ్చేవి. నేను అలాంటి ప్రపంచంలో పెరిగా. ఇవాళ్టికీ నా స్నేహితుల్లో చాలా మంది ముస్లింలు ఉన్నారు. కానీ 2002 గోధ్రా అల్లర్ల తర్వాత నా ఇమేజ్ ను చెడగొట్టారు' అని మోదీ చెప్పారు. ప్రస్తుత లోక్ సభ ఎన్నికల్లో ముస్లింలు మీకు ఓటు వేస్తారని భావిస్తున్నారా? అనే ప్రశ్నకు మోదీ తనదైన శైలిలో బదులిచ్చారు. దేశ ప్రజలంతా తనకు ఓటు వేస్తారని చెప్పారు. హిందూ ముస్లింలంటూ వేరు చేసి మాట్లాడిన రోజున తాను ప్రజాజీవితంలో కొనసాగే అర్హత కోల్పోతానన్నారు. అందుకే హిందూ, ముస్లిం పేరుతో రాజకీయాలు చేయనని, ఇది తన ప్రతిజ్ఞ అని ప్రధాని తెలిపారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలందరి దగ్గర ఉన్న బంగారం, ఆస్తులను స్వాధీనం చేసుకొని అధిక సంతానం ఉన్న వారికి పంచిపెడుతుందంటూ ప్రధాని మోదీ రాజస్తాన్ లో ఇటీవల చేపట్టిన ఎన్నికల ప్రచార సభలో వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ గెలిస్తే మహిళల మెడలోని మంగళసూత్రం సహా బంగారం అంతా లాక్కుంటుందని ఆరోపించారు. అయితే ముస్లింలను ఉద్దశించే మోదీ ఈ వ్యాఖ్యలు చేశారంటూ విపక్షాలు దుమ్మెత్తిపోశాయి.

# బాబు ప్రమాణం అక్కడ నుంచేనా ?

మొదటి పేజి తరువాయి



ప్రమాణం చేస్తారా అన్న దాని మీద కూడా పసుపు శిబిరంలో నేతలు అంతా ఆలోచిస్తున్నారు. జగన్ విశాఖలో అంటే దానిని రాజధానిగా చేస్తున్నామన్న సిగ్నల్స్ ఇచ్చేందుకు. చంద్రబాబు నినాదం అమరావతి కాబట్టి ఆయన ప్రమాణం అక్కడే ఉంటుంది ఉండాలని అంటున్నారు. టీడీపీకి ఈసారి పెద్ద ఎత్తున సీట్లు వస్తాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. తెలుగుదేశం పార్టీ కూటమి 2014లో పోటీ చేస్తే 106 సీట్లు సాధించింది. ఈసారి బలమైన వేవ్ ఉంది కాబట్టి 140 సీట్లకు తగ్గవని కూటమి నేతలు అంచనా వేస్తున్నారు. బీజేపీకి ఇచ్చిన సీట్లలో కూడా సగం దాకా గెలుస్తారని అలాగే జనసేన సీట్లు 15 కంటే ఎక్కువే తప్ప తగ్గవని అంచనా కడుతున్నారు. ఇవన్నీ కలిపిస్తే 140 పై దాటిపోతాయని లెక్క వేస్తున్నారు. తెలుగుదేశం ఇచ్చిన హామీలను ఆ పార్టీ నిబద్ధతను అభివృద్ధిని చూసే పట్నం, పల్లె అన్న తేడా లేకుండా ఓటెత్తారు అని అంటున్నారు. ఇచ్ఛాపురం నుంచి అనంతపురం దాకా ఒకే రకమైన పోలింగ్ సరళి నమోదు అయింది అని అంటున్నారు. ఫలితాలు పూర్తి సానుకూలంగా ఉంటాయని జూన్ 4న తొలి ట్రెండ్స్ లోనే విజయం ఖాయం అవుతుందని కూడా కూటమి నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక ఎంపీ సీట్ల విషయం తీసుకుంటే ఒకే ఒక్క సీటు తప్ప 24 సీట్లూ తమవే అని అంటున్నారు. ఆ ఒక్క ఎంపీ సీటు ఎక్కడో ఏమిటో చెప్పడం లేదు. ఏపీలో అన్ని వర్గాలూ అయిదేళ్ళ పాటు జగన్ పాలనలో పూర్తిగా విసిగిపోయాయని దాని ఫలితమే ఈ తీర్పు అని అంటున్నారు పల్లెలు పట్నాలు అన్న తేడా ఎపుడూ లేదని, ఆ వర్గీకరణ అసలు కుదరదని, ఒకే మాట ఒకే బాట అన్నట్లుగా ఏపీ తీర్పు ఉంటుందని అది గతంలో రుజువు అయిందని ఈసారి కూడా అదే జరుగుతుందని కూడా టీడీపీ నేతలు అంటున్నారు. మొత్తం మీద చూస్తే చంద్రబాబు ప్రమాణ స్వీకారం ఎపుడు అంటే కేంద్రంలో మోదీ ప్రధానిగా ప్రమాణం చేసాక ఆయన్ని ముఖ్య అతిథిగా తీసుకుని వచ్చి మరీ తాము చేస్తామని టీడీపీ నేతలు అంటున్నారు.

# ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై 'నో కామెంట్' అన్న కిషన్ రెడ్డి...

సమాధానం చెప్పే వరకు
వదలని మీడియా

ఢిల్లీలో కిషన్ రెడ్డి మీడియా
సమావేశం

ఎన్డీయే అలయెన్స్‌లో ఉంది
కదా ఏం చెబుతారని
ప్రశ్నించిన మీడియా

తెలంగాణ అధ్యక్షుడిగా
మాట్లాడుతున్నానన్న కిషన్ రెడ్డి

కేంద్రమంత్రిగా ఏం
సమాధానం చెబుతారని
ప్రశ్నించిన జర్నలిస్టులు

ఏపీలో ఎన్డీయే కచ్చితంగా
గెలుస్తుందన్న కిషన్ రెడ్డి



ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి స్పందించేందుకు నిరాకరించారు. బుధవారం ఆయన ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు ఏపీ రాజకీయాలపై ప్రశ్నించారు. దానికి కిషన్ రెడ్డి 'నో కామెంట్' అన్నారు. ఏపీలో ఎన్డీయే అలయెన్స్ ఉంది కాబట్టి ఏం చెబుతారని మీడియా ప్రతినిధులు అడగగా... తాను తెలంగాణ అధ్యక్షుడిగా మాట్లాడుతున్నానని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఏపీలో ఎన్డీయే అలయెన్స్ ఉందని, మీరు కేంద్రమంత్రిగా ఏం మాట్లాడుతారని మీడియా ప్రతినిధులు తిరిగి ప్రశ్నించారు. దీనికి కిషన్ రెడ్డి స్పందిస్తూ... తాను ఒకటి మాత్రం చెప్పగలనని... కచ్చితంగా ఆంధ్రాలో ఎన్డీయే గెలుస్తుందని చెప్పగలనని వ్యాఖ్యానించారు. తమకు దేశవ్యాప్తంగా 400 సీట్లు కచ్చితంగా వస్తాయని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ప్రచారం అంత బాగా లేదని చెబితే... మరి రాహుల్ గాంధీ ప్రచారం బాగుందా? అని ప్రశ్నించారు. తెలంగాణలో డబుల్ డిజిట్ వస్తుందని చెప్పామని... కానీ ఎన్ని సీట్లు వస్తాయో చెప్పలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ మినహాయించి... తెలంగాణలో, దేశవ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. 'రెండు పార్టీల మధ్య, అభ్యర్థుల మధ్య నిరాశ, నిస్పృహలు ఉండవచ్చు.. పట్టుదల ఉండవచ్చు. రాయలసీమలో ప్రశాంతంగా జరిగాయి. గుంటూరులో కాస్త గొడవలు జరిగినట్లు తెలుస్తోంది. నాకు ఇంకా ప్రత్యక్షంగా సమాచారం రాలేదు' అన్నారు.

# సీనియర్ జర్నలిస్ట్ అయోధ్య రామయ్య పై జరిగిన దాడిని ఖండిస్తున్నా

### తెలంగాణ ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏ అజీమ్



మానుకోట జిల్లా (**గౌతమ్ న్యూస్** ): మానుకోట జిల్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏ అజీమ్ మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్యలో వారసులుగా ఉంటూ ప్రజల గొంతును ప్రభుత్వము వరకు చేర్పించే జర్నలిస్టు మిత్రులపై దాడులు జరగడం సిగ్గుచేటు. జర్నలిస్ట్ వృత్తిలో ఉన్నటువంటి వారు ఎటువంటి ఆదాయాలు లేకుండా స్వార్థం లేకుండా ప్రజాసేవ కంకితమై ప్రజల సమస్యలను ప్రభుత్వం వరకు చేర్చి ఆ సమస్యల పరిష్కారానికి వారి పాత్ర చాలా ప్రాముఖ్యమైనది, అటువంటి జర్నలిస్టులపై దాడులు చేయడం జర్నలిస్టులకు ఇబ్బంది కలిగించడం చాలా బాధాకరం స్వేచ్ఛగా వార్తలను రాసే జర్నలిస్టులపై ఇకముందు ఎటువంటి దాడులు జరగకుండా ప్రభుత్వాలు చట్టపరమైన సహాయ సహకారాలు అందించి, దాడులు చేసినటువంటి వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# మల్లు రవి గెలుపు ఖాయం

### తెలంగాణలో కాంగ్రెస్ ప్రభంజనం
### సీనియర్ లీగల్ సెల్ న్యాయవాది
### పెద్దిరెడ్డి దామోదర్ రెడ్డి



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(**గౌతమ్ న్యూస్** ): పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభంజనం వీస్తుందని నాగర్కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవి గెలుపు ఖాయమైందని నాగర్ కర్నూల్ జిల్లా లీగల్ సెల్ సీనియర్ న్యాయవాది పెద్దిరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు, ఎన్నికల పోలింగ్ సరళిని బట్టి చూస్తే తెలంగాణ రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని మహబూబ్నగర్ ,నాగర్ కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గం లోని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు డాక్టర్ మల్లురవి నాగర్ కర్నూల్ ఎంపీగా మహబూబ్నగర్ ఎంపీగా చల్లా వంశీచంద్ర రెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని దామోదర్ రెడ్డి అన్నారు, గత టిఆర్ఎస్ ప్రభుత్వం ఈ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిందని అందువల్లనే ఈ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రజలు ఓట్లతో తగిన గుణపాఠం చెప్పినట్లు ఆయన వెల్లడించారు, అదేవిధంగా బిజెపి కేంద్రంలో 10 సంవత్సరాల పరిపాలించిన నరేంద్ర మోడీ దేశ ప్రజలకు చేసింది శూన్యమని ఆయన విమర్శించారు, దేశంలో రైతాంగం అప్పుల ఊబిలో విలవిలాడుతున్నప్పటికీ రైతులకు సబ్సిడీపై ఎరువులు పంట రుణాలు సకాలంలో ఇవ్వని బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని రైతుల పట్ల పేద బడుగు బలహీన వర్గాల ప్రజల పట్ల బీజేపీ చిత్తశుద్ధితో పనిచేయలేదని అందుకే బిజెపి కేంద్రంలో మూడోసారి ప్రజలు ఇంటికి పంపించే రోజులు దగ్గర ఉన్నాయని దేశవ్యాప్తంగా ప్రధాని రాహుల్ గాంధీ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఇక్కడ చూసిన ప్రజలు దేశ భవిష్యత్తు కోసం సంక్షేమ పథకాల అమలు కోసం రైతుల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో రావాలని ప్రధాన మంత్రి రాహుల్ గాంధీ కావాలని అప్పుడే ఈ భారతదేశం అభివృద్ధి పథంలో పురోగమనం చెందుతుందని ఆయన అన్నారు, ఎవరు ఎన్ని లెక్కలు చేసినా తెలంగాణలో కాంగ్రెస్ విజయ పదములు దూసుకుపోవడం ఖాయమని పెద్దిరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు, రాష్ట్రంలో టిఆర్ఎస్ బిజెపి పార్టీలకు ఈ పార్లమెంటు ఎన్నికల ఫలితాల తర్వాత ఆ పార్టీలు కార్యాలయాలు అద్దెకు ఇచ్చుకోవాలని ఆ సమయం ఆసన్నమైందని ఆయన సూచించారు,

## జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి


### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(**గౌతమ్ న్యూస్** ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్ట్ లో జూన్ 8వ తారీకున (శనివారం) జరిగే జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాబట్టి మీ మీద కానీ, మీకు తెలిసిన వాళ్ల మీద కానీ, మీ బంధువుల మీద కాని ఏమైనా కేసులు ఉన్నట్లైతే వాటిని (కాంప్రమైజ్ ) రాజీ చేసుకోవచ్చని అన్నారు. 1.యాక్సిడెంట్ కేసులు 2.సివిల్ కేసులు 3.చీటింగ్ కేసులు 4.చిట్ ఫండ్ కేసులు 5.భూతగాదాలు కు సంబంధించిన కేసులు 6.వివాహ బంధానికి సంబంధించిన కేసులు 7.చిన్నచిన్న దొంగతనం కేసులు 8.ట్రాఫిక్ చాలాన్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 9. కుటుంబ తగాదాలు 10. బ్యాంకు కేసులు11. టెలిఫోన్ కేసులు 12. కొట్టుకున్న కేసులు 13. సైబర్ క్రైమ్ కేసులు ఈ లోకదాలత్ లో రాజీ చేసుకుని, కేసును పూర్తిగా క్లోజ్ చేసుకునే అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## హన్మకొండ డిటిడిఓ అవినీతి అధికారిపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలి

### ఎల్ హెచ్ పి ఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్



హన్మకొండ(**గౌతమ్ న్యూస్** ): గిరిజన శాఖ లో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న హన్మకొండ, జనగాం జిల్లాలో డిటిడిఓ గా పని చేస్తున్న ప్రేమకల రెడ్డిపై చర్యలు తీసుకోవాలనీ లంబాడి హక్కుల పోరాట సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ రాష్ట్ర ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. ఈ సంధ్భంగా మాట్లాడుతూ.. గత మూడు సంవత్సరాలుగా గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తూ అశ్రమ పాఠశాలలు, పోస్టుమట్రిక్ హాస్టల్లలో పనిచేస్తున్న వార్డెన్, కాంటిజెన్స్ ఉద్యోగులను అనేక రకాలుగా ఇబ్బంది పెడుతూ ఎలాంటి కారణాలు లేకుండా ట్రాన్స్ఫర్, సస్పెండ్ చేస్తూ ఉద్యోగులకు భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.ఒక్కొక్క వార్డెన్ కు



రెండు మూడు హాస్టల్లో బాధ్యతలు ఇచ్చి వారి దగ్గర నుండి డైట్ బిల్లులలో 20% డబ్బులు వసూలు చేసి అక్రమ సంపాదనకు పాల్పడుతున్న అధికారినిపై చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బానోతు గోవింద్ నాయక్ వరంగల్ జిల్లా అధ్యక్షులు, బాధవత్ భాస్కర్ నాయక్, మోహన్ నాయక్, రాజు నాయక్, ఈర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు

## నిరుద్యోగుల సమస్యలకు పరిష్కార మార్గం చూపుతా..!



హన్మకొండ(గౌతమ్ న్యూస్ ): హనుమకొండలో బుధవారం జరిగిన ప్రచారంలో వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఎమ్మెల్సీ అభ్యర్థి పాలకూరి అశోక్ కుమార్ మాట్లాడుతూ...ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే.. నిరుద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపుతానని, నిరుద్యోగుల గొంతుకై గళమెత్తుతానని అన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు తనను ఆదరించి సీరియల్ నెంబరు 18 పై మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.

# అత్యవసర వాహనాలను ఆకస్మిక తనీకి చేసిన జిల్లా ఎగ్జిక్యూటివ్ మేనేజర్ చంద్రశేఖర్

ఏటూరునాగారం(**గౌతమ్ న్యూస్** ): ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్: మానవ మనుగడలో అత్యవసర పరిస్థితులు ఏ క్షణాన ఎటు నుండి పొంచి ఉన్నాయో ఎవరం ఉహించలేము, కాలు బయటికి



పెడితే చాలు సురక్షంగా ఇంటికి తిరిగి వస్తామో లేదో కూడా తెలియదు,ఎక్కడ ఏ వాహనం ఢీకొడుతుందో, ఏ క్షణాన ఏ వ్యాధి గురవుతామో అని అలాంటి సందర్భాన మనకు టక్కున గుర్తొచ్చేది అంబులెన్స్ సమాచారం అందించిన క్షణాల్లోనే వాలిపోయి ఊపిరి పోస్తుంది, ఆసుపత్రులకు చేరవేస్తుంది, పేద, సదా తేడా లేకుండా సామాజిక ప్రజలందరికీ ఆపద వస్తే ఇంటి నుండి దవాఖాన వరకు ఉచితంగా సేవలందించే ఉపకారి ప్రజలకు అందుబాటులో ఉండి ఉపకారిగా సేవాలందించాలనటున్నారు ములుగు జిల్లా 108, 102



కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్.ములుగు జిల్లాలోని ఏజెన్సీ జిల్లా కన్నాయిగూడెం 108,అంబులెన్స్ ను బుధవారం రోజున ఆకస్మిక తనిఖీ చేసి వాహనాల్లో అత్యవసర పరిస్థితులకు అందించే మందులు ,రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి కావాల్సిన పరికరాలు,ఎండాకాలం వడ దెబ్బ తగిలిన పెసెంట్ కి అందిస్తున్న ప్రథమ చికిత్సల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే కావాల్సిన మందులు ఉన్నాయా లేదా అని పరికరాలను పరిశీలించారు. అనంతరం 108 నుండి ప్రమాద సమాచారం అందిన వెంటనే భాదితుని విషయానికి స్పందించాలని సిబ్బంది24 గంటలు



అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వాహనాల్లో కాలం చెల్లిన మందులను వాడకూడదని ఎల్లప్పుడూ అన్ని రకాల కావాల్సిన మందులు,గ్లూకోసులు, రోడ్డు ప్రమాద పరికరాలు, ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అలాగే సిబ్బంది సమయానికి అందుబాటులో ఉండాలని సంబంధిత వాహనాలు,మందుల నిల్వలు ,హాజరు రికార్డులను తనిఖీ చేసి పలు సూచన,సలహాలు చేశారు.అత్యవసర పరిస్థితులకు గాను ప్రజలు108 కి సమాచారం అందించే ఉచిత సేవలను వినియోగించుకోవాలని సూచించారు.ఈ తనికీల్లో కన్నాయిగూడెం108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి మల్లారెడ్డి, పైలట్ రాము, ఉన్నారు.

# కాంగ్రెస్ లో హీరో ఎవరు జీరో ఎవరు!!

### తలలు పట్టుకుంటున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు!!
### బి , ఫామ్ ఇచ్చేది నేనే అంటే నేనే!!
### స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎదురీత తప్పదు!!

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(**గౌతమ్ న్యూస్** ): అసెంబ్లీ ఎన్నికలు ఏదోరకంగా ఏదో ఒక హామీలు ప్రజలను ఆకట్టుకునే విధంగా అధికారమే లక్ష్యంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఈ తెలంగాణలో స్వల్ప మెజార్టీతోను కేవలం 64 సీట్లతో టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని 10 సంవత్సరాలు పాలించినప్పటికీ కెసిఆర్ మేధాశక్తిని



రాజకీయాన్ని కాంగ్రెస్ పార్టీ తిప్పి కొట్టి అధికారంలోకి రావడం గొప్ప విశేషం, అయినప్పటికీ ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ చూసినా ప్రతి నియోజకవర్గంలో గ్రూప్ తగాదాలు గ్రూప్ రాజకీయాలు వర్గ విభేదాలు కాంగ్రెస్ పార్టీకి వెంటాడుతూ వచ్చాయి, అయినప్పటికీ పార్లమెంట్ ఎన్నికలు కూడా పూర్తయ్యాయి ,ఎన్నికల్లో విజయం ఎవరిది పరాజయం ఎవరిది అన్న సంగతి పక్కన పెట్టినప్పటికీ రాబోయే రెండు నెలల లోపల స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్నాయి, ఈ ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీకి పెద్ద చాలెంజిగా ఉండబోతున్నాయి, పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో అధిక సీట్లు సాధించి కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తప్ప ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మనుగడ సాధించడం సాధ్యం కాదు, ఇచ్చిన ప్రతి హామీ కూడా కేంద్రంలో వచ్చే ప్రభుత్వం బట్టి ఈ రాష్ట్రంలో అమలవుతాయని సంగతి స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం ఈ రాష్ట్ర ప్రజలు కూడా గమనించారు, రెండు లక్షల రుణమాఫీ తో పాటు డిసెంబర్ లోపు రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయడం రైతు భరోసా కింద ఎకరాకు 7500 ఇంటర్మీడియట్ చదువుతున్న మహిళలకు ఉచితంగా స్కూటీలు తో పాటు అనేక ఎన్నికల హామీలు ఈ ప్రభుత్వం అమలు చేసేది సాధ్యం కాదు ఒకవేళ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తెలంగాణ రాష్ట్రంలో మరో 10 సంవత్సరాల పాటు కాంగ్రెస్ ప్రభుత్వానికి తిరుగు లేదని చెప్పవచ్చు దేశ ప్రజలు దేశ భవిష్యత్తు కోసం తమ ఓటు హక్కును బిజెపి ప్రభుత్వానికి ప్రధాని నరేంద్ర మోడీని మరోసారి ప్రధానమంత్రి చేయాలని దృఢ సంకల్పం ఉన్నట్లు ప్రాథమిక సమాచారం ప్రకారం తెలిసింది, మరోపక్క రాహుల్ గాంధీ ప్రధానమంత్రి చేయాలని సంకల్పంతో భారత్ జోడోయాత్ర వల్ల కాశి నుంచి కన్యాకుమారి వరకు భారతదేశాన్ని తన పాదయాత్ర ద్వారా రాహుల్ గాంధీ చేసిన పాదయాత్ర ఫలితం ఉంటుందా లేదా అనే అనుమానాలు కూడా ఉన్నాయి, ఎవరి సంగతి ఎలా ఉన్నప్పటికీ నాగర్ కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గంలోని కొల్లాపూర్ వనపర్తి లో కాంగ్రెస్ పార్టీలో కరుడుగట్టిన సీనియర్ నాయకులు చలామణి అవుతున్నారు, సీనియర్లకు, జూనియర్లకు



మధ్యన ఈ పార్లమెంటు నియోజకవర్గం లో వర్గ భేదాలు ఆధిపత్య పోరు కాంగ్రెస్ పార్టీని వెంటాడుతుంది, పార్టీలు మారిన కండవలు మారిన ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఈ మధ్యకాలంలో కాంగ్రెస్ పార్టీ నాది అంటూ నేనే రారాజును అనే రీతిలో పనిచేస్తున్న కొంతమంది నాయకులకు కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం నుంచి ఇందిరా గాంధీ పార్టీ స్థాపించినప్పటి నుంచి పని చేసిన సీనియర్ నాయకులను పక్కనపెట్టి ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేలామనవుతున్నారని కాంగ్రెస్ పార్టీ కరడు కట్టిన సీనియర్ నాయకులు ఇందిరాగాంధీ కుటుంబంలో ఒక సభ్యుడుగా అనేక కీలక అనుభవించిన జి చిన్నారెడ్డి అసంతృప్తితో



రగులుతున్నారని తెలుస్తుంది, చిన్నారెడ్డికి పలుకుబడి ఉన్నప్పటికీ మచ్చలేని నాయకునిగా పేరు ఉన్నప్పటికీ ఈ మధ్యకాలంలో కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేసి ఆ తర్వాత టిఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకున్న జూపల్లి కృష్ణారావు తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరడం రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టడం తోపాటు వనపర్తి శాసనసభ్యులుగా గతంలో టిఆర్ఎస్ పార్టీలో ఒక మండల పరిషత్ అధ్యక్షునిగా పనిచేసిన మేఘా రెడ్డి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ తెచ్చుకోవడం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో గాలిలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలవడం మాజీ కాంగ్రెస్ పార్టీ మంత్రి ప్రస్తుత ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి చిన్నారెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారు, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో రాష్ట్ర ఎక్సైజ్ పర్యటక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన జూపల్లి కృష్ణారావు వర్గ విభేదాలు సృష్టిస్తున్నాడని ఆయన రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ పార్టీని భ్రష్టు పట్టిస్తున్నాడని చిన్నారెడ్డి వర్గం పదేపదే ఆరోపిస్తున్నారు, వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డికి చిన్నారెడ్డి మధ్యన జూపల్లి కృష్ణారావు చిచ్చు పెట్టడం జరుగుతుందని రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో సర్పంచ్ ఎంపీటీసీ ,సభ్యులకు బి ఫారాలు కాంగ్రెస్ పార్టీ నుంచి నేనే ఇస్తానని వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి అంటున్నారు, దీన్ని బట్టి చూస్తే వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో గ్రామాలలో సర్పంచ్ స్థానాలు వనపర్తి ఎమ్మెల్యే జి ,చిన్నారెడ్డి మధ్యన పార్టీ అభ్యర్థులను ఎంపిక చేయడంలో రసభస ,గుసగుసలు డి అంటే డి అనే రీతిలో కొనసాగక తప్పదు, ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జోక్యంచేసుకుంటే తప్ప సమస్య సర్దుమనే పరిస్థితిలో లేదు, మొత్తం మీద ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో ఎక్కడలేని వర్గా పోరు వర్గ విభేదాలు వనపర్తి నియోజకవర్గం లో కనిపిస్తున్నాయని చెప్పవచ్చు, రాజకీయాల్లో రాటు తేలిన జూపల్లి కృష్ణారావు ఇటీవల కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఆయన



కంటే ముందు కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసి కాంగ్రెస్ పార్టీని కొల్లాపూర్ నియోజక వర్గం లో బలోపేతం చేసిన సి, జగదీశ్వరరావును ఇటీవల కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు అప్పజెప్పడం ఆ తర్వాత కొల్లాపూర్ లో తనకంటూ మరొకరు ఉండకూడదు అనే ఉద్దేశంతో బీసీ నాయకుడిగా ప్రజా డాక్టర్ గా కొల్లాపూర్ నియోజక వర్గంలో పేరుపొందిన పగిడాల శ్రీనివాసరెడ్డిని కూడా కొల్లాపూర్ రాజకీయాలనుంచి జూపల్లి కృష్ణారావు దూరం చేస్తున్నాడని ఆరోపణలు వస్తున్నాయి, అందుకే ఇటీవల ప్రజా డాక్టర్ గా కాంగ్రెస్ పార్టీలో ఇటీవల చేరిన పగిడాల శ్రీనివాసరెడ్డి కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని వదిలిపెట్టి తన రాజకీయ భవిష్యత్తు వనపర్తిలో తప్ప మరి ఎక్కడా లేదని ఇటీవల కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు ఎన్నికల్లో మల్లురవి గెలుపు కోసం వనపర్తి లో ఆయన ప్రచారాన్ని నిర్వహించడమే ఇందుకు కారణం అని చెప్పవచ్చు, పగిడాల శ్రీనివాసరెడ్డి గతంలో తెలుగుదేశం పార్టీలో కీలకంగా పని చేసి ఇటీవల కాంగ్రెస్ పార్టీ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో చేరారు, ఆయనకు కొల్లాపూర్ లో కాంగ్రెస్ పార్టీలో ఏ ఇతర పార్టీలో ఉన్నా కూడా బీసీ ముదిరాజ్ కుటుంబానికి చెందిన నాయకునిగా కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఆయనకంటూ ఒక బలం ఉంది, ఈ విషయం తెలుసుకున్న జూపల్లి కృష్ణారావు రాబోయే రాజకీయ భవిష్యత్తులో తనకు ప్రమాదం ఉంటుందని ముందుగా భావించి శ్రీనివాసరెడ్డిని వనపర్తి నియోజకవర్గంలో ప్రచారం చేసే విధంగా పంపించినట్లు తెలుస్తుంది, ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డికి తెలవక పోయినప్పటికీ తొందరలోనే రాజకీయ సునామి వచ్చినప్పుడు అసలు విషయం బయటకు వస్తుందని పలువురు అంటున్నారు, మొత్తం మీద స్థానిక సంస్థల ఎన్నికల్లో వనపర్తి నియోజకవర్గంలో బి ఫారం ఇచ్చే నాయకుడు ఎవరు అనే అనుమానం కార్యకర్తల్లో నెలకొన్నది ఏమి జరుగుతుందో వేచి చూడాలి,

# జూపల్లి నాయకత్వంలో మల్లు రవికి మెజార్టీ

## ఎంపిటిసి రమాదేవి

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(**గౌతమ్ న్యూస్** ): పార్లమెంటు ఎన్నికల్లో కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పాన్ గల్ మండలం చింతకుంట, మల్లయ్య పల్లి, గ్రామంలో రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి కృష్ణారావు ఆదేశాల మేరకు చింతకుంట, మల్లయ్య పల్లి గ్రామాలలో నాగర్ కర్నూల్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మల్లు రవికి భారీ మెజార్టీ రావడం ఖాయమని ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ సభ్యురాలు బాధగౌని రమాదేవి అన్నారు, మంగళవారం ఆమె గౌతమ్ న్యూస్ ప్రతినిధితో మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ఆగస్టు 15 లోపు రెండు లక్షల రుణమాఫీ రైతు భరోసా కింద ఎకరాలు 7500 ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేసి తెలంగాణ రాష్ట్ర ప్రజల రుణం తీర్చుకుంటామని ఆమె చెప్పారు, నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో తెలంగాణ రాష్ట్రంలో రాజకీయాలలో రాటు తేలిన నాయకునిగా పేరు పొందడం కొల్లాపూర్ నియోజక వర్గ ప్రజలకు గర్వకారణమని ఈ సందర్భంగా అన్నారు, ఏది ఏమైనప్పటికీ చింతకుంట, మల్లయ్య పల్లి గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి తిరుగులేని మెజార్టీ కట్ట పెట్టడం జరిగిందని ఎందుకోసం పనిచేసిన చింతకుంట, మల్లయ్య పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలకు 24 గంటలు పని చేసిన ప్రతి ఒక్కరికి ఆమె పేరు ధన్యవాదాలు తెలిపారు



## అనకాపల్లి రింగరోడ్డు జనసేన పార్టీ కార్యాలయంలో బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర




అనకాపల్లి (గౌతమ్ న్యూస్ ): అయన మాట్లాడుతూ ఈ ఐదు సంవత్సరాలు కుటుంబాన్ని వదిలి, పార్టీయే ప్రాణంగా ఆర్థికంగా, సామాజికంగా, అన్ని విధాల పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి, 13వ తారీకునా జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా కొణతాలు రామకృష్ణ కి గాజు గ్లాస్ పై, ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ కి కమలం గుర్తుపై ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలుపుతూ, ముఖ్యంగా మాజీ శాసనసభ్యులు, అనకాపల్లి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పీలా గోవింద్ సత్యనారాయణ గత 50 రోజుల నుండి అనకాపల్లి ఎమ్మెల్యే సీటు పొత్తులు లో భాగంగా జనసేన పార్టీకి కేటాయించిన కొణతాల రామకృష్ణ కి, ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ కి, గెలుపు కోసం అనకాపల్లి నియోజకవర్గం అంతా పర్యటించి, అందర్నీ చైతన్యపరిచి, గెలుపుకు కృషి చేసిన గోవింద్ గారిని తెలుగుదేశం పార్టీ నాయకులు అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా పీలా గోవింద్ మాట్లాడుతూ కచ్చితంగా రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతారని, మన అనకాపల్లి పార్లమెంటులో అధిక స్థానాలు గెలుచుకుంటున్నామని, మన కొణతాల రామకృష్ణ కి 30 వేలు పైగా, సీఎం రమేష్ కి 80,000 పైగా మెజార్టీ వస్తుందని ఈ గెలుపు కోసం కృషి చేసిన తెలుగుదేశం, జనసేన, బిజెపి, ఉమ్మడి పార్టీ నాయకులు అందరికీ పేరుపేరునా ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొణతాల రామకృష్ణ అల్లుడు బీమెరాశెట్టి రాంకీ, పోలవరపు త్రినాధ్, బొద్దప్పు ప్రసాద్, అధిక స్థాయిలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బగలాముఖీ శక్తిపీఠంలో అత్యంత వైభవంగా శ్రీబగలాముఖీ అమ్మవారి ఆవిర్భావోత్సవ వేడుకలు!

### కమనీయంగా సాగిన శ్రీబగలాముఖీ అమ్మవారికి పూర్ణకుంభ, హరిద్రార్చిత, స్వర్ణజల అభిషేక మహోత్సవములు!!





నర్సాపూర్(గౌతమ్ న్యూస్ ): దేశంలోనే ప్రప్రథమంగా మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో నిర్మితమైన శ్రీబగలాముఖీ శక్తిపీఠంలో మహాద్భుతమైన మహాకార్యం బుధవారం ఆవిష్కృతమైనది. శ్రీబగలాముఖీ అమ్మవారి ఆవిర్భావోత్సవ (జన్మదినోత్సవ) వేడుకలు అమ్మవారి ఉపాసకులు, బ్రహ్మర్షి శాస్త్రుల లక్ష్మీ - వెంకటేశ్వర శర్మ గురుదేవుల ఆశీస్సులతో వేదపండితులు, బ్రహ్మర్షి గంగవరం ఆంజనేయ శర్మ, బగలాముఖీ ట్రస్టు సభ్యులు శాస్త్రుల పురుషోత్తం శర్మ, ఆలయస్థానార్చకులు బిందు సంతోష్ కుమార్ శర్మ సారథ్యంలో అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది. శ్రీబగలాముఖీ అమ్మవారికి పూర్ణకుంభ, హరిద్రార్చిత, స్వర్ణజల అభిషేక మహోత్సవములను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరిగినది. పూర్ణకుంభజలంలో బగలా అష్టోత్తర శతనామమంత్ర, హరిద్రార్చన, పీతాంబరా పూర్ణకలశపూజలను కమనీయంగా నిర్వహించడం జరిగినది. జన్మదినోత్సవ వేడుకల సందర్భంగా శ్రీబగలాముఖీ అమ్మవారికి దివ్యమైన అలంకరణతో పాటు మంగళనీరాజనం, మంత్రపుష్పం కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారి ఆవిర్భావోత్సవ వేడుకల సందర్భంగా బగలాముఖీ నామస్మరణతో శక్తిపీఠం పరిసరాలన్నీ మార్మోగిపోయాయి. అమ్మవారి భక్తులందరి సమక్షంలో ఇంతటి మహత్తరమైన, అరుదైన, ఆధ్యాత్మిక కార్యక్రమాలను అ మహాద్భుతంగా నిర్వహించడంతో అమ్మవారి భక్తుల ఆనందాలకు అవధులు లేకుండా పోయాయి. అమ్మవారి పూజలలో పాల్గొన్న ప్రముఖులు అమ్మవారి ఆవిర్భావోత్సవ వేడుకలలో బగలాముఖీ శక్తిపీఠం స్థలదాతలు పబ్బ రమేష్ గుప్త - స్వరూప దంపతులు, జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త, అమ్మవారి మూలవిరాట్ విగ్రహదాతలు రమాదేవి - తిరుపతి దంపతులు, ప్రసాద్ ట్రస్టు సభ్యులు జిన్నారం పెద్దగౌని సూర్యం కుమార్ గౌడ్, కామారెడ్డి భార్గవి - శ్రీనివాస్ దంపతులు, కొండల్, కొంతాన్ పల్లి సత్యనారాయణ గౌడ్, కిషన్, అమ్మవారి భక్తులు పాల్గొన్నారు. జన్మదినోత్సవ వేడుకలలో పాల్గొన్న భక్తులందరికి అమ్మవారి భక్తులు కొడకంచి సుదర్శన్ గౌడ్ పులిహోర ప్రసాదం అందించగా, జడ్పీటీసీ మహేష్ గుప్త మంచినీటి సదుపాయాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో భగలాముఖి శక్తిపీఠం అమ్మవారి భక్తులు, గ్రామస్తులు, పబ్బ మహేష్ గుప్తా యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అత్యాచారానికి యత్నించిన కేసులో నాలుగేళ్ల జైలు శిక్ష



హన్మకొండ(గౌతమ్ న్యూస్ ): హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం వంగపల్లి కి చెందిన ఎల బోయిన గణేష్ కొద్ది రోజుల క్రితం ఓ బాలికను అత్యాచారానికి ప్రయత్నించాడు. ఈ కేసులో హనుమకొండ జిల్లా ఫస్ట్ అడిషనల్ జడ్జీ అపర్ణ దేవి నిందితుడికి నాలుగేళ్ల శిక్ష, 4 వేల జరిమానా విధించిందని సిఐ హరికృష్ణ తెలిపారు.

## బిజెపితోనే పట్టభద్రులకు లబ్ధి..!



హన్మకొండ(గౌతమ్ న్యూస్ ): కాకతీయ యూనివర్సిటీ గ్రౌండ్స్ లో బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి క్రికెట్ ఆడి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తనను గెలిపించాలని, బిజెపితోనే పట్టభద్రులకు లబ్ధి చేకూరుతుందని ఆయన అన్నారు.

# ముంచుకొస్తున్న ఖరీఫ్ సీజన్ మరోపక్క విద్యా సంవత్సరం!!

### పంట రుణమాఫీ, ఆరు గ్యారెంటీ పథకాలు!!

### కాంగ్రెస్ పార్టీకి పెను సవాల్!!

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్ ): తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి మరో పెను సవాల్ గా ఖరీఫ్ సీజన్ 2024-2025 ప్రారంభం కావడం రైతులు వ్యవసాయ భూములు దుక్కి దున్నుకొని ఖరీఫ్ సీజన్ కు సిద్ధమయ్యారు, అంతేకాక నూతన విద్యా సంవత్సరం 2024-25 సంవత్సరానికి గాను ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ప్రారంభం జూన్ 13న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు ప్రారంభమవుతున్నాయి, ఇంతే కాక ఆగస్టు 15 లోపల రెండు లక్షల రూపాయల రుణమాఫీని చేసి తీరుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభలో ప్రతిపక్ష పార్టీ టిఆర్ఎస్ పార్టీకి సవాల్



విసిరారు, ఈ విధంగా రాబోయే రెండు మూడు నెలల లోపల తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పైన పెను భారం పెను సవాల్ ఎదుర్కోక తప్పదని చెప్పవచ్చు, ముఖ్యంగా వ్యవసాయ రంగాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాయమాటలతోనా రైతే రాజ్యం రైతు దేశానికి వెన్నెముక అనే మాటలతో నా ప్రసంగాలు ఇవ్వడం తప్ప రైతుల పట్ల రైతులకు ఇవ్వాల్సిన సబ్సిడీలు రైతు భరోసా నిధులు రుణమాఫీ నిధులు సకాలంలో అందించని ప్రభుత్వాలు సీజన్ అయిపోయిన తర్వాత ఉపయోగం లేని నిధులను ఎందుకు విడుదల చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు, ప్రతి సంవత్సరం జూన్ మాసం నుంచి అక్టోబర్ వరకు ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న సంగతి ప్రభుత్వానికి తెలియదా అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు రబీ వ్యవసాయ సీజన్ ప్రారంభం అవుతున్న సంగతి ప్రభుత్వాలకు ఎందుకు తెలియడం లేదని ఆ సమయంలో రైతులకు ఇవ్వాల్సిన సబ్సిడీ రుణాలు సబ్సిడీ ఎరువులు, రైతు భరోసానిధులు, బ్యాంకులో ఉన్న పంట రుణాల మాఫీ ఎందుకు చేయడం లేదని విమర్శలు వస్తున్నాయి, ఎన్నికల ముందు ఏదో ఒక మాట చెప్పి అధికారంలోకి వచ్చిన వెంటనే మాట మార్చే ప్రభుత్వాలు టిఆర్ఎస్ ,కాంగ్రెస్ పార్టీలు ప్రజల్లో విశ్వాసం కోల్పోయారు, గత ప్రభుత్వం తప్పుడు విధానాలు అవలంబించడం వల్లనే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ రాష్ట్ర ప్రజలు పట్టం కట్టారు, కానీ ఎక్కడ ఉంది కాంగ్రెస్ పార్టీ హామీలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిసెంబర్ 9 తారీఖు లోపు ప్రతి రైతు అకౌంట్లో రైతు భరోసానిధులు 7500 ఇస్తామని చెప్పి వెంటనే రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తాం అనే మాట ఎక్కడ ఉందని రైతులు ప్రశ్నిస్తున్నారు, అప్పుడే మాటకు విలువ గౌరవం పోయిన సంగతి ఈ రాష్ట్ర ప్రజలు గుర్తించారు, కెసిఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపి 10 సంవత్సరాల పాలనను నట్టేట ముంచిన గత ప్రభుత్వానికి బుద్ధి చెప్పి రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగింది,





కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత రాష్ట్ర ప్రజలు మరో మోసానికి గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, ఇది వాస్తవం కాదా ప్రతి ఒక్కరు ఆలోచించుకోవాలని ప్రజలు కోరుతున్నారు, రుణమాఫీ కంటే ముందు ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో రైతు భరోసా కింద ఎకరాకు 7500 ఎలాంటి షరతులు లేకుండా ఆరు ఎకరాల నుంచి పది ఎకరాల భూమి కలిగిన ప్రతి రైతుకు అందజేయాలని పట్టా భూమి కలిగిన రైతులు డిమాండ్ చేస్తున్నారు, కౌలు రైతుకు ఏ విధంగా ఈ ప్రభుత్వం డబ్బులు ఇస్తుందో రాబోయే రెండు మూడు నెలల లోపల తెలుస్తుందని ఎలాంటి వ్యవసాయ భూమిలేని నిరుపేద కుటుంబాలకు ప్రతి సంవత్సరం 12 వేల రూపాయలు ఈ ప్రభుత్వం ఏ విధంగా చెల్లిస్తున్న సంగతి కూడా బహిర్గతం కావడం తథ్యం అంతేకాక ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఇప్పటికీ గృహ వినియోదారుల నుంచి కరెంటు బిల్లు వసూలు చేస్తున్న విద్యుత్ శాఖ అధికారుల పైన ఈ ప్రభుత్వం ఎందుకు చర్య తీసుకోలేదని గ్యాస్ సిలిండర్ ప్రతి మహిళకు 2500, ఇంటర్మీడియట్ చదువుతున్న మహిళలకు స్కూటీ వాహనాలు డిసెంబర్ లోపల రెండు లక్షల ఉద్యోగాలు ఈ ప్రభుత్వానికి పెను సవాల్ మారడం ఖాయం, ఈ రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు ఈ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధంగా గట్టెక్కుతుందని ప్రతి ఒక్కరు ఆలోచన చేస్తున్నారు, అంతే కాక జూన్ 13న నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న తరుణంలో ప్రభుత్వ పాఠశాలలో పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు తినడానికి తిండి లేని కూలీలు తమ బిడ్డలను చదివించుకోవడానికి డబ్బులు లేక ప్రభుత్వ పాఠశాలలో అరకొర వసతుల మధ్యన తమ పిల్లలను చదివించుకుంటున్నారు, పాఠశాలలు పునర్ ప్రారంభం కావడానికి కేవలం కొన్ని రోజులు మాత్రమే దగ్గరపడ్డాయి ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థుల సంక్షేమం కోసం ఉచిత పాఠ్యపుస్తకాలను ముద్రణ ఉచిత దుస్తులు, రెసిడెన్షియల్ మహాత్మ జ్యోతిరావు పూలే, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలతో పాటు, మైనార్టీ గిరిజన సంక్షేమం గురుకుల పాఠశాల విద్యార్థుల స్థితిగతుల పట్ల వచ్చే వర్షాకాలంలో ప్రభుత్వ పాఠశాలలో గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులు విషయ సర్పాల బారిన పడకుండా నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రతి ఒక్కరికి ఉచిత పాఠ్య పుస్తకాలతో పాటు దుస్తులు బెడ్ సీట్లు ప్రతి ఒక్కటి సమకూర్చాలి, ఈ విధంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి జూన్, జూలై, ఆగస్టు ,మాసంలో అన్ని ఒడిదుడుకుల మధ్య కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి వచ్చింది, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం పార్లమెంట్ ఎన్నికలు ఆ తర్వాత వచ్చే స్థానిక సంస్థ ఎన్నికలు కోసం మొక్కుబడిగా హామీలు ఇవ్వకుండా



ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, జూన్ నెల లోపల రైతు భరోసానిధులు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్య వసతులు ఆగస్టు 15 లోపల రెండు లక్షల రూపాయల రుణమాఫీ,



ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయాలని రాష్ట్ర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు, రాబోయే మూడు నెలల లోపల కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతు రుణమాఫీ తో పాటు రైతు భరోసా కింద ఎకరాకు 7500 చొప్పున చెల్లించడం, నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న తరుణంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు దుస్తులు పాఠశాల అభివృద్ధి కోసం నిధులు, ఆరు గ్యారంటీ హామీలను అమలు చేయడం ఈ రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు ఏ విధంగా ఈ ప్రభుత్వం అమలు చేస్తుందో త్వరలో తేటతెల్లమవుతుందని రాష్ట్ర ప్రజానీకం ఎదురుచూస్తున్నారు,

# మల్లు రవి గెలుపు ఖాయం

### తెలంగాణలో కాంగ్రెస్ ప్రభంజనం

### సీనియర్ లీగల్ సెల్ న్యాయవాది పెద్దిరెడ్డి దామోదర్ రెడ్డి

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్ ): పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభంజనం వీస్తుందని నాగర్కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవి గెలుపు ఖాయమైందని నాగర్ కర్నూల్ జిల్లా లీగల్ సెల్ సీనియర్ న్యాయవాది పెద్దిరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు, ఎన్నికల పోలింగ్ సరళిని బట్టి చూస్తే తెలంగాణ రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని మహబూబ్నగర్ ,నాగర్ కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గం లోని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు డాక్టర్ మల్లురవి నాగర్ కర్నూల్ ఎంపీగా మహబూబ్నగర్ ఎంపీగా చల్లా వంశీచంద్ర రెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని దామోదర్ రెడ్డి అన్నారు, గత టిఆర్ఎస్ ప్రభుత్వం ఈ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిందని అందువల్లనే ఈ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రజలు



ఓట్లతో తగిన గుణపాఠం చెప్పినట్లు ఆయన వెల్లడించారు, అదేవిధంగా బిజెపి కేంద్రంలో 10 సంవత్సరాల పరిపాలించిన నరేంద్ర మోడీ దేశ ప్రజలకు చేసింది శూన్యమని ఆయన విమర్శించారు, దేశంలో రైతాంగం అప్పుల ఊబిలో విలవిలలాడుతున్నప్పటికీ రైతులకు సబ్సిడీపై ఎరువులు పంట రుణాలు సకాలంలో ఇవ్వని బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని రైతుల పట్ల పేద బడుగు బలహీన వర్గాల ప్రజల పట్ల బీజేపీ చిత్తశుద్ధితో పనిచేయలేదని అందుకే బిజెపి కేంద్రంలో మూడోసారి ప్రజలు ఇంటికి పంపించే రోజులు దగ్గర ఉన్నాయని దేశవ్యాప్తంగా ప్రధాని రాహుల్ గాంధీ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఇక్కడ చూసిన ప్రజలు దేశ భవిష్యత్తు కోసం సంక్షేమ పథకాల అమలు కోసం రైతుల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో రావాలని ప్రధాన మంత్రి రాహుల్ గాంధీ కావాలని అప్పుడే ఈ భారతదేశం అభివృద్ధి పథంలో పురోగమనం చెందుతుందని ఆయన అన్నారు, ఎవరు ఎన్ని లెక్కలు చేసినా తెలంగాణలో కాంగ్రెస్ విజయ పదములు దూసుకుపోవడం ఖాయమని పెద్దిరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు, రాష్ట్రంలో టిఆర్ఎస్ బిజెపి పార్టీలకు ఈ పార్లమెంటు ఎన్నికల ఫలితాల తర్వాత ఆ పార్టీలు కార్యాలయాలు అద్దెకు ఇచ్చుకోవాలని ఆ సమయం ఆసన్నమైందని ఆయన సూచించారు,

## యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యం లో రైస్ బ్యాగ్ చాలెంజ్ - 100 లో భాగంగా 50కేజీల రైస్ పంపిణీ




వరంగల్ (గౌతమ్ న్యూస్ ): యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాకు చెందిన వరంగల్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ బాయ్స్ కళాశాల లో ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న " పులి కిరణ్ కుమార్ , ముద్దు రాజశేఖర్ , మునిగాల రాంప్రసాద్ " సహకారంతో స్వయంకృషి మహిళా సొసైటీ వృద్ధాశ్రమం ములుగు రోడ్డు , హనుమకొండ లో ఉన్న వృద్ధులకు రైస్ బ్యాగ్ చాలెంజ్ - 100 లో భాగంగా 50కేజీల రైస్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పులి కిరణ్ కుమార్ , ముద్దు రాజశేఖర్ , మునిగాల రాంప్రసాద్ , దిద్ది సురేష్ , ఇమ్మడి శివకుమార్ , కుమ్మరి సాయి చరణ్ , అశోక్ , యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్ , వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు ( స్విమ్మర్ రాజు ) , కానిస్టేబుల్ బొట్టు కమలాకర్ , కోలా రాజేష్ , ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్ , అలువల పృథ్వి , ఉప్పరపల్లి రాజ్ కుమార్ , సృజన , జ్యోతి , భావన , బిటుకూరి యాకయ్య , పాలకుర్తి విష్ణు , ఎస్.కె ముస్తఫా , లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ ( హైకోర్ట్ అడ్వకేట్ ) , ఊరటి రవికుమార్ , యాద రవి కుమార్ , చెలిమల్ల అశోక్ కుమార్ , తూనం రాము , సి.ఐ.ఎస్.ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్ , మోడెం రాజశేఖర్ గౌడ్ , నాగవెల్లి కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో పేదలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు



హైదరాబాద్ (గౌతమ్ న్యూస్ ): రేషన్ కార్డు ఉన్నవారికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి గుడ్న్యూస్ చెప్పా రు.ఇప్పటి వరకు రేషన్ సరుకులుగా బియ్యం, చక్కెర, కొన్ని చోట్ల గోదుమలు ఇస్తున్న సంగతి తెలిసిందే. అయితే వీటితోపాటు మరి కొన్ని సరుకులు అదనంగా ఇస్తామని సీఎం ప్రకటిం చారు. రేషన్ దుకాణాల్లో ఎక్కువ వస్తువులను సబ్సిడీకి పంపిణీ చేయ నున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలు ముగియటంతో రాజకీయాలు అయిపో యానని నేటి నుంచి ప్రజాపాలనపై దృష్టి పెట్టనున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా రైతులు, తాగు నీరు, సాగు నీరు, విద్యా ర్థులు తదితర అంశాలపై దృష్టి పెట్టనున్నట్లు వెల్లడించారు. రైతు రుణమాఫీపై గతంలో ఇచ్చిన హామీని కచ్చితంగా నిలబెట్టుకుంటామని వెల్లడించారు. ఆగస్టు 15 లోపు రైతులకు ఓకే విడతలో రుణమాఫీ చేయనున్నట్లు తెలిపారు. రైతులు ఆ ధైర్య పడొద్దని ధాన్యం పూర్తిగా కొనుగోలు చేస్తామని వెల్లడించారు. మిల్లర్స్ అక్రమాలు చేస్తామంటే ఉరుకునేది లేదని.. తాట తీస్తామని హెచ్చరించారు. తాము చెప్పిన పంటలకు మద్దతు ధర కచ్చితంగా ఇస్తామన్నారు. ఒక కొత్త రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ అని కార్డులులేని పేదలకు కార్డులు మంజూరు చేస్తామన్నారు.

## ప్రయివేటు ఆసుపత్రులను తనిఖీ చేసిన వైద్యశాఖ అధికారులు



నర్సంపేట(గౌతమ్ న్యూస్ ): వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె వెంకట రమణ ఆదేశాల ప్రకారం జిల్లా ఉప వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రకాష్ బృందం చే నర్సంపేట పట్టణంలో ప్రైవేట్ హాస్పిటల్ వందన నర్సింగ్ హెూమ్, పావని నర్సింగ్ హెూం, వీఎన్నార్ హాస్పిటల్, లీల హాస్పిటల్



తనిఖీలు చేశారు. ఇందులో పావని నర్సింగ్ హెూమ్ లో ఉండవలసిన డాక్టర్లకు బదులుగా ఇతర డాక్టర్లు పనిచేయడం వలన అర్హత లేకుండా ల్యాబ్లు నిర్వహిస్తున్న సిబ్బందిని గుర్తించి ఆ సిబ్బంది ద్వారా మేనేజ్మెంట్ కు నోటీసులు అందజేసినట్లు డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ వో డాక్టర్ ప్రకాష్ తెలిపారు. మాత శిశు సంక్షేమ అధికారి డాక్టర్ ఆచార్య గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేయు ప్రైవేటు ఆస్పటల్ లో తనిఖీలు నిర్వహించారు. ప్రైవేట్ హాస్పిటల్లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన అబార్షన్ చేసిన, అనవసరమైన ఆపరేషన్ చేసిన రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా నిర్వహిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అనుమతి పొందని డాక్టర్లు వైద్యం చేసిన వారిపైన చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాతా శిశు ఆరోగ్య సంరక్షణ అధికారి డాక్టర్ ఆచార్య డిప్యూటీ డెమో అనిల్ కుమార్ ,ఎల్.డి కంప్యూటర్ నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు .

## కాశ్మీర్‌లో శాంతి నెలకొంటే పీఓకే ఆజాదీ నినాదాలతో దద్దరిల్లుతోంది



పాక్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే) రగులుతోంది. పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అక్కడి ప్రజలు తిరగబడుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం హోం మంత్రి అమిత్ షా బుధవారం కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ పీఓకే మద్దతు ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. పీఓకే భారత్‌లో అంతర్భాగమని, దానిని మేం తీసుకుంటామని అన్నారు. 2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత, ఒకప్పుడు సమస్యాత్మక ప్రాంతంగా ఉండే జమ్మూ కాశ్మీర్‌లో శాంతి నెలకొంటే, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో మాత్రం ఇప్పుడు ఆజాదీ నినాదాలు, నిరసనలు ప్రతిధ్వనిస్తోందని పశ్చిమ బెంగాల్ సేరంపూర్‌లో జరిగిన ర్యాలీని ఉద్దేశించి షా అన్నారు. ఇప్పుడు పీఓకేలో ప్రజలు రాళ్లు రువ్వుతున్నారని చెప్పారు. ఇటీవల పీఓకేపై కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ చేసిన వ్యాఖ్యలపై అమిత్ షా మాట్లాడుతూ.. "మణిశంకర్ అయ్యర్ వంటి కాంగ్రెస్ నేతలు పాకిస్తాన్ వద్ద అణుబాంబులు ఉన్నందును పీఓకేని తీసుకోవద్దని చెప్పారు. అయితే, నేను పీఓకే భారత్‌లో భాగమే అని చెబుతున్నాను, దానిని భారత్ తిరిగి తీసుకుంటుంది" అని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు అవినీతి నాయకులు ఉన్న ఇండియా కూటమికి, నిజాయితీ కలిగిన నరేంద్రమోడీకి మధ్య జరుగుతున్నాయని, ఆయన ముఖ్యమంత్రిగా, ప్రధాన మంత్రిగా ఉన్న ఒక్క పైసా ఆరోపణ కూడా రాలేదని అమిత్ షా అన్నారు. చొరబాటుదారులు కావాలా..? లేక శరణార్థులకు సీఏఏ కావాలా అనే దాన్ని బెంగాల్ నిర్ణయించుకోవాలని అన్నారు. జీహాద్‌కి ఓటేయాలా..? లేక వికాస్‌కి ఓటేయాలా..? అనే విషయాన్ని బెంగాల్ ప్రజలు నిర్ణయించుకోవాలని సూచించారు. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సీఏఏని వ్యతిరేకించి తన ఓటు బ్యాంకుని ప్రసన్నం చేసుకోవాలని, చొరబాటుదారులకు మద్దతుగా ర్యాలీ చేపట్టిందని అమిత్ షా నిందించారు.

## ఫైనల్లీ ఏపీ పోలింగ్ శాతం చెప్పేశారు.. 2019 కంటే ఎంత పెరిగిందంటే

అనేక లెక్కలు, అంచనాల అనంతరం చివరికి ఎన్నికల సంఘం ఆంధ్రప్రదేశ్ పోలింగ్ శాతాన్ని 81.86




శాతంగా అధికారికంగా ప్రకటించింది. ఇక ఈసీ లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా మొత్తం ఈవీఎంలలో పోలైన ఓట్లు 3,33,40,560 కాగా అందులో పురుషుల ఓట్లు 1,64,30,359, మహిళల ఓట్లు 1,69,08,684 అలాగే ట్రాన్స్జెండర్ల ఓట్లు 1517గా వెల్లడించారు. ఇక ఈవీఎంలలో పోలైన ఓట్లు మొత్తం 80.66 శాతం కాగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా పోలైన ఓట్లు 4,44,216 (ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగస్తులు ఓట్లు) అని వెల్లడించారు. ఇక హోమ్ ఓట్ ఆప్షన్ ద్వారా పొలైన 53,573 ( వృద్ధులు వికలాంగులు, తీవ్రమైన అనారోగ్యంతో ఉన్న వారి ఓట్లు) ఉన్నాయని ప్రకటించారు. ఈ మొత్తం శాతం 1.20 అని అలా మొత్తంగా ఈవీఎంపోస్టల్ బ్యాలెట్ం హోమ్ ఓట్ ఆప్షన్ అన్నీ కలిపి 80.66o1.20=81.86 అని వెల్లడించారు. ఇది 2019 ఎన్నికల శాతం తో పోలిస్తే 2.12 శాతం ఎక్కువ అని పేర్కొన్నారు. ఇక ఏపీలో 3,500 పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 6 తర్వాత కూడా పోలింగ్ జరిగిందని, ఆఖరి పోలింగ్ కేంద్రంలో అర్ధరాత్రి 2 గంటలకు పోలింగ్ పూర్తైందని ఏపీ సీఈఓ ఎంకే మీనా పేర్కొన్నారు. అయితే కొందరు అసెంబ్లీకి ఓటేసి లోక్ సభకు ఓటేయలేదని, 350 స్ట్రాంగ్ రూమ్ లలో ఈవీఎంలు భద్రపరిచామని ఆయన అన్నారు. ఇక ఏపీలో పార్లమెంట్ కు 3 కోట్ల 33 లక్షల 4560 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని ఏపీ సీఈఓ ఎంకే మీనా అన్నారు. ఎన్నికల్లో అల్లర్లు సృష్టించిన నిందితులను రెండ్రోజుల్లో అరెస్ట్ చేస్తామని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపైనా కఠిన చర్యలు తీసుకుని ఈవీఎంలు ధ్వంసం చేసిన వారిని జైలుకు పంపిస్తామని అన్నారు. 715 ప్రాంతాల్లో పోలీస్ పికెట్ కొనసాగుతుందన్న ఆయన స్ట్రాంగ్ రూమ్స్ దగ్గర పార్టీలకు చెందిన ప్రతినిధి 24 గంటలు ఉండవచ్చన్నారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం పెరిగిందని, రీపోలింగ్ పై ఎలాంటి వినతులు రాలేదని అన్నారు తాడిపత్రి, మాచర్ల, చంద్రగిరి, నరసరావుపేటలో గొడవలు జరిగాయి.. అల్లర్లు జరిగిన ప్రాంతాలకు అదనపు బలగాలు పంపాం.. ఆ 4 ప్రాంతాల్లో 144 సెక్షన్ పెట్టామని ఏపీ సీఈఓ ఎంకే మీనా అన్నారు.


## మెట్రో నుంచి ఎల్ అండ్ టీ వైదొలిగిన ఇబ్బంది లేదు..

సీఎం రేవంత్ రెడ్డి..



హైదరాబాద్ లో మెట్రో రైలు, దాని నడిపిస్తున్న ఎల్ అండ్ టీ (లార్సన్ అండ్ టర్బో) పై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మహాలక్ష్మి ఉచిత బస్‌రైడ్ పథకాన్ని విజయవంతంగా అమలు చేయడం వల్ల హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు నుంచి ఎల్ అండ్ టీ (లార్సన్ అండ్ టర్బో) ఇండియా వైదొలగాలని ఉవ్విళ్లూరుతుంటే స్వాగతిస్తున్నామన్నారు. ఈ నెల 15న బుధవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడిన ముఖ్యమంత్రి.. మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పిస్తామన్న కాంగ్రెస్ హామీ మెట్రో రైల్ నష్టంతో ఆగదని స్పష్టం చేశారు. "ఎల్‌అండ్‌టి నష్టాలు లేదా లాభాల గురించి మేము బాధపడటం లేదు. వాళ్ళని వెల్లనివ్వు. రాష్ట్ర ప్రభుత్వం ఇతర ఎంపికలను అన్వేషిస్తుంది. ఒక కాంట్రాక్టర్ పోతే మరో కాంట్రాక్టర్ వస్తాడు. ఇది పెద్ద విషయం కాదు" అని రేవంత్ విలేకరులతో అన్నారు. మే 11న, L&T 2026 తర్వాత మెట్రో ప్రాజెక్ట్ నుంచి నిష్క్రమించే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. L&T ప్రెసిడెంట్, డైరెక్టర్ & CFO R శంకర్ రామన్ దీనిపై మాట్లాడారు. మహిళా ప్రయాణికులు కొత్త ఉచిత బస్ పథకాన్ని ఇష్టపడతారని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికులు పెరిగినా ఈ మొత్తం బస్సుల సంఖ్య పెరగకపోవడంతో కొత్త పథకం నిలకడగా లేదన్నారు. మహిళలకు ఉచిత బస్ పథకం కొనసాగితే మెట్రో రైలు ప్రాజెక్టు నుంచి తప్పుకోవాల్సి వస్తుందని అన్నారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ కార్పొరేట్ల ఇష్టాయిష్టాలు, కల్పనల ప్రకారం ప్రభుత్వాలు పనిచేయడం లేదని అన్నారు. "ప్రజల సంక్షేమం, ముఖ్యంగా మహిళల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంక ప్రధాన ప్రాధాన్యత. ఏది వచ్చినా ఈ పథకాన్ని కొనసాగిస్తాం. మేము ప్రతి నెలా సత్వరమే టీఎస్‌ఆర్టీసీకి నిధులను రీయింబర్స్ చేస్తున్నాము. ఉచిత బస్సు పథకం కారణంగా టీఎస్‌ఆర్టీసీ ఆర్థిక సంక్షోభంలో పడకుండా చూస్తాము" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

## చిన్న ప్రతిపక్ష పార్టీలన్నీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో విలీనం అవుతాయి..



ప్రధాని నరేంద్రమోడీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల తర్వాత చిన్నచిన్న ప్రతిపక్షాలు అన్నీ కూడా కాంగ్రెస్‌లో విలీనం అవుతాయని అన్నారు. కాంగ్రెస్ దారిలో వెళ్లడం ప్రమాదకమని ఆయన ఈ రోజు ఓటర్లను హెచ్చరించారు. మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. శివసేన(ఉద్ధవ్ ఠాక్రే) పార్టీని ఉద్దేశిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ దారిలో పయనించడం ప్రారంభించిన ఉద్ధవ్ ఠాక్రే శివసేన అంతం అవుతుందని, ఇదే విషయాన్ని బాలా సాహెబ్ ఠాక్రే కూడా విశ్వసించారని ప్రధాని అన్నారు. కాంగ్రెస్ ముందు మోకరిల్లిన శివసేన డూప్లికేట్‌ని శిక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల తర్వాత చిన్న పార్టీలు కాంగ్రెస్‌లో విలీనం అవుతాయని మోడీ అన్నారు. అణగారిన వర్గాలకు తాను చౌకీదార్ అని చెప్పారు. మతప్రాతిపదికన బడ్జెట్‌ని విభజించడం ప్రమాదకరమని, కానీ కాంగ్రెస్ మాత్రం మైనారిటీలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటుందని ప్రధాని ఆరోపించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తిరుగుబాటులో శివసేన రెండుగా విడిపోయింది. మెజారిటీ ఎమ్మెల్యేలు షిండే వైపు ఉండటంతో ఆయనదే నిజమైన శివసేన అని ఎన్నికల సంఘం తేల్చింది. ఇదిలా ఉంటే ఎన్సీపీలో అజిత్ పవార్ తిరుగుబాటు కారణంగా శరద్ పవార్ పార్టీ కూడా చీలిపోయింది. శివసేన లాగే మెజారిటీ నాయకులు అజిత్ పవార్ వైపు నిలబడ్డారు. ఈ రెండు పక్షాలు కూడా బీజేపీతో ఎన్డీయే కూటమిలో ఉన్నాయి. మరోవైపు ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్ కాంగ్రెస్ పార్టీలో జతకట్టి ఇండియా కూటమిలో ఉన్నారు.

# 66.30% పోలింగ్ శాతం తుది గణాంకాలు

**పోస్టల్ బ్యాలెట్ సహా లోక్ సభ ఎన్నికల్లో పోలింగ్**

**ప్రత్యక్ష పోలింగ్ 65.67%.. భువనగిరి 76.78 టాప్**

**48.48 శాతంతో అట్టడుగున రాజధాని హైదరాబాద్**

**మొత్తం ఓటింగ్‌లో పాల్గొన్నది 2,20,24,806 మంది**

**అసెంబ్లీ స్థానాల ప్రకారం నర్సాపూర్ 84.25 ప్రథమం**

**జూన్ 4న 34 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు: సీఈవో వికాస్‌రాజ్**



హైదరాబాద్, యాదాద్రి, : రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ శాతం తుది గణాంకాలు వెల్లడయ్యాయి. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ మంగళవారం ఈ వివరాలను వెల్లడించారు. 17 నియోజకవర్గాల్లో సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్ర 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. ప్రత్యక్ష పోలింగ్ 65.67% నమోదైందని వికాస్‌రాజ్ తెలిపారు. గత లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ 3% పైగా పెరిగిందని, పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలిపి 66.3 శాతం దాటిందని వివరించారు. జూన్ 4వ తేదీన 34 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. కాగా, పోలింగ్‌లో భువనగిరి (76.78) ప్రథమ స్థానంలో నిలవగా, అత్యల్పంగా హైదరాబాద్‌లో 48.48% పోలింగ్ జరిగిందని పేర్కొన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూస్తే నర్సాపూర్‌లో అత్యధికంగా 84.25 శాతం, మలక్‌పేటలో అత్యల్పంగా 42.76 శాతం నమోదైందన్నారు. కాగా, రాష్ట్రంలో 3,32,16,348 మంది ఓటర్లకు గాను, 2,20,24,806 మంది ఓటు వేసినట్లు పేర్కొన్నారు. 35,809 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 2,18,14,035 (65.67 శాతం) మంది, పోస్టల్ బ్యాలెట్‌లో 2,10,771 మంది హక్కు వినియోగించుకున్నారని వెల్లడించారు. పోలింగ్ శాతం పెంపునకు క్షేత్రస్థాయి యంత్రాంగం చేసిన కృషికి తగిన ఫలితం దక్కిందన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్ల నుంచి ఈవీఎంలను భద్రతా బలగాల సహకారంతో స్ట్రాంగ్ రూముల్లో చేర్చినట్లు వికాసరాజ్ చెప్పారు. 44 స్ట్రాంగ్‌రూములకు నలువైపులా సీసీ కెమెరాలు, కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం చూస్తే.. ఆదిలాబాద్ 74.03, భువనగిరి 76.78, చేవెళ్ల 56.50, హైదరాబాద్ 48.48, కరీంనగర్ 72.54, ఖమ్మం 76.09, మహబూబాబాద్ 71.85, మహబూబ్‌నగర్ 72.43, మల్కాజిగిరి 50.78, మెదక్ 76.09, నాగర్‌కర్నూల్ 69.46, నల్లగొండ 74.02, నిజామాబాద్ 71.92, పెద్దపల్లి 67.87, సికింద్రాబాద్ 49.04, వరంగల్ 68.86, జహీరాబాద్ 74.63 శాతం పోలింగ్ నమోదైంది.

### భువనగిరిలోనూ మునుగోడు టాప్

భువనగిరిలో గత ఎన్నికల కంటే 2.36 శాతం పోలింగ్ అధికంగా జరిగింది. ఈ లోక్‌సభ స్థానం పరిధిలో అత్యధికంగా మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గంలో 83.71 శాతం, ఇబ్రహీంపట్నంలో అత్యల్పంగా 66.83 శాతం ఓటింగ్ నమోదైంది. పట్టణ ప్రాంత ఓటర్లు అధికంగా ఉన్న ఇబ్రహీంపట్నం కంటే.. పల్లెలు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో పోలింగ్ బాగా జరిగింది.

# కడెం ప్రాజెక్ట్ ఐదు గేట్లకు మరమ్మతులు..!!

**ఐదు గేట్లకు శరవేగంగా మరమ్మతులు..**

**నేడు ప్రాజెక్టు వద్దకు కీలక అధికారులు**

**గత రెండేళ్లూ భారీ వరదలకు వణికిన ప్రాజెక్టు**

**2 గేట్ల రోప్‌లు తెగిపోవడం, మరో రెండింటి కౌంటర్ వెయిట్‌లు కొట్టుకుపోవడంతో సమస్య**

**మొత్తం 18 గేట్లూ ఒకేసారి తెరుచుకోని వైనం**

**డీఎసఆర్‌పీ సూచనపై దృష్టిపెట్టని గత సర్కారు**

**యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కొత్త ప్రభుత్వం నిర్ణయం.. ఉత్తర్వుల జారీ**



హైదరాబాద్, : గోదావరి బేసిన్‌లో ఏటా వరదలతో నిండే ప్రాజెక్టుల్లో ఒకటైన కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టుపై ప్రభుత్వం దృష్టి సారించింది. గత రెండేళ్లూ భారీ వరదలతో ప్రాజెక్టు చిగురుటాకులా వణికిన విషయం విదితమే. స్పిల్‌వే (నీరు విడుదలయ్యే భాగం) సామర్థ్యం కన్నా అధికంగా వరద రావడంతో గత ఏడాది 18 గేట్లకు గాను 14 గేట్లు మాత్రమే పైకి లేచాయి. రెండు గేట్ల రోప్‌లు తెగిపోగా... మరో రెండు గేట్ల కౌంటర్‌వెయిట్‌లు కొట్టుకుపోయాయి. దాంతో వరద.. గేట్ల పైనుంచి కిందికి దూకింది. గత రెండేళ్ల అనుభవాల దృష్ట్యా ప్రాజెక్టు 18 గేట్లను ఏకకాలంలో ఎత్తడానికి వీలుగా 5 గేట్లలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఇటీవలే వీటి మరమ్మతులకు ఉత్తర్వులు ఇవ్వగా ఎన్నికల సంఘం కూడా ప్రత్యేకంగా అనుమతి ఇచ్చింది. వానాకాలంలోపు ఈ మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ నేతృత్వంలోని అధికారుల బృందం కడెం ప్రాజెక్టును సందర్శించనుంది. గేట్ల మరమ్మతులపై అక్కడే సమీక్ష చేపట్టి, అవసరమైన ఆదేశాలు ఇవ్వనున్నారు. కాగా, ఈ ప్రాజెక్టుకు ఒక ప్రత్యేకత ఉంది. 18 గేట్లలో 9 జర్మనీ నుంచి తెప్పించుకున్నవి. మరో 9 మన దేశంలోనే తయారుచేసినవి. 1906లోనే నిజాం హయాంలో ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించి.. మధ్యలో ఆపేశారు. హైదరాబాద్ సంస్థానం పోలీసు చర్య అనంతరం ఇండియన్ యూనియన్‌లో విలీనం అయ్యాకా పూర్తి చేశారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో 1.30 లక్షల క్యూసెక్కుల వరద విడుదలయ్యేలా స్పిల్ వే డిజైన్ చేశారు. అయితే 1958 ఆగస్టు 31న ప్రాజెక్టుకు 3 లక్షల క్యూసెక్కుల వరద వ చ్చింది. దాంతో అంతకుముందు అమర్చిన జర్మనీ గేట్లకు అదనంగా మరో 9 గేట్లు పెట్టి, స్పిల్ వే సామర్థ్యం 3 లక్షల క్యూసెక్కులకు పెంచారు. రెండేళ్ల కిందట ప్రాజెక్టుకు ఏకంగా 5 లక్షల క్యూసెక్కుల వరద రాగా గత ఏడాది దాదాపు 4 లక్షల క్యూసెక్కుల దాకా వచ్చింది. జర్మనీ గేట్లు నిక్షేపంగా పనిచేస్తుండగా భారతదేశంలో తయారుచేసినవి నిరంతరం మొరాయిస్తున్నాయి. ఈ ప్రాజెక్టును డీఎసఆర్‌పీ తనిఖీ చేసి.. అదనంగా 5 గేట్లతో కొత్తగా ఒక స్పిల్ వే కట్టాలని నివేదిక ఇచ్చింది. ఏడాదిన్నర కిందటే డీఎసఆర్‌పీ నివేదిక ఇవ్వగా గత ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టలేదు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం వెనువెంటనే మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించి, ఇటీవలే నిధులు కూడా మంజూరు చే సింది. స్పిల్ వే కట్టాలంటే ఏడాది పాటు ప్రాజెక్టు కింద క్రాప్ హాలీడే ప్రకటించాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి తాత్కాలిక ప్రాతిపదికన గేట్లకు మరమ్మతులు చేసి, గేట్ల ఆపరేషనల్ మ్యానువల్‌లో మార్పులకు ఉపక్రమించారు. ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియా అంతా దట్టమైన అడవుల్లో ఉంది. దీంతో అడవుల్లో రెయిన్ గేజ్ స్టేషన్లు ఏర్పాటు చేసి, వాటిని ప్రాజెక్టు వద్ద ఉన్న స్కాడా కేంద్రానికి అనుసంధానం చేశారు. వరద సమాచారం అందుకోగానే గేట్లను ఏకకాలంలో తెరవనున్నారు. అడవుల్లో వర్షాలు కురిసిన తర్వాత ప్రాజెక్టుకు వరద చేరడానికి 9 గంటలు పడుతుందని అంచనా వేశారు. ఆ సమయానికి ముందే 18 గేట్లను ఎత్తేసి ప్రాజెక్టును ఖాళీ చేయాలని నిర్ణయించారు. దీని వల్ల రిజర్వాయర్‌పై ఒత్తిడి తగ్గి ప్రమాదం నుంచి కడెం ప్రాజెక్టు బయటపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# మోదీ సర్కార్ మూడో రాకడ ఖాయం

భారతీయ జనతా పార్టీ 2019 సార్వత్రిక ఎన్నికలలో చాలా రాష్ట్రాల్లో అత్యధిక స్థానాలు సంపాదించింది. 2024లో ఆ ఫలితాలు పునరావృతం కావని ప్రతిపక్ష శిబిరంలో ఉన్నవారు, కుహనా మేధావులు వాదిస్తున్నారు. వారి వాదనలో పసలేదు. ఎందుకంటే 2014 నుంచీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలోని భారతీయ జనతా పార్టీకి జనాదరణ పెరుగుతుందే కాని తగ్గడం లేదు. బీజేపీ దినదిన ప్రవర్ధమానమవుతున్న పార్టీయే కాని కాంగ్రెస్‌లా రోజురోజుకూ వెలుగు తగ్గిపోతున్న పార్టీ కాదు. మోదీ పట్ల ప్రజల విశ్వాసం రోజు రోజుకూ పెరుగుతోందని, ఆయనను అభిమానించే వారి సంఖ్య కోట్లలో ఉంటుందని చాలా మందికి ఇంకా అర్థం కావడం లేదు. ఇవాళ ఉత్తరప్రదేశ్‌నే చూస్తే అక్కడ డబుల్ ఇంజన్ సర్కార్ అత్యంత పటిష్ఠంగా పనిచేస్తోంది. రాష్ట్రంలో ఒకప్పుడు మహిళలు ఒంటరిగా తిరిగేందుకు భయపడేవారు. ఎక్కడ చూసినా మాఫియా, గూండాగిరీ రాజ్యమేలేది. అభివృద్ధి అనేది ఏ కోశానా కనపడేది కాదు. ఇప్పుడు మోదీ-యోగీ సారథ్యంలో ఉత్తరప్రదేశ్‌లో వేల కోట్ల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు అమలవుతున్నాయి. వేల కోట్ల మేరకు సంక్షేమ కార్యక్రమాల నిధులు జనానికి నేరుగా చేరుతున్నాయి. శాంతి భద్రతల పరిస్థితి నూటికి నూరు శాతం మెరుగుపడింది. ప్రజలు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటున్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం, కాశీ కారిడార్ నిర్మాణం తదితర చర్యల వల్ల కోట్లాది భారతీయుల ఆధ్యాత్మిక, ధార్మిక మనోభావాల పరిరక్షణ జరిగింది. ఈ పరిస్థితుల్లో కులాల పేరుతో, మైనారిటీల పేరుతో కొన్ని దుష్టశక్తులు ఏకం అయినంత మాత్రాన ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ మెజారిటీ తగ్గుతుందా? గతంలో కంటే అత్యధిక సంఖ్యలో యూపీలో బీజేపీ సీట్లు సాధించడం ఖాయం. యూపీ మాత్రమే కాదు, డబుల్ ఇంజన్ సర్కార్ అమలులో ఉన్న మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అస్సాం, ఉత్తరాఖండ్, హర్యానా, గుజరాత్‌తో పాటు అనేక రాష్ట్రాల్లో బీజేపీ ప్రభంజనం మళ్లీ వీయనుందనడంలో సందేహం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా మోదీతో చంద్రబాబు-పవన్ కల్యాణ్ చేతులు కలపడంతో ప్రజల్లో సమధికోత్సాహం నెలకొంది. తెలంగాణలో నిశ్శబ్ద విప్లవం జరుగుతున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. ఈ ఎన్నికల తర్వాత తెలంగాణలో కూడా అనతి కాలంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడడం ఖాయమని ప్రజలు విశ్వసిస్తున్నారు. బీజేపీ గెలుపునకు ఎన్నో కారణాలు చెప్పవచ్చు. మోదీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీని ప్రజలు తమ జీవితాలకు, ఆలోచనలకు సన్నిహితంగా ఉన్న పార్టీగా భావిస్తున్నారు. మోదీకి తప్ప మరెవరికి ఓటు వేస్తాం? అన్న ప్రశ్న ప్రతి సామాన్యుడి మనసులో మెదులుతోంది. మోదీ గత



పదేళ్లలో దేశాన్ని అత్యంత పటిష్ఠంగా బలోపేతంగా మారిందని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అద్భుతంగా జరుగుతోందని ఇవాళ ఎవరైనా చెప్పగలరు. మోదీ నిర్భయంగా, ప్రత్యర్థులను చీల్చి చెండాడం, అంతర్జాతీయంగా దేశం ప్రతిష్ఠను ఆకాశానికి పెంచడం కూడా అందరూ గమనించారు. అందుకే బీజేపీ ఉద్దేశ పూర్వకంగా మోదీ చుట్టూ ప్రచారాన్ని రూపొందించింది. మోదీ వాగ్దానాలు నెరవేరుస్తారని, ఆయన అనర్గళ ప్రసంగాలు ప్రజలను హత్తుకుంటాయని, ఆయనను మించిన వక్త కానీ, నాయకుడు కాని దేశంలో మరెవరూ లేరని ఇవాళ అందరికీ తెలుసు. ఏదైనా మోదీ ముఖానే కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడడం ప్రజలకు నచ్చుతున్న విషయం ప్రతిపక్షాలు గమనించడం లేదు. వ్యక్తిగతంగా ఆయన అవినీతిపరుడు కాకపోవడం, ఏదైనా జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే చేస్తాడని ప్రజలు నమ్మడం వల్ల ఇవాళ ఆయన నాయకత్వానికి తిరుగులేకుండా పోతోంది. నిత్యం కశ్మీర్‌లో చొరబాటుదారులను ప్రేరేపించే పాకిస్తాన్ ఇవాళ ఎందుకు ఆత్మరక్షణలో పడిపోయింది గతంలో లాగా సంక్షేమ కార్యక్రమాల అమలులో అవినీతి కనపడకపోవడం కూడా మోదీ ప్రభుత్వం పట్ల విశ్వాసం పెంచుతోంది. శౌచాలయాలు, గ్యాస్ కనెక్షన్లు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఆహార ధాన్యాల పంపిణీ, రైతులకు ఆర్థిక సహాయం, ముద్రా రుణాలు, ఆరోగ్య బీమా ఇవన్నీ ఆచరణలో ఫలితాలను అందిస్తున్నాయి. అందుకే బీజేపీ ఆత్మవిశ్వాసంతో నేరుగా లబ్ధిదారులను చేరుకోగలుగుతోంది. మైనారిటీలంతా సంఘటితమయ్యారని అందువల్ల బీజేపీ ఓడిపోతోందని ప్రతిపక్షాలు చేస్తున్న వాదన కూడా తప్పు. 2019లో కూడా ఇదే వాదన వినిపించినప్పటికీ బీజేపీ అఖండ విజయం సాధించిన విషయం గ్రహించాలి. యూపీలో మైనారిటీలే కనుక బీజేపీని వ్యతిరేకిస్తే మెజారిటీ సీట్లు ఎలా సాధించగలుగుతుంది? అసలు ప్రతిపక్షాలను ప్రజలు ఎందుకు నమ్మాలి? ఈ ప్రశ్నలు ప్రతిపక్షాలు వేసుకుని ఉంటే వాటి పరిస్థితి ఎంతో కొంత మెరుగుపడేది. ప్రతిపక్షాల ఆరున్నర దశాబ్దాల పాలనను, మోదీ పది సంవత్సరాల పాలనను ప్రజలు గమనించరని వారు అనుకోవడం పొరపాటు. ప్రతిపక్షాల హయాంలో జరిగిన విచ్చలవిడి అవినీతి ఆశ్రిత పక్షపాతం, పెచ్చురిల్లిన ఉగ్రవాదం, కశ్మీర్, పంజాబ్, ఈశాన్య రాష్ట్రాల్లో జరిగిన దారుణాలు, మతకల్లోలాలు, ఆర్థిక సంక్షోభంతో పాటు రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేసిన తీరు, ముఖ్యమంత్రులను పదే పదే మార్చిన తీరు ఇవన్నీ ప్రజలు మరిచిపోలేదు. ఇవాళ కులాల పేరుతో, సామాజిక న్యాయం పేరుతో రాహుల్‌గాంధీ చిలుకపలుకులు పలికినంత మాత్రాన ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. మీ జమానాలో సామాజిక న్యాయం ఏమైంది? గత ఎన్నికల్లో రాహుల్‌గాంధీ కనీస ఆదాయ గ్యారంటీ పేరుతో ప్రచారం చేశారు కాని ఓటర్లలో ఒక్కరు కూడా ఈ హామీని విశ్వసించలేదు. ఇప్పుడు సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ అంటూ మాట్లాడినంత మాత్రాన ప్రజలు విశ్వసిస్తారా మోదీ పట్ల ప్రజలకు బలమైన నమ్మకం ఎందుకు ఏర్పడింది? కాంగ్రెస్ పాలన కంటే మోదీ పాలన అన్ని విధాల మెరుగ్గా ఉండడమే. దేశంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే మోదీ పాలనకు గీటురాయి. ఉగ్రవాదం, వేర్పాటు వాదం, నక్సలిజం వంటివి తోకముడిచాయి. మైనారిటీ వాదానికి కాలం చెల్లింది. వీటన్నిటికి తోడు బీజేపీ అత్యంత బలోపేతమైన పార్టీగా నలుమూలలా విస్తరించింది. ప్రతిపక్షాల పట్ల జనం విశ్వాసం కోల్పోవడం వల్లనే ఇవాళ బీజేపీ తిరుగులేని పార్టీగా మారింది. అందుకే ప్రధానమంత్రి నరేంద్రమోదీ అత్యంత ఆత్మవిశ్వాసంతో ఎన్డీఏ 400 సీట్లు దాటి తీరుతుందని నాలుగో దశ ఎన్నికల తర్వాత మరోసారి ప్రకటించారు. రాహుల్‌గాంధీ అమేథీ నుంచి పలాయనం చిత్తగించి, తల్లి నియోజకవర్గమైన రాయబరేలీ నుంచి పోటీ చేయడం, సమాజ్‌వాది పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్, ఎన్‌సీపీ, శివసేన వంటి పార్టీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఇచ్చిన సీట్లకు కాంగ్రెస్ పోటీ చేయడం, తృణమూల్ కాంగ్రెస్ తిరస్కరించినా ఆ పార్టీని ఇండియా కూటమిలో కొనసాగించడం ఇవన్నీ కాంగ్రెస్ బలహీనతకు నిదర్శనాలు. కాంగ్రెస్‌కి ఈసారి 50 సీట్లు కూడా రావని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రకటన ఏ మాత్రం వాస్తవదూరం కాదని జూన్ 4న తప్పక నిర్ధారణ అవుతుంది.

## తులం బంగారం ఇస్తామన్నారు.. ఎవరికిచ్చారు..?



హైదరాబాద్ : తెలంగాణలో బీజేపీకి ఊహించని రిజల్ట్స్ రాబోతున్నాయని కేంద్రమంత్రి, స్టేట్ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రిజర్వేషన్లపై కాంగ్రెస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. అయినా ప్రజలు మిమ్మల్ని విశ్వసించరని ఎద్దేవా చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సారి బీజేపీకి భారీగా ఓట్లు పడ్డాయని తెలిపారు. మజ్లిస్ వ్యవహరించిన తీరు కూడా ఎన్నికల్లో బీజేపీకి కలిసొచ్చిందని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. ఇక, తెలంగాణలో బీఆర్ఎస్ పూర్తి కనుమరుగు కాబోతుందని జోస్యం చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వ అట్టర్ ఫ్లాఫ్ అయ్యిందని విమర్శలు గుప్పించారు. ఆరు గ్యారెంటీల్లో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం స్కీమ్ తప్ప మిగితావి జరగలేదని మండిపడ్డారు. ఈ పథకంతో అసలు నష్టాల్లో ఉన్న ఆర్టీసీపై మరింత భారం మోపారని అసహనం వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీకి చెల్లించాల్సిన బకాయిలు చెల్లించట్లేదని ఫైర్ అయ్యారు. పెళ్లి చేసుకుంటే యువతులకు తులం బంగారం ఇస్తామన్నారు.. ఎవరికి ఇచ్చారని ప్రశ్నించారు. ఇచ్చిన ఏ హామీని కాంగ్రెస్ అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు మానుకోవాలని అన్నారు. తెలంగాణలో బీజేపీ డబుల్ డిపాజిట్ సీట్లు సాధిస్తుందని ఆయన మరోసారి ధీమా వ్యక్తం చేశారు.

## 27 వారాల గర్భాన్ని తొలగించలేం, పిండానికి జీవించే హక్కు ఉంది




ఢిల్లీ : గర్భంలో ఉన్న పిండానికి కూడా జీవించే ప్రాథమిక హక్కు ఉంటుందని పేర్కొంటూ 27 వారాల గర్భాన్ని తొలగించేందుకు భారత అత్యున్నత న్యాయస్థానం అనుమతిని తిరస్కరించింది. 20 ఏళ్ల అవివాహిత మహిళ వేసిన పిటిషన్‌ను స్వీకరించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ నెల 3న ఢిల్లీ హైకోర్టు సైతం ఇదే తరహా తీర్పును ఇచ్చిన నేపథ్యంలో సదరు మహిళ తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. దీన్ని విచారించిన జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. 'మేము చట్టానికి విరుద్ధంగా ఎలాంటి ఉత్తర్వును ఇవ్వలేము. కడుపులో ఉన్న బిడ్డకు కూడా జీవించే ప్రాథమిక హక్కు ఉంది. దాని గురించి మీరేమంటారు?' అని న్యాయమూర్తులు ఎస్వీ ఎన్ భట్టి, సందీప్ మెహతా ఆమె న్యాయవాదిని ప్రశ్నించారు. మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ(ఎంటీపీ) చట్టం కేవలం తల్లి గురించి మాత్రమే మాట్లాడుతుందని మహిళ తరపు న్యాయవాది తెలిపారు. అయితే, మహిళ గర్భం దాల్చి ఏడు నెలలకు పైగా అయిందని, పిల్లలు జీవించే హక్కు గురించి ఏంటి? దాన్నెలా పరిష్కరిస్తారని బెంచ్ ప్రశ్నించింది. ఆమె మానసిక, శారీరక పరిస్థితిని పరిగణలోకి తీసుకోవాలని న్యాయవాది కోరగా, సుప్రీంకోర్టు కుదరదని పేర్కొంది. అంతకుముందు ఢిల్లీ హైకోర్టు సైతం చట్టబద్ధంగా 24 వారాల పరిమితి మించిపోవడంతో 27 వారాల గర్భాన్ని తొలగించేందుకు అనుమతించబోమని వెల్లడించింది.

## రాజకీయాలు పక్కనపెట్టి రైతులకు న్యాయం చేయండి..



హైదరాబాద్ : తెలంగాణ సర్కార్ రైతులను విస్మరించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వారిని ఆదుకోవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయం చేయడమే టార్గెట్ గా పెట్టుకుందని విమర్శించారు. వడ్లు కొనుగోలు చేయడం లేదని రైతులు ఆందోళన చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి. తడిసిన ధాన్యంను కొనుగోలు చేయాలి, లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని కేటీఆర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతుల పక్షాన పోరాటం చేసేందుకు మేము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంను నిలబెట్టుకుంటామని కేటీఆర్ అన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్సీస్థానాన్ని గెలిచాం. ఇప్పుడు కూడా గెలుస్తామని చెప్పారు. కాంగ్రెస్ నిరుద్యోగులను మోసం చేసింది. రేవంత్ రెడ్డి విద్యుత్ ఉద్యోగులపై ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఉద్యోగులను నిందించడం తగదు. ప్రభుత్వ ఉద్యోగులను సీఎం నమ్మడం లేదు. నారాయణఖేడ్ లో ఉపాధ్యాయులపై లాఠీ ఛార్జ్ చేశారు. దివాళాకోరు రాజకీయం సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 7లక్షల కోట్లు అప్పు అని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసింది. రిజర్వ్ బ్యాంకు 3.5 లక్షల కోట్లు అని ప్రకటించింది. కాంగ్రెస్ నేతలు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## అత్యధిక పోలింగ్ నమోదైన నియోజకవర్గం ఇదే..!



అమరావతి : ఆంధ్రప్రదేశ్ లో మే 13న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. తాజాగా సీఈవో ముఖేష్ కుమార్ మీనా మీడియా సమావేశంలో ఎన్నికల వివరాలను వెల్లడించారు. దర్శి నియోజక వర్గం లో అత్యధికం గా 90.91 శాతం పోలింగ్ నమోదైనట్టు తెలిపారు సీఈవో ముఖేష్ కుమార్ మీనా. తిరుపతి నియోజకవర్గంలో అత్యల్పంగా 63.32 శాతంగా నమోదు అయింది. 3500ల కేంద్రాల్లో అర్థరాత్రి వరకు పోలింగ్ కొమరోవైపు ఈవీఎంలు ధ్వంసం చేసిన వారికి తప్పకుండా శిక్ష పడుతుందనసాగింది. పార్లమెంట్ కి 3,33,0,560 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. ని ఆయన తెలిపారు. సీసీ కెమెరాల్లో అంతా రికార్డు అయిందని.. దాడులు చేసిన వారిని అరెస్ట్ చేసి.. జైలుకు పంపించామని తెలిపారు. తాడిపత్రి, చంద్రగిరి, మాచర్ల, నరసరావుపేటలో ఘర్షణ వాతావరణం నెలకొందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 715 పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశామని తెలిపారు ముఖేష్ కుమార్. నాలుగు ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించినట్టు వెల్లడించారు.

# జగన్ కేసులను రోజువారీగా విచారించండి

### నాంపల్లి కోర్టుకు సీబీఐ అభ్యర్థన

### ఆయన విదేశీ టూర్‌కు న్యాయస్థానం అనుమతి

### కాంటాక్ట్ నంబర్లు, ఈ-మెయిల్‌ను కోర్టుకు, సీబీఐకి సమర్పించాలని సీఎంకు ఆదేశం

### పర్యటించే ప్రాంతాల వివరాలు కూడా..



హైదరాబాద్, : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసులపై రోజువారీ పద్ధతిలో విచారణ జరపాలని ప్రత్యేక కోర్టుకు సీబీఐ విజ్ఞప్తి చేసింది. ఆయన కుటుంబంతో విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వొద్దని కోరింది. అయితే నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టు ఆయన విదేశీ టూర్‌కు అనుమతించింది. గురువారం (ఈ నెల 16) నుంచి జూన్ 1 వరకు 17 రోజులపాటు కుటుంబ సమేతంగా యూకే, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ వెళ్లడానికి అనుమతి కోరుతూ జగన్ సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సీబీఐ స్పెషల్ కోర్టు ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి టి.రఘురాం విచారణ చేపట్టారు. జగన్ తరఫు న్యాయవాది జి.అశోక్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. అక్రమాస్తుల కేసులు ప్రస్తుతం 'హియరింగ్ ఆన్ చార్జెస్' దశలో ఉన్నాయని.. వీటికి చాలా సమయం పడుతుందని పేర్కొన్నారు. 2015 నుంచి ఇప్పటివరకు అనేకసార్లు విదేశీ పర్యటనలకు వెళ్లినప్పటికీ ఎక్కడా షరతులు ఉల్లంఘించలేదని తెలిపారు. సీబీఐ తరఫు న్యాయవాది ఇందర్‌జీత్ సంతోషి వాదనలు వినిపిస్తూ.. ప్రజాప్రతినిధులపై క్రిమినల్ కేసులను వేగంగా పరిష్కరించేందుకు సుప్రీంకోర్టు పలు మార్గదర్శకాలు జారీచేసిందని తెలిపారు. 'వాటి అమలులో భాగంగా జగన్ కేసులను రోజువారీ పద్ధతిలో విచారణకు స్వీకరించాల్సి ఉంటుంది. జగన్, ఇతర నిందితులు కార్పొరేట్ ముసుగులో మోసపూరితంగా అయాచిత ఆర్థిక లబ్ధి పొందారు. సమయానుగుణ మినహాయింపులను వాడుకుంటూ.. ఏదో ఒక కారణంతో విదేశీ పర్యటనలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కేవలం ఒకే ఒక్కసారి 2020 జనవరి 10న ఈ కోర్టుకు వ్యక్తిగతంగా హాజరయ్యారు. ఇతర అన్ని సందర్భాల్లో వ్యక్తిగత హాజరు మినహాయింపు తీసుకున్నారు. అక్రమాస్తుల కేసుల్లో ఒకరి తర్వాత ఒకరు వివిధ కారణాలతో కోర్టు ప్రొసీడింగ్స్‌కు ఆటంకాలు కలిగిస్తున్నారని.. నిందితులు వేర్వేరుగా వివిధ సెక్షన్ల కింద అప్లికేషన్స్ దాఖలు చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు పొందుతూ ఆలస్యం చేస్తున్నారని తెలంగాణ హైకోర్టు 2017, 2018లో ఇచ్చిన పలు తీర్పుల్లో వ్యాఖ్యానించింది. జగన్, ఇతర నిందితులు విచారణలో ఆలస్యానికి కారణమవుతూనే మళ్లీ అదే ఆలస్యాన్ని కారణంగా చూపి బెయిల్ షరతుల నుంచి మినహాయింపు పొందాలని చూస్తున్నారు. ఈ నేపథ్యంలో విదేశీ పర్యటన సహా ఎలాంటి మినహాయింపులూ ఇవ్వొద్దు' అని కోరారు. ఇరుపక్షాల వాదలను విన్న కోర్టు.. పిటిషనర్ విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఉల్లంఘనలకు పాల్పడినట్టు సీబీఐ ఎలాంటి ఆధారాలు చూపలేదని పేర్కొంది. 'ఫ్యామిలీ వెకేషన్ సహా చాలా సందర్భాల్లో ఇదే కోర్టు పిటిషనర్ విదేశీ పర్యటనలకు అనుమతిచ్చింది. ఈ నెల 16 నుంచి జూన్ 1 వరకు యూకే, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ అనుమతిస్తున్నాం. జగన్ తన కాంటాక్ట్ నంబర్లు, ఈ-మెయిల్, పర్యటించే ప్రాంతాల వివరాలు కోర్టుకు, సీబీఐకి సమర్పించాలి' అని ఆదేశించింది.

# తెలంగాణలో మూడ్ ఎలా ఉంది? ఏ పార్టీకి ఎన్ని సీట్లు?




హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు దక్కించుకోవడానికి తెలంగాణలో అధికార కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతోపాటు విపక్ష పార్టీ తీవ్రంగా శ్రమించాయి. తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలకు, ఆంధ్రప్రదేశ్‌లో 25 లోక్‌సభ సీట్లతోపాటు 175 అసెంబ్లీ సీట్లకు సోమవారం పోలింగ్ జరిగింది. దాదాపు 5 కోట్ల మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. అభ్యర్థుల భవితవ్యం ఇప్పుడు ఈవీఎంలలో నిక్షిప్తమైంది. జూన్ 4న జడ్జిమెంట్ వెలువడనుంది. ఈ క్రమంలో ఓటర్ల మూడు ఎలా ఉంది అన్న చర్చ తెలంగాణలో జరుగుతోంది. పార్టీలతోపాటు విశ్లేషకులు కూడా ఓ అంచనాకు వస్తున్నారు. ఇక లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు దక్కించుకోవడానికి తెలంగాణలో అధికార కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతోపాటు విపక్ష పార్టీ బీఆర్ఎస తీవ్రంగా శ్రమించాయి. కాంగ్రెస్ తరఫున సీఎం రేవంత్‌రెడ్డి అన్నీతానై నడిపించారు. పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, మల్లికార్జునఖర్గేలను కూడా రాష్ట్రానికి తీసుకువచ్చి ప్రచారం చేయించారు. ఇక బీజేపీ అయితే ప్రచారంలో దూకుడు ప్రదర్శించింది. షెడ్యూల్‌కు ముందు నుంచే ప్రధాని మోదీతోపాటు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, బీజేపీ జాతీయ అధ్యక్షుడు, పొరుగు రాష్ట్రాల ఎంపీలను రంగంలోకి దించింది. మిగతా పార్టీలకు అందనంతగా ప్రచారంలో దూకుడు ప్రదర్శించింది. ప్రధాని మోదీ ఏకంగా నాలుగుసార్లు తెలంగాణలో ప్రచారం నిర్వహించారు. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో తీవ్ర నైరాశ్యంలో ఉన్న ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు ఊపు తెచ్చేందుకు మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగారు బస్సు యాత్రతో పది నియోజకవర్గాలను చుట్టేశారు. మరోవైపు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు కూడా అభ్యర్థుల తరఫున ప్రచారంలో పాల్గొన్నారు. ఇక సోమవారం నిర్వహించిన తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో 64.93 శాతం పోలింగ్ నమోదైంది. పది స్థానాల్లో 70 శాతానికిపైగా పోలింగ్ నమోదవడం విశేషం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల నియోజకవర్గాలు మినహా రాష్ట్రంలోని మిగతా 13 స్థానాల్లో 60 శాతం నుంచి 70 శాతం వరకు ఓటింగ్ నమోదైంది. పెరిగిన ఓటింగ్ ఎవరికి లాభిస్తుందన్న చర్చ జరుగుతోంది. పార్టీలు ఎవరికి వారు అనుకూలంగా లెక్కలు వేసుకుంటున్నాయి. ఇక లోక్‌సభ నియోజకవర్గాల వారీగా నమోదైన పోలింగ్ శాతం పరిశీలిస్తే.. ఆదిలాబాద్‌లో 7.96, పెద్దపల్లిలో 67.88 శాతం, కరీంనగర్‌లో 72.33 శాతం, నిజామాబాద్‌లో 71.50 శాతం, జహీరాబాద్‌లో 74.54, మెదక్‌లో 74.38 శాతం, .మల్కాజ్‌గిరిలో 50.12 శాతం, సికింద్రాబాద్‌లో 48.11 శాతం, హైదరాబాద్‌లో 46.08 శాతం, చేవెళ్లలో 55.45 శాతం, మహబూబ్‌నగర్‌లో 71.54 శాతం, నాగర్‌కర్నూల్‌లో 68.29 శాతం, మహబూబాబాద్‌లో 70.68 శాతం, వరంగల్‌లో 68.29 శాతం, ఖమ్మంలో అత్యధికంగా 75.19 శాతం పోలింగ్ నమోదైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్‌గిరిలో ఈసారి పోలింగ్‌శాతం బాగా తగ్గింది. హైదరాబాద్, సికింద్రాబాద్‌లో కూడా ఓటర్లు పెద్దగా స్పందించలేదు.ః ఇక కాంగ్రెస్‌కు కంచు కోటలుగా భావించిన భువనగిరి, ఖమ్మం నియోజకవర్గాల్లో ఈ ఎన్నికల్లో అత్యధిక శాతం పోలింగ్ నమోదైంది. ఈ రెండు నియోజకవర్గాల్లో పోలింగ్‌లో అగ్రస్థానంలో ఉన్నాయి. కరీంనగర్, జహీరాబాద్, ఆదిలాబాద్ లో కూడా అత్యధికంగా పోలింగ్ నమోదైంది. ఫలితాలు జూన్ 4న వెలువడనున్నాయి. ఓటర్లు ఎవరికి పట్టం కట్టారు అనేది ఆరోజు వెల్లడికానుంది.

# ఆడవాళ్ల కదలికపై మీకెందుకంత ఆసక్తి?.. అమిత్‌షాపై ప్రియాంక మండిపాటు





న్యూఢిల్లీ: ఎన్నికల్లో మాత్రమే గాంధీ కుటుంబసభ్యులు అమేథి, రాయబరేలి నియోజకవర్గాల్లో పర్యటిస్తారంటూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆరోపణలపై కాంగ్రెస్ సీనియర్ నేత ప్రియాకం గాంధీ వాద్రా ఘాటుగా విమర్శించారు. ఆయన వాదన సత్యదూరమని అన్నారు. మహిళల కార్యకలాపాలపై అమిత్‌షా నిఘా వేయడం ఏమిటని నిలదీశారు. థాయ్‌లాండ్‌లో తాను పర్యటించిన సమాచారాన్ని ఆయన ఎలా సేకరించారని ప్రశ్నించారు. అమిత్ షా గత ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో అమేథీ, రాయబరేలి నియోజకవర్గాలను గతంలో అక్కడి నుంచి గెలిచిన గాంధీ ఫ్యామిలీ నిర్లక్ష్యం చేసిందని అన్నారు. ఆ నియోజకవర్గాల్లో గెలిచిన తర్వాత సోనియాగాంధీ, ఆమె కుటుంబం ఎన్నిసార్లు ప్రజలను చూసేందుకు వచ్చారు? అని ప్రశ్నించారు. సోనియాగాంధీకి ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, రాహుల్, ప్రియాంక గాంధీ మాటేమిటని నిలదీశారు. గతంలో రాయబరేలి నియోజకవర్గంలో పలు దురదృష్టకర సంఘటనలు జరిగినా గాంధీ కుటుంబసభ్యులు వచ్చిన దాఖలాలు లేవన్నారు.

తిప్పికొట్టిన ప్రియాంక..

హోం మంత్రి ఆరోపణల్లో నిజం ఏమాత్రం లేదని, మహిళల కార్యకలాపాలపై ఆయన నిఘా వేస్తుంటారని ఆరోపించారు. "ముఖ్యంగా మహిళలతో సహా ఎవరు ఏం చేస్తున్నారు? ఎప్పుడు, ఎక్కడ ఉన్నారు? అనే దానిపై ఆయన దృష్టి సారిస్తుంటారు. నేను కొద్ది రోజుల క్రితం నా కుమార్తెను చూసేందుకు థాయ్‌లాండ్ వెళ్లాను. ఎన్నికల మీటింగ్‌లో ఆయన (అమిత్‌షా) ఈ ప్రస్తావన చేశారు. అవును...నేను థాయ్‌లాండ్ వెళ్లాను. అయితే ఈ సమాచారం ఆయనకు ఎవరు ఇచ్చారో చెప్పగలరా? ఆయన దగ్గర సమాచారం ఉన్నప్పుడు అబద్ధాలు చెప్పాల్సిన పనేంటి?" అని ప్రియాంక నిలదీశారు.

కాంగ్రెస్ చాలా చేసింది..

కాంగ్రెస్ హయాంలో అనేక ప్రాజెక్టులు పూర్తి చేసినట్టు ప్రియాంక తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గంగా బ్రిడ్జి, ఎయిమ్స్, నిఫ్ట్, ఎఫ్‌డీడీఐ, లక్నో నుంచి రాయబేరిలికి 4 లేన్ రింగ్ రోడ్డు, ఐదు నేషనల్ హైవేలు ఇచ్చిందన్నారు.

మోటార్ డ్రైవింగ్ స్కూలు తాము ప్రారంభిస్తే వాళ్లు మూసేశారని కోవిడ్ మహమ్మారి సమయంలో ఎంపీలాడ్స్ ద్వారా సాయం, రైల్వే వాషింగ్ చెప్పారు. స్పైస్ పార్క్, ఎయిమ్స్ ప్రారంభిస్తే దానిని కూడా వారు మూసివేయించారని చెప్పారు. 8 ఫ్లైఓవర్లు, లైన్, రైల్వేస్టేషన్ల మాడిఫికేషన్, 10 రైల్వే అండర్‌పాస్, కేంద్ర నిధులతో రాయబేరి నుంచి డల్‌మవు వరకూ రోడ్డు నిర్మాణం వంటివి తాము చేపట్టామని చెప్పారు.

రాబయరేలికి బీజేపీ ఏమి చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. కాగా, ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో అమేథీ, రాయబరేలిలో ఎన్నికల ప్రచారానికి ప్రియాంక గాంధీ సారథ్యం వహిస్తున్నారు. ఐదో విడత ఎన్నికల్లో భాగంగా మే 20న రాయబరేలిలో పోలింగ్ జరుగనుంది.

## ప్రధాని అభ్యర్థిగా రాహుల్.. అఖిలేష్ యాదవ్ క్లారిటీ..!



ఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నాలుగు విడతల పోలింగ్ ముగిసింది. జూన్1తో దేశంలో ఏడు విడతల పోలింగ్ ప్రక్రియ పూర్తవుతుంది. ఎన్డీయే కూటమి నుంచి నరేంద్రమోదీ ప్రధాని అభ్యర్థిగా ఉన్నారు.లః ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థిని బహిరంగంగా ప్రకటించలేదు. ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలు ఈ అంశంపై ఎన్నికల షెడ్యూల్‌కు ముందు చర్చించినప్పటికీ ఏకాభిప్రాయం రాలేదు. దీంతో ఎన్నికల ఫలితాల తర్వాత ప్రధానమంత్రి అభ్యర్థిత్వంపై నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. ఈ అంశాన్ని బీజేపీ ఎన్నికల ప్రచారంలోనూ ప్రధానంగా ప్రస్తావిస్తోంది. ఇండియా కూటమికి ప్రధానమంత్రి అభ్యర్థి లేరని, తమ ప్రధాని అభ్యర్థి ఎవరో నిర్ణయం తీసుకోలేని పరిస్థితుల్లో ఉన్నారని బీజేపీ నేతలు విమర్శిస్తూ వస్తున్నారు. మరోవైపు ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఏడాదికి ఒక ప్రధాని చొప్పున ఐదేళ్లకు ఐదుగురు ప్రధానమంత్రులు ఉంటారంటూ పీఎం నరేంద్రమోదీ ఎద్దేవాచేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారా అనే ప్రశ్నపై ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ స్పందించారు.

అఖిలేష్ ఏమన్నారంటే..

కేంద్రంలో జూన్4 తర్వాత ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడబోతుందని ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం, ఎస్పీ నేత అఖిలేష్ యాదవ్ పేర్కొన్నారు. బీజేపీ రథం పూర్తిగా కూలిపోయిందని, ఆ పార్టీకి 140 సీట్లు కూడా రావన్నారు. రాయ్‌బరేలీ నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్న రాహుల్‌గాంధీని ప్రధానిని చేస్తారా అన్న ప్రశ్నకు మా వ్యూహం ఇప్పుడే చెప్పబోమని అఖిలేష్ యాదవ్ తెలిపారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, లక్నోలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీకి కౌంట్‌డైన్ ప్రారంభమైందని చెప్పారు. బీజేపీ ఎంత ఎత్తుకు వెళ్లాలో అంతే ఎత్తుకు వెళ్లిందని, ప్రస్తుతం ఎత్తు తగ్గే ప్రక్రియ మొదలైందన్నారు. బీజేపీ నిరంతరం పతనం అవుతోందని, బీజేపీ రథం పూర్తిగా మునిగిపోయిందన్నారు. ఉత్తరప్రదేశ్‌లో తప్పకుండా 79 సీట్లు గెలుస్తున్నామని అఖిలేష్ జోష్యం చెప్పారు. దేశంలో ఇండియా కూటమి మెజార్టీ సీట్లు గెలవబోతుందన్నారు.

రాయ్‌బరేలీలో రాహుల్ ప్రధాని నినాదం..

ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి రాహుల్ గాంధీ పోటీచేస్తున్నారు. ఈక్రమంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రాహుల్ ప్రధాని అంటూ కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. దీనిపై అఖిలేష్ స్పందిస్తూ సరైన సమయంలో తమ వ్యూహం తెలుస్తుందని, ముందుగానే ఏమి చెప్పలేమన్నారు. బీజేపీని ఉత్తరప్రదేశ్ ప్రజలు తిరస్కరించబోతున్నారని, ఆ విషయం పార్లమెంట్ ఎన్నికల ఫలితాలతో దేశం మొత్తానికి తెలుస్తుందన్నారు.

## మోదీని సాగనంపడం ఖాయం.. అఖిలేష్‌తో సంయుక్త సమావేశంలో ఖర్గే



లక్నో: 'ఇండియా' కూటమి జూన్ 4న కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ధీమా వ్యక్తం చేశారు. ఇంతవరకూ పూర్తయిన నాలుగు విడతల పోలింగ్‌లో విపక్ష కూటమి స్ట్రాంగ్ పొజిషన్‌లో నిలిచిందని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని సాగనంపడానికి దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడటానికి ఈ ఎన్నికలు చాలా కీలకమని వ్యాఖ్యానించారు. మల్లికార్జున్ ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ లక్నోలో బుధవారంనాడు సంయుక్తంగా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. "దేశ భవిష్యత్తు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి మనమంతా కలిసికట్టుగా పనిచేయాల్సి ఉంటుంది. ప్రజాస్వామ్యం లేకపోతే అరాచకత్వం, నియంతృత్వం రాజ్యమేలుతుంది. బీజేపీకి చెందిన బడానేతలు ఎక్కడ పోటీచేసినా అక్కడ విపక్ష నేతలను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారు. హైదరాబాద్‌లో ఒక ఘటన చూశాను. బీజేపీకి చెందిన మహిళా అభ్యర్థిని ఒకరు బురఖాలు తొలగించి మహిళల ఐడెంటిటీని తనిఖీ చేశారు. దీనిని స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు నిర్వహించడమని అంటారా?" అని ఖర్గే ప్రశ్నించారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే పేద ప్రజలకు ప్రతినెలా 10 కిలోల ఉచిత రేషన్ అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఇచ్చిన అన్ని వాగ్దానాలకు తాము అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. ఐదు కిలోల రేషన్ ఇస్తున్నామంటూ కొందరు మాట్లాడుతున్నారని, అసలు ఆహార భద్రతా చట్టం తెచ్చిందే తామని గుర్తు చేశారు. ఇండియా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 10 కిలోల రేషన్ ఇవ్వడం ఖాయమన్నారు. కర్ణాటక, తెలంగాణలో తాము ఇచ్చిన హామీలను అమలు చేశామని చెప్పారు.

యూపీలో 79 సీట్లు ఇండియా కూటమికే..

జూన్ 4వ తేదీతో పత్రికా స్వేచ్ఛకు స్వర్ణయుగం రానుందని, ఇందుకు మీడియాకు అభినందనలు తెలియచేయాలని అనుకుంటున్నానని అఖిలేష్ యాదవ్ అన్నారు. బీజేపీ ప్రతికూల కథనాలతో తనంత తానుగా ఉచ్చులో చిక్కుకుందన్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఇండియా కూటమి 79 సీట్లు గెలుచుకోవడం ఖాయమని, కేవలం ఒక్క సీటులోనే పోటీ ఉందని చెప్పారు.

## పీఓకే మనదే, వెనక్కి తెస్తాం: అమిత్‌షా



కోల్‌కతా: పాక్ ఆక్రమిత కశ్మీర్ పై భారతదేశం సార్వభౌమాధికారాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మరోసారి విస్పష్టంగా ప్రకటించారు. పీఓకే ఇండియాకు చెందినదని, దానిని వెనక్కి తెచ్చుకుంటామని అన్నారు. పశ్చిమబెంగాల్ లోని సెరంపోర్‌లో బుధవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో విపక్షాల తీరును ఆయన ఎండగట్టారు. జమ్మూకశ్మీర్‌లో గతంలో శాంతిభద్రతల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉండటానికి వారే కారణమని అన్నారు. మోదీ నాయకత్వంలో కశ్మీర్‌లో వచ్చిన గణనీయమైన మార్పులను కొనియాడారు. కశ్మీర్‌లో ఒకప్పుడు నిత్యం ఆజాదీ నినాదాలు, రాళ్లు రువ్వుకోవడం ఉండేవని, ఇప్పుడు అవన్నీ పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో చోటుచేసుకుంటున్నాయని అన్నారు. "రాహుల్ బాబా, మమతా దీదీకి భయం ఉంటే, భయపడనీయండి. పీఓకే మాత్రం ఇండియాదే. దానిని వెనక్కి తెచ్చుకుంటా" అని అమిత్‌షా నొక్కిచెప్పారు.

అయ్యర్ అణుబాంబు..

మణి శంకర్ అయ్యర్, ఫరూక్ అబ్దుల్లా వంటి నేతలు పాకిస్థాన్-పీఓకేపై చర్చలను నిర్లక్ష్యం చేస్తూ పాక్ వద్ద అణుబాంబు ఉందంటూ హైలైట్ చేయడం వెనక దేశప్రజల్లో భయం సృష్టించే ప్రయత్నమే ఉందని అమిత్‌షా తప్పుపట్టారు. 2.11 కోట్ల టూరిస్టులు కాశ్మీర్ వచ్చి సరికొత్త రికార్డు సృష్టిస్తే, పీఓకేలో రొట్టెల పిండి ధర రికార్డు సృష్టిస్తోందన్నారు. ప్రతి పేదవానికి మోదీ ప్రభుత్వం 5 కిలోల ఉచిత బియ్యం ఇస్తోందన్నారు. మమతా బెనర్జీ మాత్రం బియ్యం పంపిణీ ప్రక్రియను పక్కదారి పట్టిస్తున్నారని విప్రదర్శిస్తూ, సంక్షేమాన్ని కూడా రాజకీయం చేస్తున్నారని అన్నారు. 'మా, మర్శించారు. మోదీ ప్రభుత్వం బియ్యం పంపుతుంటే మమతా బెనర్జీ దానిపైన తన ఫోటోని మాటి, మనుష్' అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన దీదీ ఇప్పుడు ఆ నినాదాన్ని 'ముల్లా, మౌల్వి, మదరసా'గా మార్చారని ఎద్దేవా చేశారు. దుర్గా నిమజ్జనానికి ఆమె అనుమతి నిరాకరించి, రంజాన్ పండుగకు మాత్రం ముస్లింలకు సెలవులు మంజూరు చేస్తున్నారని విమర్శించారు.పశ్చిమబెంగాల్‌లో లోక్‌సభ ఎన్నికలు మొత్తం ఏడు విడతల్లోనూ జరుగుతుండగా, జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి.

## అమెరికా వార్నింగ్‌పై భారత్ రియాక్షన్.. చిన్నచూపు చూడొద్దు



ఢిల్లీ : చాబహార్ పోర్టు నిర్వహణ కోసం ఇరాన్‌తో భారత్ కుదుర్చుకున్న పదేళ్ల ఒప్పందంపై అమెరికా పరోక్షంగా ఇచ్చిన వార్నింగ్ మీద విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ స్పందించారు. ఈ ప్రాజెక్ట్‌ని చిన్నచూపు చూడొద్దని, ఇది ఎన్నో ప్రయోజనాలను చేకూరిస్తుందని తెలిపారు. గతంలో చాబహార్ ఔచిత్యాన్ని స్వయంగా యూఎస్ ప్రశంసించిందన్న విషయాన్ని కూడా ఆయన ఎత్తిచూపారు. బుధవారం కోల్‌కతాలో తాను రాసిన పుస్తకం 'వై భారత్ మ్యాటర్స్' బంగ్లా ఎడిషన్‌ను ఆవిష్కరించిన తర్వాత జరిగిన ఇంటరాక్షన్‌లో భాగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "అమెరికా చేసిన వ్యాఖ్యల గురించి నేను విన్నాను. కానీ.. ఈ చాబహార్ పోర్టు ఒప్పందం అనేది ప్రతిఒక్కరి ప్రయోజనం కోసం. ఈ విషయం అర్థమయ్యేలా ప్రజలకు చెప్పాలి, ఒప్పించగలగాలని నేను భావిస్తాను. ఈ ప్రాజెక్ట్‌ని ఏ ఒక్కరూ చిన్నచూపు చూడకూడదు. గతంలో అమెరికా కూడా అలా చేయలేదు. ఈ చాబహార్ పోర్టు పట్ల అమెరికా వైఖరిని పరిశీలిస్తే.. దాని గొప్పదనాన్ని, విశాల ఉపయోగాలను ఆ అగ్రరాజ్యం మెచ్చుకుంది" అని జైశంకర్ చెప్పుకొచ్చారు. అలాగే.. అమెరికా చేసిన వ్యాఖ్యలపై తాము చర్చిస్తామని కూడా తెలిపారు. ఈ ఒప్పందం భారత్‌తో పాటు మధ్య ఆసియా దేశాలకు ఎంతో ప్రయోజనకరంగా మారుతుందని ఆయన మరోసారి స్పష్టం చేశారు.

అమెరికా జారీ చేసిన హెచ్చరికలేంటి?

చాబహార్ పోర్టు నిర్వహణ కోసం ఇరాన్, భారత్ మధ్య ఒప్పందం కుదిరిన కొన్ని గంటల వ్యవధిలోనే అమెరికా స్పందిస్తూ.. ఇరాన్‌తో ద్వైపాక్షిక సంబంధాలు, దేశ విదేశాంగ విధాన లక్ష్యాలపై భారత్ సొంతంగా నిర్ణయాలు తీసుకోవచ్చని తెలిపింది. కానీ.. ఇరాన్‌పై అమెరికా కొన్ని ఆంక్షలు విధించిందని, వాటి అమలుని తాము కొనసాగిస్తూనే ఉంటామని పేర్కొంది. అలాంటి ఇరాన్‌తో ఏ సంస్థ అయినా, ఏ దేశమైనా వ్యాపార లావాదేవీలు జరిపితే.. వారు కూడా ఆ ఆంక్షల ఛట్రంలో పడే ప్రమాదం ఉందని భారత్‌ను పరోక్షంగా హెచ్చరించింది. ఈ వార్నింగ్ గతంలోనూ చాలాసార్లు ఇచ్చామని పేర్కొంది. ఇందుకు బదులుగానే జైశంకర్ పైవిధంగా స్పందించారు.

అసలు చాబహార్ ఒప్పందం ఏంటి?

మధ్య ఆసియా దేశాలతో భారత్ వాణిజ్య వ్యవహారాలు నెరపేందుకు 'చాబహార్ పోర్టు' ప్రధాన మార్గంగా ఉంది. ఈ మార్గం ద్వారా కజకిస్థాన్, కిర్గిజ్ రిపబ్లిక్, తజికిస్థాన్, తుర్క్మెనిస్థాన్, ఉజ్బెకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్ వంటి దేశాలకు భారత్ నుంచి సరకు రవాణా చేయవచ్చు. అందుకే.. చాబహార్ నిర్వహణ కోసం ఇరాన్‌తో భారత్ పదేళ్ల పాటు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ పోర్టు అభివృద్ధి, నిర్వహణలో ఇప్పుడు భారత్ కీలకపాత్ర పోషిస్తుంది. కేవలం పదేళ్లే కాకుండా దీర్ఘకాలిక ఒప్పందం దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని, ఎందుకంటే అది లేకుండా పోర్ట్ ఆపరేషన్‌ని మెరుగుపర్చలేమని కూడా జై శంకర్ చెప్పుకొచ్చారు.

## రంగంలోకి కేజ్రీవాల్..?

### ఢిల్లీ సీఎం ఎన్నికల ప్రచారం.. ఈ నెల 25న ఢిల్లీలో పోలింగ్' రాజధానిలో కాంగ్రెస్‌తో ఆప్ పొత్తు.. 4-చోట్ల పోటీ పంజాబ్‌లో అన్ని స్థానాల్లో ఒంటరిగా బరిలోకి!




ఢిల్లీ : మద్యం విధానం కుంభకోణంలో అరెస్టయిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఎన్నికల ప్రచారం కోసం బెయిల్ రావడం ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. మరీ ముఖ్యంగా ఆప్ అధికారంలో ఉన్న ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో కేజ్రీ రంగంలోకి దిగితే రాజకీయ పరిణామాలు ఎలా మారుతాయన్నది ఆసక్తికరంగా మారింది. రెండు వారాల బెయిల్ పొందిన కేజ్రీ శుక్రవారం బయటకు వచ్చారు. మరుసటి రోజే మీడియా సమావేశం ఏర్పాటు చేయగా.. పార్టీ కార్యకర్తలు, నేతలు భారీఎత్తున తరలివచ్చారు. దీంతో సమావేశం బహిరంగ సభను తలపించింది. ఆదివారం ఎమ్మెల్యేలతో సమావేశమైన కేజ్రీ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఇండియా కూటమి పార్టీల అభ్యర్థులకు మద్దతుగా బుధవారం లఖ్‌నవూ, 16న జమ్‌షెడ్‌పూర్, 17న ముంబైలో పర్యటించడం ద్వారా నేరుగా ఎన్నికల కదన రంగంలోకి దిగనున్నారు. ఢిల్లీలో ఏడు స్థానాలకు గాను ఆప్ నాలుగుచోట్ల పోటీ చేస్తోంది. కాంగ్రెసకు మూడు స్థానాలు కేటాయించింది. ఢిల్లీలో ఆరో విడతలో ఈ నెల 25న పోలింగ్ జరగనుంది. పంజాబ్‌లో మాత్రం కాంగ్రెస్, ఆప్ వేటికవే పోటీ చేస్తున్నాయి. చాలాచోట్ల ప్రధాన ప్రత్యర్థులుగా తలపడతున్నాయి. ఈ రాష్ట్రంలో ఏడో విడతలో జూన్ 1న పోలింగ్ నిర్వహించనున్నారు.

కేజ్రీ లోటు ఢిల్లీలో స్పష్టం

ఆమ్ ఆద్మీ పార్టీకి పంజాబ్ కంటే ఢిల్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్ లేని లోటు మొన్నటివరకు స్పష్టంగా కనిపించింది. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీని స్వీప్ చేసిన బీజేపీని ఈసారి నిలువరించాలంటే కేజ్రీనే మూలస్తంభం. అయితే, సరిగ్గా ఎన్నికల సమయంలో మద్యం కుంభకోణంలో ఆయనను అరెస్టు చేసి 50 రోజులు జైల్లో ఉంచడంతో ఆప్ డీలాపడిపోయింది. మరోవైపు ఆప్‌తో పొత్తును తీవ్రంగా వ్యతిరేకిస్తూ కాంగ్రెసకు చెందిన పలువురు నాయకులు రాజీనామా చేశారు. ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్విందర్ సింగ్ లవ్లీ బీజేపీలో చేరిపోయారు. క్షేత్రస్థాయిలోనూ రెండు పార్టీల శ్రేణుల మధ్య విభేదాలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కేజ్రీ రాక.. రెండు పార్టీల మధ్య సమన్వయాన్ని పెంచుతుందని.. ఉమ్మడి ప్రత్యర్థి బీజేపీని ఎదుర్కొనేందుకు బలం ఇస్తుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. కేజ్రీవాల్ రాకతో ఆప్ కార్యకర్తల్లో నైతిక స్థైర్యం పెరిగింది. ఆప్-కాంగ్రెస్ ఎన్నికల సమన్వయ కమిటీలో చురుకుదనం వచ్చింది. అయితే, సుదీర్ఘ కాలం నుంచి ప్రత్యర్థులుగా ఉన్న పార్టీల మధ్య రెండు పార్టీల మధ్య ఓట్ల బదిలీపైనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

పంజాబ్ వెళ్లకుంటేనే మేలు?

ఢిల్లీలో కేజ్రీ ప్రచారం ఆప్‌నకు ఎంత బలమో పంజాబ్‌లో అంత ఇబ్బందికరం అన్న విశ్లేషణలు వస్తున్నాయి. సీఎం భగవంత్‌సింగ్ మాన్ ఇప్పటివరకు అంతా తానే అయి నడిపిస్తున్నారు. దీంతో కేజ్రీ వచ్చినా పెద్దగా ప్రయోజనం లేదంటున్నారు. అంతేగాక, ఆయన రాక రాష్ట్రంలో ఆప్-కాంగ్రెస్ శ్రేణుల మధ్య విభేదాలను మరింత రాజేస్తుందని.. ఆ ప్రభావం ఢి ల్లీపైనా పడుతుందనిపేర్కొంటున్నారు. అన్నిటికిమించి కేజ్రీ రాక పంజాబ్‌లో అతివాద సిక్కు ఓటర్లు ఆప్‌నకు వ్యతిరేకం అవుతారని వివరిస్తున్నారు. ఖదూర్ సాహిబ్ నుంచి స్వతంత్రుడిగా పోటీ చేస్తున్న ఖలిస్థానీ ఉగ్రవాది అమృత్ పాల్‌సింగ్‌కు బెయిల్ రాకపోవడం, కేజ్రీవాల్‌కు ప్రచారం కోసం బెయిల్ దొరకడం ఆప్‌కు ఇబ్బందికరమవుతుందన్న భావన వ్యక్తమవుతోంది. '

## హైదరాబాద్‌లో భారీ మెజారిటీపై 'మజ్లిస్' ధీమా...

### - పోలింగ్ శాతం తగ్గినా.. గెలుపుపై భరోసా
### - పోల్ మేనేజ్‌మెంట్‌తో ప్రత్యర్థులను చిత్తు చేసిన మజ్లిస్



హైదరాబాద్: హైదరాబాద్ లోక్‌సభ స్థానం మజ్లిస్ కు కంచుకోటగా మరోసారి రుజువు చేసుకుంటుందని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.లః పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సరళిని విశ్లేషించిన మజ్లిస్ పార్టీ వర్గాలు 2019 నాటి ఎన్నికల కంటే మరింత మెజారిటీతో అసదుద్దీన్ ఒవైసీ విజయం సాధించి తీరుతారని ఆ పార్టీ నేతలు విశ్వాసంతో ఉన్నారు. 1984లో మొదటిసారిగా హైదరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకున్న మజ్లిస్ ప్రతీసారి ఎన్నికల్లో విజయం సాధిస్తూ వచ్చింది. 1984 నుంచి 1999 వరకు ఆరుసార్లు జరిగిన లోకసభ ఎన్నికల్లో సుల్తాన్ సలాఉద్దీన్ ఒవైసీ విజయం సాధించగా, ఆ తర్వాత 2004 నుంచి 2019 వరకు నాలుగుసార్లు జరిగిన ఎన్నికల్లో మజ్లిస్ అభ్యర్థిగా అసదుద్దీన్ ఒవైసీ భారీ మెజారిటీతో గెలిచారు. 2024లో సైతం మరింత మెజారిటీతో విజయం సాధిస్తామనే ధీమాతో ఉన్నారు. జాతీయ రాజకీయాల్లో ముస్లిం మైనారిటీల గొంతుకగా నిలిచిన అసదుద్దీన్ ఒవైసీ హైదరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని సుస్థిరం చేసుకుని కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. బీజేపీ విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఆలిండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్(మజ్లిస్)ను ఈసారి ఓడించేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించి మాధవీలతను ఆయనపై పోటీకి నిలబెట్టింది. మజ్లిస్‌కు చెక్‌పెట్టడానికే తాను రంగంలోకి దిగానని కొన్ని నెలలుగా మాధవీలత సోషల్ మీడియాలో భారీ ఎత్తున ప్రచారం చేసుకున్నప్పటికీ స్థానిక బీజేపీ యంత్రాంగాన్ని ఆశించిన స్థాయిలో వినియోగించుకోలేపోయినట్టు విమర్శలు వెల్లువెత్తాయి. పోలింగ్ బూత్‌లలో పార్టీ తరఫున ఏజెంట్‌లను నియమించుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కొన్నిప్రాంతాల్లో ఏకపక్షంగా పోలింగ్ జరిగినట్టు స్పష్టమవుతోంది. రాష్ట్రం మొత్తంలో హైదరాబాద్ పార్లమెంట్‌లోనే అత్యల్పంగా 48.48 శాతం ఓట్లు పోల్‌అయ్యాయి. అయినప్పటికీ పోల్ అయిన ఓట్లలో 60 నుంచి 70 శాతం వరకు మజ్లిస్‌కే పడినట్లు ఆ పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరు మజ్లిస్ ఆధిపత్యంలో కొనసాగుతున్నాయి. గోషామహల్‌లో బీజేపీ నుంచి రాజాసింగ్ ప్రాతిని?ధ్యం వహిస్తున్నారు. మాధవీలతపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు బీఆర్ఎసకు కొంత సానుకూలంగా ఉన్నట్టు తెలిసింది. అయినప్పటికీ గోషామహల్‌లో ముస్లిం మైనారిటీల ఓట్లన్నీ గంపగుత్తగా మజ్లిస్ కు వస్తాయని ఆ పార్టీ నేతలు భరోసాతో ఉన్నారు. గోషామహల్‌లో 1,50,207 ఓట్లు పోల్ అయినట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఇక కార్వాన్‌లో పోల్ అయిన 1,85,681 ఓట్లలో లక్షా 5వేలకు పైగా మజ్లిస్‌కు వస్తాయని స్థానిక నాయకులు అంచనా వేస్తున్నారు. మలక్‌పేట్‌లో పోల్ అయిన 1,35,807 ఓట్లలో 80వేలకు పైగా అసదుద్దీన్ ఒవైసీకి అనుకూలంగా వస్తాయని మజ్లిస్ నేతలు విశ్వాసంతో ఉన్నారు. ఇక్కడ ముస్లిం మైనారిటీలే కాకుండా మైనారిటీయేతరులు సైతం మజ్లిస్ కు మద్దతుగా నిలిచినట్టు ప్రచారం జరిగింది. ఇక చార్మినార్ లో పోల్ అయిన 1,11,761 ఓట్లలో 80 శాతానికి పైగా మజ్లిస్ కు వస్తాయని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఇక్కడ ప్రత్యర్థి పార్టీలకు ఆశించిన స్థాయిలో ఓటర్ల మద్దతు లభించలేదు. కాగా, బహదూర్‌పురాలో పోలైన 1,63,204 ఓట్లలో లక్షకు పైగా ఓటర్లు మజ్లిస్ కు మద్దతుగా నిలిచినట్టు స్పష్టమవుతోంది. ఇక్కడ బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు నామమాత్రం. చాంద్రాయణగుట్టలో 1,71,826 ఓట్లలో లక్షా 25వేలకు పైగా మజ్లిస్ కు అనుకూలంగా పోల్ అయినట్టు సమాచారం. ఇక్కడ మధ్యాహ్నం వరకు ఒకవర్గానికి అనుకూలం కన్పించగా సాయంత్రం వేతీసుకువచ్చి ఓట్లు వేయించుకోవడంతో భారీ మెజారిటీ వస్తుందని ళ ఓటింగ్‌కు రాని వారిని గుర్తించి మజ్లిస్ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను ఆశిస్తున్నారు. యాకుత్‌పురాలో మజ్లిస్ కు ధీటుగా ప్రత్యర్థి పార్టీలునప్పటికీ లోకసభ ఎన్నికల్లో సీన్‌మారింది. ఇక్కడ పోల్‌అయిన 1,56,341 ఓట్లలో లక్షకు పైగా ఓట్లు మజ్లిస్‌కు వస్తాయని ఆ పార్టీ నేతలు విశ్లేషిస్తున్నారు. హైదరాబాద్ పార్లమెంట్ స్థానంలో 2019లో మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ 5,17,100 ఓట్లతో సమీప బీజేపీ అభ్యర్థిపై 2.82 లక్షల మెజారిటీ సాధించారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో 65 శాతానికి పైగా ఓట్లతో మరింత మెజారిటీ సాధించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు సంపూర్ణ విశ్వాసంతో ఉన్నాయి.

# ఏపీలో ప్రయివేటు బంగారు గని..



హైదరాబాద్ : దేశంలోకెల్లా తొలి ప్రయివేటు బంగారు గని ఆంధ్రప్రదేశ్ లో సిద్ధమవుతోంది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని జొన్నగిరిలో బంగారు గనిని డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థ అభివృద్ధి చేస్తోంది. సుమారు 250 ఎకరాల భూసేకరణ చేపట్టి భూగర్భం నుంచి పసిడిని వెలికితీసేందుకు రూ. 200 కోట్ల పెట్టుబడితో భారీ ప్లాంట్ నిర్మిస్తోంది. ఇప్పటికే 60 శాతం పనులు పూర్తవడంతో పైలట్ స్థాయిలో రోజుకు కిలో బంగారం ఉత్పత్తి చేస్తున్నట్లు సంస్థ ఎండీ హనుమ ప్రసాద్ తెలిపారు. ఈ ఏడాది చివరికల్లా పూర్తిస్థాయి కార్యకలాపాలు మొదలైతే ఏటా 750 కిలోల బంగారం ఉత్పత్తి జరుగుతుందని చెప్పారు. మరోవైపు చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో కొన్ని బంగారం గనులను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండీసీ) ఆసక్తి చూపుతోంది. ఈ గనులను అప్పగించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరింది. దక్కన్ గోల్డ్ మైన్స్ కు దేశంలో వివిధ ప్రాంతాల్లో గనులు ఉన్నాయి. ఆఫ్రికాలోని మొజాంబిక్లో లిథియమ్ గనులను ఆ సంస్థ తాజాగా కొనుగోలు చేసింది. రోజుకు 100 టన్నుల లిథియం, ఇతర ఖనిజాలను వెలికి తీసేందుకు భారీ ప్లాంట్లు నిర్మిస్తోంది. ఇందుకోసం స్థానికంగా ఉన్న మరో కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. తాజాగా రాజస్తాన్లో అమ్మకానికి పెట్టిన రెండు బంగారు గనులను సొంతం చేసుకొనేందుకు వేదాంతా గ్రూపు సంస్థ అయిన హిందూస్థాన్ జింక్, జిందాల్ పవర్, జేకే సిమెంట్ పోటీపడుతున్నాయి. రాజస్తాన్లోని కంక్రియా గారా గోల్డ్ బ్లాక్, భూకియా-జగ్పురా గోల్డ్ బ్లాక్లను ఆ రాష్ట్ర ప్రభుత్వం వేలం వేస్తోంది. తాజాగా వేలంలో పాల్గొనేందుకు సాంకేతిక అర్హత సాధించిన కంపెనీల్లో అవి కూడా ఉన్నాయి.

# గనిలో కూలిన లిఫ్ట్.. లోపట 11మంది



హైదరాబాద్ : రాజస్థాన్ లోని ఝుంఝును జిల్లాలోని హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్కు చెందిన కోలిహాన్ గనిలో లిఫ్ట్ కూలిపోవడంతో 14 మంది గనిలోనే చిక్కుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన జరింగింది. రెస్క్యూ టీంలు సహాయక చర్యలు చేపట్టి ముగ్గురిని సురక్షితంగా బయటకు తీశారు. మిగిలిన 11 మందిని గనిలో నుంచి బయటకు తీసుకొచ్చేందుకు అధికారులు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. లిఫ్ట్ కు కట్టిన తాడు తెగిపోవడం వల్ల గనిలోనే లిఫ్ట్ కూలిపోయింది. ప్రమాదంలో కూలిపోయిన లిఫ్ట్లో కోల్కతా నుంచి వచ్చిన విజిలెన్స్ టీంతో పాటు గని అధికారులు కూడా ఉన్నారు. గనిలోపల 1,800 అడుగుల లోతులో లిఫ్ట్ కూలిపోయి ఉంటుందని భావిస్తున్నారు. చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఉపేంద్ర పాండే, ఖేత్రి కాపర్ కాంప్లెక్స్ (కెసిసి) యూనిట్ హెడ్ జిడి గుప్తా, కోలిహన్ మైన్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎకె శర్మ లిఫ్ట్ లో ఉన్నారు. లోపన ఉన్న వారికి ఏవైనా గాయాలైతే చికిత్స అందించడానికి అధికారులు అంబులెన్స్ లు రెడీగా ఉంచారు. మిగిలిన 11మంది కూడా ప్రాణాలోనే ఉన్నారని డాక్టర్లు సూచిస్తున్నారు. వారిని రక్షించేందుకు జిల్లా అధికారులు, ఎన్డీఆర్ రెస్క్యూ టీంలు ప్రయత్నిస్తున్నాయి.

# యోగా బాబాపై తీర్పు రిజర్వ్

### కొంత సమయం కావాలన్న పతంజలి
### రాందేవ్ ప్రభృతులకు కోర్టు ధిక్కార నోటీసులపై సుప్రీం తీర్పు




న్యూఢిల్లీ : ప్రజలను తప్పుదారి పట్టించేలా వాణిజ్య ప్రకటనలు జారీ చేస్తున్న కేసులో యోగా గురు రాందేవ్, ఆయన సహాయకుడు బాలకృష్ణ, పతంజలి ఆయుర్వేద లిమిటెడ్కు కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేయడంపై సుప్రీం కోర్టు మంగళవారం తన తీర్పును రిజర్వ్ చేసుకుంది. లైసెన్సులు రద్దు చేయబడిన పతంజలి ఉత్పత్తులకు సంబంధించిన యాడ్స్ను రీకాల్ చేయడానికి తీసుకున్న చర్యలను వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయడానికి కొంత సమయం కావాలని పతంజలి తరపు న్యాయవాది కోర్టును కోరారు. మూడు వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీం బెంచ్ ఆదేశించింది. వారికి కోర్టు ధిక్కార నోటీసులను జారీ చేయడంపై ఆదేశాలను రిజర్వ్ చేసుకున్నామని జస్టిస్ హిమా కొహ్లి, జస్టిస్ అసనుద్దీన్ అమనుల్లాలతో కూడిన బెంచ్ తెలిపింది. కాగా విచారణ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) అధ్యక్షుడు ఆర్.వి.అశోకన్ బెంచ్కు బేషరతుగా క్షమాపణలు చెప్పారు. ఇటీవల పిటిఐకి ఇంటర్వ్యూ ఇచ్చిన సందర్భంగా అశోకన్, సుప్రీంకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. ఈ తరుణంలో అశోకన్ క్షమాపణ చెబుతూ ఇచ్చే అఫిడవిట్ను ఆమోదించలేమని బెంచ్, ఐఎంఎల్ తరపు న్యాయవాదికి తెలిపింది. అశోకన్ తీవ్రమైన, ఆమోదయోగ్యం కాని ప్రకటనలు చేశారని బెంచ్ వ్యాఖ్యానించింది.

## ఎన్నికల కమిషన్‌ను కలిసిన వైసీపీ నేతలు..
# హింసాత్మక ఘటనలపై ఫిర్యాదు



ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు మండిపడుతున్నారు.. ఇక, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాను కలిసిన వైసీపీ నేతలు.. పోలింగ్ తర్వాత జరుగుతున్న హింసాత్మక ఘటనలపై ఫిర్యాదు చేశారు.. ఏపీ సీఈవోను కలిసిన వైసీపీ నేతల బృందంలో అంబటి రాంబాబు, జోగి రమేష్, మేరుగ నాగార్జున, పేర్ని నాని, అప్పిరెడ్డి తదితరులున్నారు.. ఈ సందర్భంగా మేరుగ నాగార్జున మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ కళ్లు లేని కబోదిలా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది.. కేంద్ర పోలీసు పరిశీలకులు బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి నియమించినవ వ్యక్తి అని ఆరోపించారు.. పోలీస్ వ్యవస్థ తెలుగుదేశం పార్టీకి వత్తాసు పలుకుతుంది.. చంద్రబాబు చేతిలో కీలు బొమ్మలా ఎన్నికల కమిషన్, పోలీస్ వ్యవస్థ నడుస్తుందని విమర్శించారు. రాజ్యాంగ వ్యవస్థను నాశనం చేస్తున్నారు.. అల్లర్లు జరగకుండా చూడాలని ఈసీని కోరామని వెల్లడించారు మంత్రి మేరుగ నాగార్జున.

# చైనాను సందర్శించనున్న పుతిన్



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ వారం చివర్లో చైనాకు వెళ్లి చైనా అధ్యక్షుడు జి జిన్పింగ్ను కలవనున్నట్టు క్రెమ్లిన్ ప్రకటించింది. రష్యా అధినేతకు తన కొత్త అధ్యక్ష పదవీ కాలంలో ఇదే మొదటి విదేశీ పర్యటన. చైనా అధినేత ఆహ్వానం మేరకు పుతిన్ చైనా పర్యటన మే 16, 17 తేదీలలో షెడ్యూల్ చేయబడిందని మంగళవారంనాడు ఒక ప్రకటనలో క్రెమ్లిన్ పేర్కొంది. శిఖరాగ్ర సమావేశంలో, ఇరువురు నాయకులు 'సమగ్ర భాగస్వామ్యం, వ్యూహాత్మక అంశాలను సవివరంగా చర్చిస్తారు. ఈ చర్చలు రష్యన్-చైనీస్ సంబంధాల మరింత అభివద్ధికి కీలక దిశలను నిర్ణయిస్తాయి. పుతిన్, జిన్పింగ్ అత్యంత ముఖ్యమైన అంతర్జాతీయ, ప్రాంతీయ సమస్యల గురించి కూడా చర్చిస్తారని క్రెమ్లిన్ తెలిపింది. నాయకులు ఉమ్మడి ప్రకటన చేస్తారని, అనేక ద్వైపాక్షిక పత్రాలపై సంతకం చేస్తారని భావిస్తున్నారు. రష్యా నాయకుడు పుతిన్ చైనా ప్రీమియర్ లీ కియాంగ్తో కూడా చర్చలు జరుపుతాడు. ఈ సమావేశంలో ద్వైపాక్షిక వాణిజ్యం, ఆర్థిక, మానవతా సహకారంపై ప్రధానంగా చర్చించనున్నారు. అంతే కాకుండా పుతిన్, జిన్ పింగ్ మాస్కో, బీజింగ్ మధ్య దౌత్య సంబంధాల స్థాపన యొక్క 75వ వార్షికోత్సవం, అలాగే రష్యన్-చైనీస్ ఇయర్స్ ఆఫ్ కల్చర్ ప్రారంభోత్సవానికి సంబంధించిన సభలకు హాజరవుతారు. రష్యా అధ్యక్షుడు ఈశాన్య చైనాలోని హర్బిన్ నగరాన్ని కూడా సందర్శిస్తాడు. దీనిని 19వ శతాబ్దం చివరలో రష్యా నుంచి వచ్చి స్థిరపడినవారు స్థాపించారు. అక్కడ పుతిన్ మే 17 నుండి 21 వరకు జరిగే రష్యన్-చైనీస్ ఎక్స్ పో ప్రారంభ వేడుకలో పాల్గొంటాడు. పుతిన్ ఇంటర్ రీజినల్ కో ఆపరేషన్పై రష్యన్-చైనీస్ ఫోరమ్ ప్రారంభోత్సవాన్ని కూడా పర్యవేక్షిస్తాడు. ఆయన విద్యార్థులు, హర్బిన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్లతో కూడా సమావేశమవుతాడు.రష్యా, చైనా దేశాలు అనేక దశాబ్దాలుగా సన్నిహిత సంబంధాలను కొనసాగిం చాయి. 'రెండు దేశాల మధ్య స్నేహానికి పరిమితులు లేవు, సహకారానికి 'నిషిద్ధ' ప్రాంతాలు లేవు అని ఫిబ్రవరి 2022 ప్రారంభంలో ప్రకటించారు. ఈ నేపథ్యంలో, బీజింగ్ కీవ్కు వ్యతిరేకంగా మాస్కో సైనిక చర్యను ఖండించలేదు. అందువల్ల రష్యాపై పాశ్చాత్య దేశాలు విధించిన ఆంక్షలలో చైనా చేరలేదు.అదే సమయంలో అన్ని దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవిస్తూ ప్రచ్ఛన్న యుద్ధ మనస్తత్వాన్ని విడిచిపెట్టి కాల్పుల విరమణకు పిలుపునిస్తూ ఉక్రెయిన్ వివాదాన్ని పరిష్కరించడానికి చైనా ఒక ప్రణాళికను సిద్ధం చేసింది. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ఈ చొరవను ప్రశంసించాడు. ఇది ఈ రకమైన అత్యంత స్పష్టమైన, వివరణాత్మక ప్రణాళిక అని లవ్రోవ్ పేర్కొన్నాడు.

# ఇజ్రాయిల్కు పూర్తి విజయం



గాజాలో హమాస్పై ఇజ్రాయిల్ నిర్ణయాత్మకంగా విజయం సాధించగలదని అమెరికా విశ్వసించడం లేదని విదేశాంగ శాఖ డిప్యూటీ సెక్రెటరీ కర్ట్ కాంప్బెల్ అన్నాడు. ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్, పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ మధ్య పోరు గత వారం ఎనిమిదో నెలలోకి ప్రవేశించింది. పశ్చిమ జెరూసలేం హమాస్ను నాశనం చేస్తానని చేసిన ప్రతిజ్ఞ నుండి వైదొలగడానికి నిరాకరించింది. ' కొన్నిసార్లు మేము ఇజ్రాయిల్ నాయకులను నిశితంగా పరిశీలించినప్పుడు, వారు యుద్ధభూమిలో ఏదో ఒక విధమైన సంపూర్ణ విజయాన్ని సాధించాలనే ఆలోచన గురించి ఎక్కువగా మాట్లాడతారు' అని సోమవారం ఫ్లోరిడాలోని మయామిలో జరిగిన నాటో యూత్ సమ్మిట్లో కాంప్బెల్ అన్నారు. 'అది సాధ్యమని మేము నమ్మటం లేదు' అని అతను చెప్పాడు. ఇజ్రాయిల్ సైన్యం యొక్క తరలింపు సూచనల ప్రకారం పాలస్తీనియన్ ఎన్క్లేవ్ యొక్క ఉత్తర భాగం నుండి పారిపోయిన శరణార్థులతో రద్దీగా ఉండే గాజాలోని దక్షిణ నగరమైన రఫాపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దాడిపై వాషింగ్టన్, పశ్చిమ జెరూసలేం మధ్య తీవ్రమైన తేడాలు ఉన్నాయని అతను అంగీకరించాడు. ఈ ఆపరేషన్లో పౌర మరణాలు, ఎక్కువ మంది శరణార్థుల పెరుగుదలకు దారి తీస్తుందని అధ్యక్షుడు జో బైడెన్ విశ్వసిస్తున్నారని కాంప్బెల్ నొక్కిచెప్పాడు. కాంప్బెల్ మాటలు అతని బాస్, సెక్రెటరీ ఆఫ్ స్టేట్ ఆంటోనీ బ్లింకెన్ గతంలో చేసిన ప్రకటనలను ప్రతిధ్వనించాయి. ఇజ్రాయిల్ గాజాలో హమాస్ను పూర్తిగా నిర్మూలించ జాలదని, పాలస్తీనా ఎన్క్లేవ్ను పూర్తిగా ఆక్రమించడంలో ఇజ్రాయిల్ విజయం సాధించినప్పటికీ, ఐడీఎఫ్ విడిచిపెట్టిన తర్వాత మిలిటెంట్లు దానిని తిరిగి స్వాధీనం చేసుకుంటారని ఆయన అన్నాడు. ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు, అతని యుద్ధ క్యాబినెట్ ఇప్పటివరకు తక్షణ కాల్పుల విరమణ కోసం చేసిన అభ్యర్థనలను పట్టించుకోలేదు. యూదు రాజ్యం మంచి కోసం హమాస్ నుండి ముప్పును తటస్థం చేయాలని పట్టుబట్టారు. 'మేము మా లక్ష్యాలను సాధిస్తాము - మేము హమాస్ను ధకొరెటాము, మేము హిజ్బుల్లాను ధకొరెటాము, మేము భద్రతను సాధిస్తాము' అని రక్షణ మంత్రి యోవ్ గల్లంట్ గురువారం నాడు చెప్పాడు. ఇజ్రాయిలీ సైన్యం రాఫాపై దాడులను కొనసాగిస్తే అది వేలాది పౌరుల మరణాలకు దారితీస్తుంది. ఇప్పటికే గాజాపై ఇజ్రాయిల్ సైన్యం చేసిన దాడులలో 35 వేలమందికి పైగా పాలస్తీనా వాసులు మరణించారు.

# జట్టుగా ఇండియా బ్లాక్

### ఎస్పీ-కాంగ్రెస్ కూటమి ఐక్యతారాగం- అమేథీ.. రారుబరేలీలో విజయం కోసం కృషి



లక్నో : రాజకీయాల్లో అనూహ్య మార్పు కనిపిస్తోంది. యూపీలో ఎస్పీ-కాంగ్రెస్ కూటమి ఐక్యతారాగాన్ని ఆలపిస్తోంది. సీట్ల సర్దుబాట్ల తర్వాత యూపీలో అఖిలేశ్, రాహుల్ హవా నడుస్తోంది. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్పీ-కాంగ్రెస్ కూటమి విఫలమైన విషయాన్ని రెండు పార్టీలు గుర్తించాయి. ఇపుడు కలిసి పోటీకి దిగటంతో..ఆ రెండు పార్టీల్లోనూ విజయం సాధించగలమన్న ధీమా కనిపిస్తోంది. అమేథీ, రారుబరేలీ స్థానాలను కైవసం చేసుకునే దిశగా ఇరు పార్టీల కార్యకర్తలు మైదానంలో ఒక జట్టుగా పని చేస్తున్నట్టు సంకేతాలిస్తున్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా అమేథీ , రారుబరేలీలలో బ్యాక్-టు-బ్యాక్ కార్నర్ సమావేశాలు, ర్యాలీలతో దూసుకెళ్తున్నారు. ఆమె బహిరంగ కార్యక్ర మాలలో సమాజ్వాదీ పార్టీకి చెందిన రెడ్ క్యాప్ క్యాడర్లో జోష్ కనిపిస్తోంది. 2017 పొత్తుల హడావుడి అట్టడుగు స్థాయికి చేరుకోలేక పోయిందని, పొత్తు కాగితాలపైనే మిగిలిపోయిందని పలువురు నేతలు ఆరోపిస్తున్నారు. కానీ ఈసారి మాత్రం అందుకు భిన్నంగా ఉందని ఇక్కడి ఎస్పీ, కాంగ్రెస్ కార్యకర్తలు అంటున్నారు. మా అధినేత అఖిలేశ్ యాదవ్ పొత్తును ప్రకటించిన వెంటనే కాంగ్రెస్కు ఇచ్చిన 17 స్థానాల్లోని ఆఫీస్ బేరర్లు, ముఖ్య నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి.. 'మీ పార్టీలా ఎన్నికల్లో పోరాడండి' అని చెప్పారని బరేలీ జిల్లా చీఫ్ వీరేంద్ర యాదవ్ తెలిపారు. ఎస్పీ కార్యకర్తలందరూ ఆయన ఆదేశాలను పాటిస్తున్నారు అని వివరించారు. గతంలో అమేథీ, రారుబరేలీలలో జరిగిన లోక్సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు అనుకూలంగా మౌఖిక అవగాహన కుదిరిందని, అయితే ఈసారి 'ప్రకటిత కూటమి'తో భారత్ బ్లాక్ అభ్యర్థులను నిలబెట్టేందుకు కార్యకర్తలు మరింత ఉత్సాహంగా, కట్టుబడి ఉన్నారని వీరేంద్ర యాదవ్ పేర్కొన్నారు. రారుబరేలీలో రాహుల్ గాంధీ, అమేథీలో కిషోరీ లాల్ శర్మను విజయం వైపు నడిపించటానికి సర్వశక్తులు ఒడ్డినట్టు చెప్పారు. బీజేపీ పట్ల ప్రజలు విసిగిపోయారని, రారుబరేలీలో రాహుల్ గాంధీ రికార్డు మెజార్టీతో గెలుస్తారని, అమేథీలో శర్మ మంచి మెజార్టీతో గెలుస్తారని ఎస్పీ, కాంగ్రెస్ కార్యకర్తలు నమ్మకంగా ఉన్నారని ఎస్పీ జిల్లా అధ్యక్షుడు అన్నారు. ఇక్కడి ఎస్పీ కార్యకర్తలు కూడా కాంగ్రెస్ పార్టీ వాగ్దానాలు, హామీ కార్డులను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని తెలిపారు. రెండు నియోజకవర్గాల్లో మీడియా ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు అన్షు అవస్తీ మాట్లాడుతూ రారుబరేలీ, అమేథీలలో ఎస్పీ కార్యకర్తలు గాంధీ కుటుంబంతో సన్నిహితంగా, కుటుంబ పరంగా, చాలా భావోద్వేగ అనుబంధాన్ని కలిగి ఉన్నందున వారికి ఉత్సాహంగా మద్దతు ఇవ్వడం వెనుక కారణం స్పష్టంగా ఉందని అన్నారు. రారుబరేలీలో ఎస్పీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామ్ నరేష్ యాదవ్ మాట్లాడుతూ ఎస్పీ కార్యకర్తలు కాంగ్రెస్ కార్యకర్తల మాదిరిగానే ఉత్సాహంగా ఉన్నారని, రారుబరేలీ, అమేథీలలో భారత కూటమి అభ్యర్థులు భారీ విజయం సాధించేలా కృషి చేస్తున్నారని అన్నారు. రారుబరేలీ నియోజకవర్గం ఐదు అసెంబ్లీ సెగ్మెంట్ లను కలిగి ఉంది. బచ్రావాన్ హర్చంద్పూర్, రారు బరేలీ, ఉంచాహర్ , సరేని. అమేథీ పార్లమెంటరీ నియోజకవర్గం తిలోయి, సలోన్, జగదీష్పూర్, గౌరీగంజ్ , అమేథీ అసెంబ్లీ సెగ్మెంట్లను కలిగి ఉంది. 10 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆరుగురికి ఎస్పీ ఎమ్మెల్యేలు ఉండగా, వారిలో ఇద్దరు బీజేపీకి మద్దతు పలికారు. సాంప్రదాయకంగా ఎస్పీ ఎప్పుడూ పార్లమెంటరీ ఎన్నికలలో కాంగ్రెస్కు నిశ్శబ్దంగా మద్దతునిస్తుంది, గాంధీ కుటుంబానికి అండగా నిలుస్తోందని ఎస్పీ శ్రేణులు అంటున్నాయి. అయితే ఈసారి రెండు పార్టీల మధ్య ప్రకటిత పొత్తు ఉండడంతో రెండు పార్టీల కార్యకర్తల మధ్య సమన్వయం కనిపిస్తోంది. ఏదైనా ర్యాలీ లేదా కార్నర్ మీటింగ్లో రెండు పార్టీల కార్యకర్తలు మమేకమవుతున్నారు. గౌరీగంజ్ లోని కాంగ్రెస్ కార్యాలయం ప్రధాన గేటుపై రెండు పార్టీల జెండాలు ఉన్నాయి. ఆ కార్యాలయంలో ఎక్కడ చూసినా రెండు పార్టీల జెండాలే దర్శనమిస్తున్నాయి. ప్రియాంక గాంధీ లేదా కిషోరీ లాల్ శర్మ లేదా ఇతర కాంగ్రెస్ నాయకులు ప్రసంగించే ఏదైనా కాంగ్రెస్ బహిరంగ సభకు గణనీయమైన సంఖ్యలో ఎస్పీ కార్య కర్తలు హాజరవుతారు. ఇది కేవలం పార్టీ ఆఫీస్ బేరర్లు, కార్యకర్తలకే పరిమితం కాలేదని తెలుస్తోంది. మద్దతు దారులు కూడా పొత్తుపై ఉత్సాహంగా ఉన్నారు. అమేథీలోని షాఫుర్ గ్రామానికి చెందిన కమలేష్ యాదవ్ మాట్లాడుతూ తాను అఖిలేశ్ యాదవ్కు గట్టి మద్దతుదా రునని, కాంగ్రెస్తో పొత్తు పెట్టుకున్నందున తన ఓటు, మద్దతు కాంగ్రెస్కేనని అన్నారు. యాద వులందరూ ఈసారి ఏకమయ్యారు. పోయినసారి కొందరు బీజేపీకి ఓటేసి ఉండవచ్చు కానీ ఈసారి అఖిలేశ్ జీ మమ్మల్ని ఓటు వేయమని కోరిన చోటే ఓటు వేస్తామని ఆయన చెప్పారు. మద్దతు దారులు కూడా పొత్తుపై ఉత్సాహంగా ఉన్నారు. ఈ రెండు పార్లమెంట్ స్థానాల్లో బ్రాహ్మణ, యాదవుల జనాభా గణనీయంగా ఉంది. రారుబరేలీలో బీజేపీ అభ్యర్థి దినేష్ ప్రతాప్ సింగ్పై రాహుల్ గాంధీ పోటీ చేస్తుండగా, గాంధీ కుటుంబ సన్నిహితుడు లాల్ శర్మ అమేథీలో బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీపై పోటీ చేస్తున్నారు. ఈ రెండు నియోజకవర్గాలకు మే 20న ఐదో దశ పోలింగ్ జరగనుంది.

# నేతల ప్రసంగాలు ఆదర్శంగా ఉండాలి

### 90 శాతం ఫిర్యాదులు పరిష్కరించాం : కేంద్ర ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ :ప్రస్తుతం జరుగుతున్న లోక్సభ ఎన్నికల్లో రాజకీయ పార్టీల అగ్రనేతలు తమ ప్రచారంలో చేసే ప్రసంగాలు ఆదర్శంగా ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. దేశంలోని సామాజిక నిర్మాణం చెదిరిపోకుండా ఉండేందుకు మిగిలిన దశల్లో నేతల పోల్ ప్రసంగాలను సరిదిద్దుకోవడం ప్రధానంగా నాయకుల బాధ్యతని నొక్కి చెప్పింది. మార్చి 16న లోక్సభ ఎన్నికల ప్రకటన తరువాత మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమలుపై తన రెండో నివేదికను విడుదల చేసిన ఎన్నిక సంఘం, 90 శాతానికి పైగా ఫిర్యాదులను పరిష్కరించామని, పార్టీల నుండి వచ్చిన పెద్ద ఫిర్యాదులు పెండింగ్లో లేవని తెలిపింది. కాంగ్రెస్, బీజేపీల నుండి వచ్చిన కొన్ని ఫిర్యాదులు తప్ప అన్ని పరిష్కరించామని పేర్కొంది. 'మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమల్లోకి వచ్చినప్పటి నుండి దాదాపు రెండు నెలలు పూర్తయినందున, నియోజకవర్గ స్థాయిలో వివిధ రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రచారం హింసకు తావులేకుండా జరిగింది' అని ఎన్నికల కమిషన్ పేర్కొంది.




## ఎన్నికల కోడ్ను బీజేపీ ఉల్లంఘించడాన్ని ఆపండి: టీఎంసీ


బీజేపీ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో సహా ఎన్నికల కోడ్ను 'నిస్సందేహంగా ఉల్లంఘించడాన్ని' ఆపాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని టీఎంసి కోరింది. అదే సమయంలో మోడల్ ప్రవర్తనా నియమావళిని (ఎంసీసీ) 'మోడీ కోడ్గా మార్చారని' ఆరోపించింది. ఈ మేరకు మంగళవారం ఎన్నికల సంఘానికి టీఎంసీ రాజ్యసభ ఎంపీలు సాకేత్ గోఖలే, సాగరిక ఘోష్ ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. మోడల్ ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ప్రధాని మోడీకి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడంలో ఈసీ మెతక వైఖరి పట్ల నిరాశను వ్యక్తం చేశారు. '(బీజేపీ చీఫ్) జేపీ నడ్డాకు నోటీసు ఇచ్చారు. కానీ ఫిర్యాదులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు' అని అన్నారు. ఎంసీసీ పట్ల ఎన్నికల సంఘం నిర్లక్ష్యంగా ఉందని విమ ర్శించారు. ఎన్నికల నియమావళిని ఉల్లం ఘించినందుకు ప్రధాని మోడీని బాధ్యుడిని చేయడం లేదని పేర్కొన్నారు. ఎన్నికల మిగిలిన దశల్లో మోడల్ ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయా లని, ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని, ప్రధాని మోడీ ఉల్లంఘించిన ప్రతిసారీ క్లీన్ చిట్ ఇవ్వవద్దని డిమాండ్ చేశారు.

## విద్యుత్ ఉద్యోగులపై అభాండాలు మోపుతున్నారు.. కరెంటు కోతలను సరిదిద్దాలనే చిత్తశుద్ధి లేదా



తెలంగాణ విద్యుత్ ఉద్యోగులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదంటూ ఎక్స్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ట్వీట్ చేశారు. "కరెంట్ కోతల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి తన ప్రభుత్వ వైఫల్యాలను అంగీకరించకుండా ప్రతి పక్షాలు, విద్యుత్ ఉద్యోగుల మీద అభాండాలు మోపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. విద్యుత్ రంగ వైఫల్యాలకు నేనే భాద్యుడిని అన్నట్టుగా మాట్లాడటం విడ్డూరంగా ఉంది" అని అన్నారు. "ఆయన వైఖరి ఆడ రాక పాత గజ్జెలు అనే సామెతను గుర్తు చేస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం, 24 గంటల పాటు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేసేందుకు.. విద్యుత్ ఉద్యోగుల సహకారంతో పటిష్ఠమైన వ్యవస్థను నిర్మించింది. రెప్పపాటు కాలం కూడా కరెంట్ కోతలు లేని ఏకైక రాష్ట్రంగా తెలంగాణను నిలిపింది. కేవలం 5 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ వ్యవస్థను కుప్ప కూల్చింది. గృహ, వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలకు సరిపోయే విద్యుత్ సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమైంది" అని హరీశ్ రావు అన్నారు. "తమ చేతగాని తనాన్ని కప్పిపుచ్చుకునేందుకు, ప్రతిపక్షాలు, విద్యుత్ ఉద్యోగులపై రేవంత్ రెడ్డి నిరాధార ఆరోపణ చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో, తెలంగాణ పునర్ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన విద్యుత్ ఉద్యోగులను చీటికి మాటికి నిందించడం, చర్యలు తీసుకోవడం వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడమే. విద్యుత్ ఉద్యోగుల పై నెపం నెట్టడమే తప్ప కరెంటు కోతలను ఎలా సరిదిద్దాలనే చిత్తశుద్ధి ముఖ్యమంత్రికి లేకపోవడం దురదృష్టకరం.సీఎం ఇలాంటి చిల్లర మల్లర చేష్టలు మాని కేసీఆర్ హయాంలో రెప్ప పాటు కూడా పోని విధంగా 24 గంటల విద్యుత్ ను ఇచ్చినట్టుగాఅన్ని రంగాలకుసరఫరా చేస్తే మంచిది.తన లాగేఅందరూకుట్రలు కుతంత్రాలకు పాల్పడుతారని సీఎం భ్రమల్లో ఉన్నట్టున్నారు. వాటిని వీడి పాలన పై దృష్టి పెడితే మంచిది" అని హరీశ్ రావు చెప్పారు.

## హిందూ - ముస్లింలను విడదీసే రాజకీయం చేయను



ఒక వేళ తాను హిందూ - ముస్లిం రాజకీయాలు చేస్తే ప్రజా జీవితంలో ప్రధానిగా పనికిరానని మంగళవారం నాడు మోదీ అన్నారు. తాను హిందూ - ముస్లింలను విడదీసే రాజకీయం చేయబోనని న్యూస్ 18తో మాట్లాడుతూ చెప్పారు. ముస్లింలు ఎక్కువ మంది కంటారని తాను అనలేదని చెప్పారు. ఎక్కువ మంది పిల్లలున్న కుటుంబాలు పేదరికంలో ఉన్నాయని మాత్రమే అన్నానని స్పష్టం చేశారు. హిందువుల్లోనూ పేదలు ఉంటాటరని, తన వ్యాఖ్యలను ముస్లింలకు మాత్రమే ఆపాదిస్తూ తప్పుడు ప్రచారం చేశారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేయడానికి వారణాసి పర్యటన సందర్భంగా న్యూస్ 18కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో.. హిందూ-ముస్లింలను వేరు చేయకూడదనేది తన సంకల్పమని ప్రధాని మోదీ అన్నారు. లోక్‌సభ ఎన్నికలకు వారణాసి నుంచి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థిగా ప్రధాని మోదీ నామినేషన్ దాఖలు చేశారు. జూన్ 1న వారణాసిలో ఆరో దశ పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల్లో ముస్లింలు తనకు ఓటు వేస్తారా అని అడిగిన ప్రశ్నకు ప్రధాని.. "దేశ ప్రజలు నాకు ఓటేస్తారని నేను నమ్ముతున్నాను. నేను హిందూ-ముస్లింలను వేరు చేయడం ప్రారంభించిన రోజు, నేను ప్రజా జీవితంలో జీవించడానికి సరిపోను. నేను హిందూ-ముస్లిం విభజన చేయను, ఇదే నా సంకల్పం" అని అన్నారు. 'నా మంత్రం 'సబ్కా సాథ్ సబ్కా వికాస్'. నేను ఓటు బ్యాంకు కోసం పని చేయను. ఏదైనా తప్పు జరిగితే, నేను తప్పు అని చెబుతాను, 'అని ప్రధాని అన్నారు.

## అత్యధిక పోలింగ్ నమోదైన నియోకవర్గం ఇదే..

### దేశంలోనే ఏపీ టాప్




ఈ సార్వత్రిక ఎన్నికలలో ఇప్పటి వరకు జరిగిన 4 దశల పోలింగ్‌లో అత్యధిక ఓటింగ్ ఆంధ్రప్రదేశ్‌లో నమోదు అయ్యిందని సీఈవో ముకేశ్ కుమార్ మీనా తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 81.86 శాతం ఓట్లు పోల్ అయినట్లు ఆయన వెల్లడించారు. ఈవీఎంల ద్వారా 80.66 శాతం, మిగతా ఓట్లు బ్యాలెట్ పేపర్ల ద్వారా పడినట్టు తెలిపారు. 2014లో 78.41 శాతం, 2019లో 79.77 శాతం పోలింగ్ నమోదైందన్నారు. అసెంబ్లీకి మొత్తం 3,33,50,332 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దర్శి నియోజకవర్గంలో అత్యధికంగా 90.91 శాతం పోలింగ్ నమోద అయినట్లు ముకేశ్ కుమార్ తెలిపారు. తిరుపతి నియోజకవర్గంలో అత్యల్పంగా 63.32 శాతం పోలింగ్ నమోదైందన్నారు. 3500 కేంద్రాల్లో అర్ధరాత్రి వరకు పోలింగ్ జరిగిందని, కొన్నిచోట్ల అర్ధరాత్రి 2 గంటల వరకు కొనసాగిందని తెలిపారు. పార్లమెంట్‌కి 3,33,40,560 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. ఒంగోలులో అత్యధిక ఓటింగ్ 87.06 శాతం నమోదైంది. అత్యల్పంగా వైజాగ్‌లో 71.11 శాతం నమోదైంది. నాలుగు దశల్లో జరిగిన ఎన్నికల్లో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇదే అత్యధిక ఓటింగ్ శాతం: ఏపీ సీఈవో ముఖేష్ కుమార్ మీనా. ఎన్నికల వేళ పోలింగ్ సెంటర్ల దగ్గర అల్లర్లు చేసిన వారికి తప్పకుండా శిక్ష పడుతుందని ఏపీ సీఈవో స్పష్టం చేశారు. సీసీ కెమెరాల్లో అంతా రికార్డ్ అయ్యిందని, దాడులు చేసిన వారిని గుర్తించి అరెస్ట్ చేశామని తెలిపారు. తాడిపత్రి, నరసరావుపేటలో ఘర్షణ వాతావరణం నెలకొందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 715 పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశామని చెప్పారు. నాలుగు చోట్ల 144 సెక్షన్ విధించామన్నారు.

## సిఏఏ చట్టం ప్రకారం తొలి విడతలో 14 మందికి భారత పౌరసత్వం




లోక్‌సభ ఎన్నికల వేళ పౌరసత్వ సవరణ చట్టం-2019 అమలు ప్రక్రియను వేగవంతం చేసింది కేంద్ర ప్రభుత్వం. ఇందులో భాగంగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్నవారికి తొలి విడతలో 14 మందికి భారత పౌరసత్వం మంజూరు చేసినట్లు కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్‌కుమార్ భల్లా తెలిపారు. ఢిల్లీలో వారికి సీఏఏ కింద జారీ అయిన పౌరసత్వ సర్టిఫికెట్లను అందజేశారు. కేంద్ర ప్రభుత్వం వివాదస్పదమైన 'పౌరసత్వ సవరణ చట్టం-2019' అమలుపై ఈ ఏడాది మార్చిలో కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. 2019 డిసెంబర్‌లో ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య సీఏఏ చట్టం-2019 పార్లమెంటు ఉభయసభల్లో ఆమోదం పొందగా.. దీనికి రాష్ట్రపతి సమ్మతి కూడా లభించింది. సీఏఏ చట్టం ప్రకారం.. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌ల నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థుల వద్ద తగిన పత్రాలు లేకపోయినా వారికి సత్వరమే భారత పౌరసత్వాన్ని ఇచ్చేలా కేంద్రం నిబంధనల్ని రూపొందించింది. కాగా, ఈ చట్టం 2014 డిసెంబరు 31 కంటే ముందు అఫ్ఘనిస్తాన్ ,పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి మన దేశానికి వచ్చిన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, పార్సీలకు ఇవి వర్తిస్తాయని ప్రకటించిన సంగతి తెలిసిందే.దరఖాస్తు ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే ముగుస్తుంది.

# మోడీ మళ్లీ ప్రధానైతే దేశంలో ఎన్నికలే జరగవు

మహారాజ్గంజ్ (యూపీ): ప్రధాని మోడీని 'ఝూథోన్ కా సర్దార్' (అబద్ధాల రాజు) అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అభివర్ణించారు. ఆయన మళ్లీ ప్రధాని అయితే దేశంలో ఇక ఎన్నికలు జరగవని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వీరేంద్ర చౌదరికి మద్దతుగా ఇక్కడ జరిగిన ర్యాలీని ఉద్దేశించి ఖర్గే మాట్లాడారు. ప్రధాని మోడీ అనేక హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. సమాజ్వాదీ పార్టీ (ఎస్పీ) జాతీయ ప్రధాన కార్యదర్శి శివపాల్ యాదవ్తో సహా పలువురు ఇండియా బ్లాక్ నాయకుల సమక్షంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్లాడుతూ, 'ప్రధాని అబద్ధాలు చెబుతున్నారు. మోడీ అబద్ధాలకోరు, దగాకోరుల ('ఝూథోన్ కా సర్దార్').' 'ఈ వ్యక్తి (మోడీ) మళ్లీ (ప్రధానిగా) వస్తే, ఎన్నికలు ఉండవు. దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు లేదా మహిళా అభ్యర్థులు ఉండరు.' అని స్పష్టం చేశారు. ఎన్నికలను సైద్ధాంతిక పోరుగా పేర్కొన్న ఖర్గే, 'మేం మోడీ లేదా యోగి కావచ్చు ఏ వ్యక్తిపైనా పోరాడటం లేదు, ఇది వ్యక్తిగత పోరాటం కాదు' అని అన్నారు. 70 ఏండ్లలో మేం ఏం చేశామని అడుగుతున్నారు. మేం ఏమీ చేయకపోతే మీరు ప్రజాస్వామ్యానికి ప్రధాని కాలేరు. మేం (కాంగ్రెస్) రాజ్యాంగాన్ని రూపొందించి ప్రజాస్వామ్యాన్ని కాపాడినందున మీరు ప్రధాని అయ్యారు. 'మీరు ఆ ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలని, రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది జరగదు. దేశంలోని దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, రైతులు , మేధావులు రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయనివ్వరు' అని ఆయన అన్నారు. మహారాజ్గంజ్ ఎంపీగా ఉన్న కేంద్ర ఆర్థిక మంత్రి పంకజ్ చౌదరిని ఉద్దేశించి ఖర్గే, 'మీరు ప్రతినిధిగా ఎన్నికై ఏమైనా అభివృద్ధి చేశారా' అని ప్రశ్నించారు. ఈ జిల్లాకు నేపాల్తో సరిహద్దు ఉంది. రాజకీయంగా ప్రాధాన్యత ఉంది, ఇప్పటికీ జిల్లా కేంద్రాన్ని రైల్వే లైన్తో అనుసంధానం చేయలేదు. మోడీ హయాంలో ఇక్కడ నుంచి అనేక చక్కెర మిల్లులు అదృశ్యమయ్యాయి, ముఖ్యమంత్రి ఎందుకు మౌనంగా కూర్చున్నారు? అని యోగిని నిలదీశారు. 'వారు డబుల్ ఇంజిన్ల గురించి మాట్లాడతారు, వాటిలో ఒకటి విఫలమైంది . మరొకటి పట్టాలు తప్పింది' అని అతను ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మాజీ ప్రధానులు జవహర్లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ చేసిన పనితో పోలిస్తే ఈ డబుల్



ఇంజిన్లు ఏమీ చేయలేవని ఆయన అన్నారు. ఆనకట్టలు, వంతెనలు, పెద్ద ప్రాజెక్టులను పూర్తి చేసిన కాంగ్రెస్ను దుర్వినియోగం చేయడమే వారి (బీజేపీ) పని అని ఆయన అన్నారు. బుల్లెట్ రైలు ప్రాజెక్టుపై బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మండిపడ్డారు. 'జపాన్ నుంచి రూ.లక్ష కోట్ల రుణం తీసుకున్నారు. అవి ఎక్కడ ఖర్చు చేశారు? బుల్లెట్ రైలు ఎక్కడ ఉంది?' కాంగ్రెస్ చేసిన పనుల క్రెడిట్ బీజేపీకే దక్కుతుందని ఖర్గే అన్నారు. మీరు ఆర్ఎస్ఎస్ వ్యక్తులకు వేలు ఇస్తే, వారు మొత్తం వ్యక్తిని మింగేస్తారు. కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేయడం ద్వారా బీజేపీ ప్రభుత్వాలను విచ్ఛిన్నం చేస్తోందని విమర్శించారు. 'కళంకిత' నాయకులను తమ పార్టీలో చేరమని బలవంతం చేయడానికి ఈడీ, సీబీఐని ఉపయోగించుకుంటోం దని ఆరోపించారు. 'షా , మోడీ దగ్గర చాలా పెద్ద లాండ్రీ ఉంది, అది బట్టలు ఉతకదు, బదులుగా, వారు ఆ వాషింగ్ మెషీన్లో ఒక కళంకమైన నేతల్ని వేసి.. స్వచ్ఛంగా బయటకు పంపటమే పని అని ఖర్గే వివరించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ బీజేపీ పాలన సాగిస్తున్నదని ఆయన అన్నారు.


# తెలంగాణలో మూడ్ ఎలా ఉంది.. ఏ పార్టీకి ఎన్ని సీట్లు

లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు దక్కించుకోవడానికి తెలంగాణలో అధికార కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతోపాటు విపక్ష పార్టీ తీవ్రంగా శ్రమించాయి. తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలకు, ఆంధ్రప్రదేశ్‌లో 25 లోక్‌సభ సీట్లతోపాటు 175 అసెంబ్లీ సీట్లకు సోమవారం పోలింగ్ జరిగింది. దాదాపు 5 కోట్ల మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. అభ్యర్థుల భవితవ్యం ఇప్పుడు ఈవీఎంలలో నిక్షిప్తమైంది. జూన్ 4న జడ్జిమెంట్ వెలువడనుంది. ఈ క్రమంలో ఓటర్ల మూడు ఎలా ఉంది అన్న చర్చ తెలంగాణలో జరుగుతోంది. పార్టీలతోపాటు విశ్లేషకులు కూడా ఓ అంచనాకు వస్తున్నారు. ఇక లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు దక్కించుకోవడానికి తెలంగాణలో అధికార కాంగ్రెస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతోపాటు విపక్ష పార్టీ బీఆర్ఎస తీవ్రంగా శ్రమించాయి. కాంగ్రెస్ తరఫున సీఎం రేవంత్‌రెడ్డి అన్నీతానై నడిపించారు. పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, మల్లికార్జునఖర్గేలను కూడా రాష్ట్రానికి తీసుకువచ్చి ప్రచారం చేయించారు. ఇక బీజేపీ అయితే ప్రచారంలో దూకుడు ప్రదర్శించింది. షెడ్యూల్‌కు ముందు నుంచే ప్రధాని మోదీతోపాటు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, బీజేపీ జాతీయ అధ్యక్షుడు, పొరుగు రాష్ట్రాల ఎంపీలను రంగంలోకి దించింది. మిగతా పార్టీలకు అందనంతగా ప్రచారంలో దూకుడు ప్రదర్శించింది. ప్రధాని మోదీ ఏకంగా నాలుగుసార్లు తెలంగాణలో ప్రచారం నిర్వహించారు. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో తీవ్ర నైరాశ్యంలో ఉన్న ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు ఊపు తెచ్చేందుకు మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగారు బస్సు యాత్రతో పది నియోజకవర్గాలను చుట్టేశారు. మరోవైపు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు కూడా అభ్యర్థుల తరఫున ప్రచారంలో పాల్గొన్నారు. ఇక సోమవారం నిర్వహించిన తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో 64.93 శాతం పోలింగ్ నమోదైంది. పది స్థానాల్లో 70 శాతానికిపైగా పోలింగ్ నమోదవడం విశేషం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల నియోజకవర్గాలు మినహా రాష్ట్రంలోని మిగతా 13 స్థానాల్లో 60




శాతం నుంచి 70 శాతం వరకు ఓటింగ్ నమోదైంది. పెరిగిన ఓటింగ్ ఎవరికి లాభిస్తుందన్న చర్చ జరుగుతోంది. పార్టీలు ఎవరికి వారు అనుకూలంగా లెక్కలు వేసుకుంటున్నాయి. ఇక లోక్‌సభ నియోజకవర్గాల వారీగా నమోదైన పోలింగ్ శాతం పరిశీలిస్తే.. ఆదిలాబాద్‌లో 7.96, పెద్దపల్లిలో 67.88 శాతం, కరీంనగర్‌లో 72.33 శాతం, నిజామాబాద్‌లో 71.50 శాతం, జహీరాబాద్‌లో 74.54, మెదక్‌లో 74.38 శాతం, మల్కాజ్‌గిరిలో 50.12 శాతం, సికింద్రాబాద్‌లో 48.11 శాతం, హైదరాబాద్‌లో 46.08 శాతం, చేవెళ్లలో 55.45 శాతం, మహబూబ్‌నగర్‌లో 71.54 శాతం, నాగర్‌కర్నూల్‌లో 68.29 శాతం, మహబూబాబాద్‌లో 70.68 శాతం, వరంగల్‌లో 68.29 శాతం, ఖమ్మంలో అత్యధికంగా 75.19 శాతం పోలింగ్ నమోదైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్‌గిరిలో ఈసారి పోలింగ్‌శాతం బాగా తగ్గింది. హైదరాబాద్, సికింద్రాబాద్‌లో కూడా ఓటర్లు పెద్దగా స్పందించలేదు. ఇక కాంగ్రెస్‌కు కంచు కోటలుగా భావించిన భువనగిరి, ఖమ్మం నియోజకవర్గాల్లో ఈ ఎన్నికల్లో అత్యధిక శాతం పోలింగ్ నమోదైంది. ఈ రెండు నియోజకవర్గాల్లో పోలింగ్‌లో అగ్రస్థానంలో ఉన్నాయి. కరీంనగర్, జహీరాబాద్, ఆదిలాబాద్ లో కూడా అత్యధికంగా పోలింగ్ నమోదైంది. ఫలితాలు జూన్ 4న వెలువడనున్నాయి. ఓటర్లు ఎవరికి పట్టం కట్టారు అనేది ఆరోజు వెల్లడికానుంది.

# 9 నుంచి 13 సీట్లు పక్కా..!!



హైదరాబాద్,: రాష్ట్రంలో రైతు సంక్షేమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ కార్పొరేషన్ ద్వారా ఆదాయం చూపించి రుణం తీసుకుంటామని, దాని ద్వారానే రైతుల రుణమాఫీ అమలు చేస్తామని ప్రకటించారు. మంగళవారం తన నివాసంలో మీడియాతో ముఖ్యమంత్రి చిట్‌చాట్‌గా మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికలు రాష్ట్రంలో ముగిసినందున ఇక పరిపాలనపైనే వందశాతం దృష్టి పెడతామని, బుధవారం నుంచి సచివాలయానికి వెళతానని చెప్పారు. ముందుగా తడిసిన ధాన్యం కొనుగోలు చేయడంపై, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంపై ఫోకస్ చేస్తామన్నారు. వీటితోపాటు రైతు రుణమాఫీ అంశం, విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠ్యపుస్తకాలు, పాఠశాలల్లో సంస్కరణలు, హాస్టళ్లకు సన్నబియ్యం సరఫరా వంటి వాటిపైనా దృష్టి సారిస్తామన్నారు. పాలనలో భాగంగా ఆకస్మిక తనిఖీలు, పర్యటనలు కూడా ఉంటాయని చెప్పారు. రుణమాఫీకి సంబంధించి త్వరలోనే ఎస్ఎల్‌బీసీ సమావేశాన్ని ఏర్పాటు చేసి రైతులకు ఎంత మేరకు రుణాలు ఉన్నాయన్నది అంచనా వేస్తామన్నారు. రైతుల రుణాలను బ్యాంకుల నుంచి ప్రభుత్వం బదలాయించుకునేందుకు ఆర్‌బీఐ అంగీకరించబోదన్న మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి లోబడి రుణం తీసుకుంటే ఆర్‌బీఐ ఎందుకు అంగీకరించదని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ధరణి తదితరాలన్నింటిపైనా శాసనసభలో చర్చిస్తామని, సభలో చర్చకు పెట్టకుండా ఏదీ చేయబోమని స్పష్టం చేశారు. అఖిలపక్షాలు, స్టేక్ హోల్డర్లతోనూ చర్చిస్తామన్నారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు.. కేంద్ర బడ్జెట్ సమావేశాల తర్వాతే ఉంటాయని, కేంద్రం నుంచి వచ్చే నిధుల వెసులుబాటును చూసుకునే రాష్ట్ర బడ్జెట్ ఉంటుందని వెల్లడించారు. అందుకే రైతు రుణమాఫీకి ఆగస్టు 15 గడువు పెట్టుకున్నట్లు చెప్పారు.

### రేషన్ షాపుల ద్వారా పంటల పంపిణీ..

రైతులు పండించే వరి, ఇతర పంటలను పౌరసరఫరాల సంస్థ ద్వారా గిట్టుబాటు ధర ఇచ్చి సేకరిస్తామని, వాటిని ఉత్పత్తుల కింద మార్చి రేషన్ షాపుల ద్వారా పేదలకు పంపిణీ చేస్తామని సీఎం తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం.. రేషన్ షాపుల ద్వారా బియ్యంతోపాటు తొమ్మిది రకాల వస్తువులను సరఫరా చేసిందని గుర్తు చేశారు. రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ.. రైతులు ఆ వడ్లు పండించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. సన్న వడ్లు పండించే రైతులకు క్వింటాలుకు మద్దతు ధరపై రూ.500 బోనస్ ఇచ్చి సేకరిస్తామని చెబుతామన్నారు. అప్పుడు రైతులు కూడా సన్న వడ్లు పండించేందుకు ముందుకొస్తారని తెలిపారు. రేషన్ కార్డుల మంజూరు అనేది నిరంతర ప్రక్రియ అని సీఎం రేవంత్ అన్నారు. వీటితోపాటు అన్ని కార్యక్రమాలకు సంబంధించి గ్రామసభల్లో తీసుకున్న దరఖాస్తులను కంప్యూటరైజ్ చేసినట్లు చెప్పారు. రిటైర్ అయి కూడా వివిధ శాఖల్లో కొనసాగుతున్న అధికారులు వెయ్యి మందికి పైగా ఉన్నారని వెల్లడించారు. మంత్రివర్గ సమావేశం నిర్వహించి వారి విషయంలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కర్ణాటకలో కరువు పరిస్థితులున్నా.. వారిని ఒప్పించి రాష్ట్రంలో తాగునీటి అవసరాల కోసం రెండున్నర టీఎంసీల కృష్ణా నీటిని ఆ రాష్ట్రం నుంచి తెచ్చామని గుర్తు చేశారు. 59 జీవోను అబయన్స్‌లో పెట్టామని, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత సమీక్షిస్తామని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ సంబంధిత అంశాలను అసెంబ్లీకే చెబుతామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే వర్సిటీలకు కొత్త వీసీలను నియమిస్తామని చెప్పారు. కరెంటు విషయంలో హరీశ్‌రావు ఒక మెకానిజం ఏర్పాటు చేసి.. ఎన్నికల్లో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని చూశారని ఆరోపించారు. ఇందుకు సంబంధించి కొన్ని కేసులను గుర్తించి నమోదు చేశామన్నారు.

### పదేళ్లు రాష్ట్రంలోనే..

రానున్న పదేళ్లూ తాను తెలంగాణ రాజకీయాల్లోనే ఉంటానని సీఎం రేవంత్ అన్నారు. రానున్న వందేళ్ల అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసి ప్రజలకు అందించడం తన బాధ్యత అని పేర్కొన్నారు. ఏపీలో ఎవరు ముఖ్యమంత్రి అయినా వారితో సత్సంబంధాలు పెట్టుకుంటామని, రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించుకుంటామని స్పష్టం చేశారు. ఇక మూసీ నదిని రాష్ట్రానికి ఆదాయాన్నందించే వనరుగా మారుస్తామని, కన్సల్టెన్సీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కేసీఆర్ మాదిరిగా తాను మేధావిని కాకపోవడం వల్లనే కన్సల్టెన్సీ నివేదికలపై ఆధారపడుతున్నానని రేవంత్ ఎద్దేవా చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వల్ల మెట్రోను అమ్ముకునే పరిస్థితి వస్తుందన్న యాజమాన్యం వ్యాఖ్యలపై సీఎం స్పందిస్తూ, "వాళ్ల ఆస్తిని వాళ్లు అమ్ముకుంటానంటే ఎవరు వద్దన్నారు?" అని ప్రశ్నించారు. హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేస్తారని ఎవరైనా అంటే అంత తెలివిలేనివాడు ఇంకొకడు ఉండడన్నారు. యూటీ అనేది స్టాప్ గ్యాప్ మాత్రమేనని, అది విఫల ప్రయోగం అని కూడా అన్నారు. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు.

### ఆరేడు సీట్లలో బీఆర్ఎసకు డిపాజిట్ రాదు..

రాష్ట్రంలోని 17 లోక్‌సభ సీట్లకుగాను ఆరేడు సీట్లలో బీఆర్ఎసకు డిపాజిట్ కూడా రాదని సీఎం రేవంత్ అన్నారు. మెదక్‌లో మాత్రమే ఆ పార్టీ గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉందన్నారు. కాంగ్రెసకు 13 సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీని తమకు ప్రత్యర్థిగా బీఆర్ఎస్ బలవంతంగా సృష్టించిందని ఆరోపించారు. దేశంలో, రాష్ట్రంలోనూ మోదీ వేవ్ లేదని, బీఆర్ఎస్ ఆ పార్టీ యంత్రాంగం మొత్తాన్ని బీజేపీకి అప్పగించిందని అన్నారు. రాజకీయాల్లో హత్యలు ఉండవని, ఆత్మహత్యలే ఉంటాయని వ్యాఖ్యానించారు. దేశ వ్యాప్తంగా ఎన్డీయేకు పది శాతం అటు ఇటుగా 220 సీట్లు వస్తాయని తెలిపారు. కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలో తమ అభ్యర్థి 20 వేల మెజారిటీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. అక్కడ మాత్రం బీఆర్ఎస్ పోటీ ఇస్తుందని అన్నారు. రాష్ట్ర ఆర్థికస్థితిపై శ్వేతపత్రాన్ని ప్రకటించడాన్ని కేసీఆర్ తప్పుబట్టడంపై స్పందిస్తూ ఆయన చేసిన పాపాలన్నింటినీ మూసిపెట్టాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. రైతుబంధు కూడా పూర్తి చేయలేమంటూ మాట్లాడారని, చేశాక అది వాళ్ల గొప్పదనమంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రెండోసారి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అది కూడా వాళ్ల గొప్పతనమే అని చెప్పుకోవచ్చన్నారు.

గౌతమ్ న్యూస్ తెలుగు దిన పత్రిక

## సంపాదకీయం

# మోదీ సర్కార్ మూడో రాకడ ఖాయం (విశ్లేషణ)

భారతీయ జనతా పార్టీ 2019 సార్వత్రక ఎన్నికలలో చాలా రాష్ట్రాల్లో అత్యధిక స్థానాలు సంపాదించింది. 2024లో ఆ ఫలితాలు పునరావృతం కావని ప్రతిపక్ష శిబిరంలో ఉన్నవారు, కుహనా మేధావులు వాదిస్తున్నారు. వారి వాదనలో పసలేదు. ఎందుకంటే 2014 నుంచీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలోని భారతీయ జనతా పార్టీకి జనాదరణ పెరుగుతుందే కాని తగ్గడం లేదు. బీజేపీ దినదిన ప్రవర్ధమానమవుతున్న పార్టీయే కాని కాంగ్రెస్‌లా రోజురోజుకూ వెలుగు తగ్గిపోతున్న పార్టీ కాదు. మోదీ పట్ల ప్రజల విశ్వాసం రోజు రోజుకూ పెరుగుతోందని, ఆయనను అభిమానించే వారి సంఖ్య కోట్లలో ఉంటుందని చాలా మందికి ఇంకా అర్థం కావడం లేదు ఇవాళ ఉత్తరప్రదేశ్‌నే చూస్తే అక్కడ డబుల్ ఇంజన్ సర్కార్ అత్యంత పటిష్ఠంగా పనిచేస్తోంది. రాష్ట్రంలో ఒకప్పుడు మహిళలు ఒంటరిగా తిరిగేందుకు భయపడేవారు. ఎక్కడ చూసినా మాఫియా, గూండాగిరీ రాజ్యమేలేది. అభివృద్ధి అనేది ఏ కోశానా కనపడేది కాదు. ఇప్పుడు మోదీ-యోగీ సారథ్యంలో ఉత్తరప్రదేశ్‌లో వేల కోట్ల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు అమలవుతున్నాయి. వేల కోట్ల మేరకు సంక్షేమ కార్యక్రమాల నిధులు జనానికి నేరుగా చేరుతున్నాయి. శాంతి భద్రతల పరిస్థితి నూటికి నూరు శాతం మెరుగుపడింది. ప్రజలు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటున్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం, కాశీ కారిడార్ నిర్మాణం తదితర చర్యల వల్ల కోట్లాది భారతీయుల ఆధ్యాత్మిక, ధార్మిక మనోభావాల పరిరక్షణ జరిగింది. ఈ పరిస్థితుల్లో కులాల పేరుతో, మైనారిటీల పేరుతో కొన్ని దుష్టశక్తులు ఏకం అయినంత మాత్రాన ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ మెజారిటీ తగ్గుతుందా? గతంలో కంటే అత్యధిక సంఖ్యలో యూపీలో బీజేపీ సీట్లు సాధించడం ఖాయం. యూపీ మాత్రమే కాదు, డబుల్ ఇంజన్ సర్కార్ అమలులో ఉన్న మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అస్సాం, ఉత్తరాఖండ్, హర్యానా, గుజరాత్‌తో పాటు అనేక రాష్ట్రాల్లో బీజేపీ ప్రభంజనం మళ్లీ వీయనుందనడంలో సందేహం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా మోదీతో చంద్రబాబు-పవన్ కల్యాణ్ చేతులు కలపడంతో ప్రజల్లో సమధికోత్సాహం నెలకొంది. తెలంగాణలో నిశ్శబ్ద విప్లవం జరుగుతున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. ఈ ఎన్నికల తర్వాత తెలంగాణలో కూడా అనతి కాలంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడడం ఖాయమని ప్రజలు విశ్వసిస్తున్నారు. బీజేపీ గెలుపునకు ఎన్నో కారణాలు చెప్పవచ్చు. మోదీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీని ప్రజలు తమ జీవితాలకు, ఆలోచనలకు సన్నిహితంగా ఉన్న పార్టీగా భావిస్తున్నారు. మోదీకి తప్ప మరెవరికి ఓటు వేస్తాం? అన్న ప్రశ్న ప్రతి సామాన్యుడి మనసులో మెదులుతోంది. మోదీ గత పదేళ్లలో దేశాన్ని అత్యంత పటిష్ఠంగా బలోపేతంగా మారిందని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అద్భుతంగా జరుగుతోందని ఇవాళ ఎవరైనా చెప్పగలరు. మోదీ నిర్భయంగా, ప్రత్యర్థులను చీల్చి చెండాడం, అంతర్జాతీయంగా దేశం ప్రతిష్ఠను ఆకాశానికి పెంచడం కూడా అందరూ గమనించారు. అందుకే బీజేపీ ఉద్దేశ పూర్వకంగా మోదీ చుట్టూ ప్రచారాన్ని రూపొందించింది. మోదీ వాగ్దానాలు నెరవేరుస్తారని, ఆయన అనర్గళ ప్రసంగాలు ప్రజలను హత్తుకుంటాయని, ఆయనను మించిన వక్త కానీ, నాయకుడు కాని దేశంలో మరెవరూ లేరని ఇవాళ అందరికీ తెలుసు. ఏదైనా మోదీ ముఖానే కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడడం ప్రజలకు నచ్చుతున్న విషయం ప్రతిపక్షాలు గమనించడం లేదు. వ్యక్తిగతంగా ఆయన అవినీతిపరుడు కాకపోవడం, ఏదైనా జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే చేస్తాడని ప్రజలు నమ్మడం వల్ల ఇవాళ ఆయన నాయకత్వానికి తిరుగులేకుండా పోతోంది. నిత్యం కశ్మీర్‌లో చొరబాటుదారులను ప్రేరేపించే పాకిస్తాన్ ఇవాళ ఎందుకు ఆత్మరక్షణలో పడిపోయింది? గతంలో లాగా సంక్షేమ కార్యక్రమాల అమలులో అవినీతి కనపడకపోవడం కూడా మోదీ ప్రభుత్వం పట్ల విశ్వాసం పెంచుతోంది. శౌచాలయాలు, గ్యాస్ కనెక్షన్లు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఆహార ధాన్యాల పంపిణీ, రైతులకు ఆర్థిక సహాయం, ముద్రా రుణాలు, ఆరోగ్య బీమా ఇవన్నీ ఆచరణలో ఫలితాలను అందిస్తున్నాయి. అందుకే బీజేపీ ఆత్మవిశ్వాసంతో నేరుగా లబ్ధిదారులను చేరుకోగలుగుతోంది. మైనారిటీలంతా సంఘటితమయ్యారని అందువల్ల బీజేపీ ఓడిపోతోందని ప్రతిపక్షాలు చేస్తున్న వాదన కూడా తప్పు. 2019లో కూడా ఇదే వాదన వినిపించినప్పటికీ బీజేపీ అఖండ విజయం సాధించిన విషయం గ్రహించాలి. యూపీలో మైనారిటీలే కనుక బీజేపీని వ్యతిరేకిస్తే మెజారిటీ సీట్లు ఎలా సాధించగలుగుతుంది? అసలు ప్రతిపక్షాలను ప్రజలు ఎందుకు నమ్మాలి? ఈ ప్రశ్నలు ప్రతిపక్షాలు వేసుకుని ఉంటే వాటి పరిస్థితి ఎంతో కొంత మెరుగుపడేది. ప్రతిపక్షాల ఆరున్నర దశాబ్దాల పాలనను, మోదీ పది సంవత్సరాల పాలనను ప్రజలు గమనించరని వారు అనుకోవడం పొరపాటు. ప్రతిపక్షాల హయాంలో జరిగిన విచ్చలవిడి అవినీతి ఆశ్రిత పక్షపాతం, పెచ్చరిల్లిన ఉగ్రవాదం, కశ్మీర్, పంజాబ్, ఈశాన్య రాష్ట్రాల్లో జరిగిన దారుణాలు, మతకల్లోలాలు, ఆర్థిక సంక్షోభంతో పాటు రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేసిన తీరు, ముఖ్యమంత్రులను పదే పదే మార్చిన తీరు ఇవన్నీ ప్రజలు మరిచిపోలేదు. ఇవాళ కులాల పేరుతో, సామాజిక న్యాయం పేరుతో రాహుల్‌గాంధీ చిలుకపలుకులు పలికినంత మాత్రాన ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. మీ జమానాలో సామాజిక న్యాయం ఏమైంది? గత ఎన్నికల్లో రాహుల్‌గాంధీ కనీస ఆదాయ గ్యారంటీ పేరుతో ప్రచారం చేశారు కాని ఓటర్లలో ఒక్కరు కూడా ఈ హామీని విశ్వసించలేదు. ఇప్పుడు సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ అంటూ మాట్లాడినంత మాత్రాన ప్రజలు విశ్వసిస్తారా? మోదీ పట్ల ప్రజలకు బలమైన నమ్మకం ఎందుకు ఏర్పడింది? కాంగ్రెస్ పాలన కంటే మోదీ పాలన అన్ని విధాల మెరుగ్గా ఉండడమే. దేశంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే మోదీ పాలనకు గీటురాయి. ఉగ్రవాదం, వేర్పాటు వాదం, నక్సలిజం వంటివి తోకముడిచాయి. మైనారిటీ వాదానికి కాలం చెల్లింది. వీటన్నిటికి తోడు బీజేపీ అత్యంత బలోపేతమైన పార్టీగా నలుమూలలా విస్తరించింది. ప్రతిపక్షాల పట్ల జనం విశ్వాసం కోల్పోవడం వల్లనే ఇవాళ బీజేపీ తిరుగులేని పార్టీగా మారింది. అందుకే ప్రధానమంత్రి నరేంద్రమోదీ అత్యంత ఆత్మవిశ్వాసంతో ఎన్డీఏ 400 సీట్లు దాటి తీరుతుందని నాలుగో దశ ఎన్నికల తర్వాత మరోసారి ప్రకటించారు. రాహుల్‌గాంధీ అమేథీ నుంచి పలాయనం చిత్తగించి, తల్లి నియోజకవర్గమైన రాయబరేలీ నుంచి పోటీ చేయడం, సమాజ్‌వాది పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ, రాష్ట్రీయ జనతాదళ్, ఎన్‌సీపీ, శివసేన వంటి పార్టీల దయదాక్షిణ్యాలపై ఆధారపడి ఇచ్చిన సీట్లకు కాంగ్రెస్ పోటీ చేయడం, తృణమూల్ కాంగ్రెస్ తిరస్కరించినా ఆ పార్టీని ఇండియా కూటమిలో కొనసాగించడం ఇవన్నీ కాంగ్రెస్ బలహీనతకు నిదర్శనాలు. కాంగ్రెస్‌కి ఈసారి 50 సీట్లు కూడా రావని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రకటన ఏ మాత్రం వాస్తవదూరం కాదని జూన్ 4న తప్పక నిర్ధారణ అవుతుంది.

# మోదీ ఆస్తి రూ.3.2 కోట్లు

### సొంత ఇల్లు, కారు లేవు.. ఎన్నికల అఫిడవిట్‌లో ప్రధాని వెల్లడి
### వారాణసీ నుంచి నామినేషన్
### గంగా సప్తమి పర్వదినాన దాఖలు



వారాణసీ, మే 14: హిందువులు అత్యంత పవిత్రంగా భావించే గంగా సప్తమి పర్వదినాన.. ప్రధాని మోదీ వారాణసీ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి నామినేషన్ వేశారు. అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ సహా పలువురు ఎన్డీయే కూటమి నేతలు తదితర అతిరథమహారథులు వెంటరాగా.. మంగళవారం ఉదయం ఆయన జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పించారు. సార్వత్రిక ఎన్నికల ఆఖరి దశలో (జూన్ 1న) పోలింగ్ జరిగే నియోజకవర్గాల్లో వారాణసీ ఉంది. నామినేషన్ల దాఖలుకు ఆఖరు రోజు మంగళవారమే. గంగాదేవి భూమికి దిగివచ్చిన గంగా సప్తమి, పుష్యమి నక్షత్రం కలిసి రావడంతో.. మోదీ ఈరోజును ఎంచుకున్నారు. నామినేషన్ వేయడానికి ముందు ఆయన దశాశ్వమేధ ఘాట్‌లో గంగా స్నానం చేశారు. అక్కడ జరిగిన హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కాశీ క్షేత్రపాలకుడైన కాలభైరవుడి గుడికి వెళ్లి స్వామి దర్శనం చేసుకుని ప్రార్థనలు చేశారు. "కాశీతో నా అనుబంధం అద్భుతమైనది, విడదీయలేనిది, పోలిక లేనిది. మాటల్లో చెప్పలేనిది. మీ అందరి ఆప్యాయతతో పదేళ్లు ఎలా గడిచిపోయాయో కూడా గుర్తురావట్లేదు. ఈరోజు గంగమ్మ తల్లి నన్ను తన దత్తత తీసుకుంది" అని 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. నామినేషన్ అనంతరం నేరుగా.. కాశీలోని రుద్రాక్ష కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుని స్థానిక పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. పార్టీ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వారికి దిశానిర్దేశం చేశారు. ప్రతి బూత్‌లోనూ.. గతంలో పోలైన ఓట్ల కంటే 370 ఓట్లు అధికంగా పోలయ్యేలా చూడాలని సూచించారు. ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో ఆయన ఈ సూచన చేసినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. నామినేషన్ దాఖలు చేసిన తర్వాత ప్రధాని మోదీ 'ఎక్స్'లో ఒక పోస్టు పెట్టారు. "ఈ చారిత్రక నియోజకవర్గం (వారాణసీ) నుంచి పోటీ చేసి గెలిచి ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం నాకు దక్కిన గౌరవం" అని పేర్కొన్నారు. కాశీ ప్రజలను తన కుటుంబసభ్యులుగా అభివర్ణించారు. "ప్రజల మద్దతుతో మూడోసారి కూడా గెలిచి.. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఇనుమడించిన ఉత్సాహంతో కృషి చేస్తా. 'జై బాబా విశ్వనాథ్'" అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

**ఆ నలుగురూ..**

2014, 2019 తరహాలోనే.. ఈసారి కూడా మోదీ నామినేషన్ వేయడానికి వేర్వేరు వర్గాలకు చెందిన నలుగురు ప్రపోజర్లను(లోక్‌సభ అభ్యర్థిగా బలపర్చేవారు) ఎంచుకున్నారు. ఆ నలుగురూ.. పండిత్ గణేశ్వర్ శాస్త్రి, బైజ్‌నాథ్ పటేల్, లాల్‌చంద్ కుశ్వాహ, సంజయ్ సోంకర్. వీరిలో పండిత్ గణేశ్వర్ శాస్త్రి ప్రముఖ జ్యోతిష్కుడు, వేదపండితుడు, న్యాయశాస్త్ర కోవిదుడు. అయోధ్య రామ మందిర శంకుస్థాపనకు, బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ముహూర్తం పెట్టింది ఆయనే. 2022 ఫిబ్రవరిలో కాశీ విశ్వనాథ్ కారిడార్ నిర్మాణానికి కూడా ముహూర్తం పెట్టింది ఈయనే. గణేశ్వర్ శాస్త్రి తాతముత్తాతలు.. తమిళనాడులోని తిరువసనల్లూరు నుంచి ఎప్పుడో వారాణసీకి వచ్చి స్థిరపడ్డారు. మరో ప్రపోజర్.. వారాణసీ లోక్‌సభ నియోజకవర్గంలోని సేవాపురి ప్రాంతానికి చెందిన బైజ్‌నాథ్ పటేల్ ఆరెస్సెస్ కార్యకర్త. జనసంఘ్‌తో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన వ్యక్తి. ఇంకో ప్రపోజర్ లాల్‌చంద్ కుశ్వాహ(65).. ఓబీసీ వర్గానికి చెందిన వ్యక్తి. బీజేపీ వారాణసీ జోనల్ ఇన్‌చార్జ్. మరో ప్రపోజర్.. సంజయ్ సోంకర్ (50) దళితుడు. వారాణసీ జిల్లా విభాగం జనరల్ సెక్రటరీగా వ్యవహరిస్తున్నారు.

**కాంగ్రెస్‌కు ఒక్క సీటూ రాదు**

తనకు మొత్తం రూ.3.02 కోట్ల విలువ చేసే ఆస్తులు ఉన్నాయని మోదీ ప్రకటించారు. మంగళవారం నామినేషన్ దాఖలు చేసిన ఆయన.. పోల్ అఫిడవిట్‌లో తన ఆస్తులు, అప్పులు, చేతిలో ఉన్న డబ్బు వివరాలను వెల్లడించారు. ఆ అఫిడవిట్ ప్రకారం.. మోదీకి కారు లేదు. సొంత ఇల్లు లేదు. భూములుగానీ, షేర్లుగానీ లేవు. మ్యూచువల్ ఫండ్స్‌లో ఎలాంటి పెట్టుబడులూ లేవు. ఎస్బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో మాత్రం రూ.2.86 కోట్లున్నాయి. రూ.2.68 లక్షల విలువ చేసే నాలుగు బంగారు ఉంగరాలు, రూ.9.12 లక్షల విలువైన జాతీయ పొదుపు పత్రాలు ఆయన పెట్టుబడులు. ఇక, ఆయన చేతిలో ఉన్న నగదు.. 52,920 రూపాయలు. వారాణసీ, గాంధీనగర్‌లోని రెండు బ్యాంకు ఖాతాల్లో 80,304 రూపాయలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి తీసుకుంటున్న జీతాన్ని, బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వస్తున్న వడ్డీని తన ఆదాయ వనరులుగా చూపారు. 2018-19లో తన ఆదాయం రూ.11.14 లక్షలుగా చూపిన మోదీ.. 2022-23లో రూ.23.54 లక్షలుగా పేర్కొన్నారు. 2014లో మోదీ తన ఆస్తుల విలువను రూ.1.66 కోట్లు, 2019లో రూ.2.51 కోట్లుగా పేర్కొన్న సంగతి తెలిసిందే. కాగా, ఈ లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాదని మోదీ అన్నారు.

**బీజేపీ కంచుకోట.. వారాణసీ**

వారాణసీ నియోజకవర్గం బీజేపీకి కంచుకోట! ఇక్కడ హిందూ జనాభా 75 శాతం కాగా.. ముస్లింలు 20 శాతం దాకా ఉన్నారు. హిందువుల్లో.. 10శాతం ఎస్టీలు, 0.7 శాతం ఎస్సీలు ఉన్నారు. గ్రామీణ ఓటర్లు 65 శాతం.. అర్బన్ ఓటర్లు 35 శాతం. ఒక్క 2004 ఎన్నికల్లో మినహా.. 1991 నుంచి ఇప్పటిదాకా ఆ నియోజకవర్గాన్ని బీజేపీనే దక్కించుకుంది. 2004 ఎన్నికల్లో.. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఆర్కే మిశ్రా అక్కడ విజయం సాధించారు. ఇక, మోదీ 2014లో 3.71 లక్షల ఓట్ల ఆధిక్యంతో (56.37 శాతం ఓట్లు).. 2019లో 4.79 లక్షల ఓట్ల ఆధిక్యంతో (63 శాతం ఓట్లతో) అద్భుత విజయాలు సాధించారు. ఇప్పుడు ముచ్చటగా మూడోసారి పాత రికార్డులను ఛేదించడమే లక్ష్యంగా బరిలోకి దిగారు. ఈసారి ఆయనకు పోటీగా కాంగ్రెస్ పార్టీ ఆ రాష్ట్ర పీసీసీ చీఫ్ అజయ్ రాయ్‌ని వరుసగా మూడోసారి రంగంలోకి దించింది.

# కడెం ప్రాజెక్ట్ ఐదు గేట్లకు మరమ్మతులు..!!

### ఐదు గేట్లకు శరవేగంగా మరమ్మతులు..
### ప్రాజెక్టు వద్దకు కీలక అధికారులు
### గత రెండేళ్లు భారీ వరదలకు వణికిన ప్రాజెక్టు
### 2 గేట్ల రోప్‌లు తెగిపోవడం, మరో రెండింటి కౌంటర్ వెయిట్‌లు కొట్టుకుపోవడంతో సమస్య
### మొత్తం 18 గేట్లూ ఒకేసారి తెరుచుకోని వైనం
### డీఎసఆర్‌పీ సూచనపై దృష్టిపెట్టని గత సర్కారు
### యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కొత్త ప్రభుత్వం నిర్ణయం.. ఉత్తర్వుల జారీ




హైదరాబాద్ : గోదావరి బేసిన్‌లో ఏటా వరదలతో నిండే ప్రాజెక్టుల్లో ఒకటైన కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టుపై ప్రభుత్వం దృష్టి సారించింది. గత రెండేళ్లు భారీ వరదలతో ప్రాజెక్టు చిగురుటాకులా వణికిన విషయం విదితమే. స్పిల్‌వే (నీరు విడుదలయ్యే భాగం) సామర్థ్యం కన్నా అధికంగా వరద రావడంతో గత ఏడాది 18 గేట్లకు గాను 14 గేట్లు మాత్రమే పైకి లేచాయి. రెండు గేట్ల రోప్‌లు తెగిపోగా... మరో రెండు గేట్ల కౌంటర్‌వెయిట్‌లు కొట్టుకుపోయాయి. దాంతో వరద.. గేట్ల పైనుంచి కిందికి దూకింది. గత రెండేళ్ల అనుభవాల దృష్ట్యా ప్రాజెక్టు 18 గేట్లను ఏకకాలంలో ఎత్తడానికి వీలుగా 5 గేట్లలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఇటీవలే వీటి మరమ్మతులకు ఉత్తర్వులు ఇవ్వగా ఎన్నికల సంఘం కూడా ప్రత్యేకంగా అనుమతి ఇచ్చింది. వానాకాలంలోపు ఈ మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ నేతృత్వంలోని అధికారుల బృందం కడెం ప్రాజెక్టును సందర్శించనుంది. గేట్ల మరమ్మతులపై అక్కడే సమీక్ష చేపట్టి, అవసరమైన ఆదేశాలు ఇవ్వనున్నారు. కాగా, ఈ ప్రాజెక్టుకు ఒక ప్రత్యేకత ఉంది. 18 గేట్లలో 9 జర్మనీ నుంచి తెప్పించుకున్నవి. మరో 9 మన దేశంలోనే తయారుచేసినవి. 1906లోనే నిజాం హయాంలో ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించి.. మధ్యలో ఆపేశారు. హైదరాబాద్ సంస్థానం పోలీసు చర్య అనంతరం ఇండియన్ యూనియన్‌లో విలీనం అయ్యాకా పూర్తి చేశారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో 1.30 లక్షల క్యూసెక్కుల వరద విడుదలయ్యేలా స్పిల్ వే డిజైన్ చేశారు. అయితే 1958 ఆగస్టు 31న ప్రాజెక్టుకు 3 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. దాంతో అంతకుముందు అమర్చిన జర్మనీ గేట్లకు అదనంగా మరో 9 గేట్లు పెట్టి, స్పిల్ వే సామర్థ్యం 3 లక్షల క్యూసెక్కులకు పెంచారు. రెండేళ్ల కిందట ప్రాజెక్టుకు ఏకంగా 5 లక్షల క్యూసెక్కుల వరద రాగా గత ఏడాది దాదాపు 4 లక్షల క్యూసెక్కుల దాకా వచ్చింది. జర్మనీ గేట్లు నిక్షేపంగా పనిచేస్తుండగా భారతదేశంలో తయారుచేసినవి నిరంతరం మొరాయిస్తున్నాయి. ఈ ప్రాజెక్టును డీఎసఆర్‌పీ తనిఖీ చేసి.. అదనంగా 5 గేట్లతో కొత్తగా ఒక స్పిల్ వే కట్టాలని నివేదిక ఇచ్చింది. ఏడాదిన్నర కిందటే డీఎసఆర్‌పీ నివేదిక ఇవ్వగా గత ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టలేదు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం వెనువెంటనే మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించి, ఇటీవలే నిధులు కూడా మంజూరు చేసింది. స్పిల్ వే కట్టాలంటే ఏడాది పాటు ప్రాజెక్టు కింద క్రాప్ హాలీడే ప్రకటించాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి తాత్కాలిక ప్రాతిపదికన గేట్లకు మరమ్మతులు చేసి, గేట్ల ఆపరేషనల్ మ్యానువల్‌లో మార్పులకు ఉపక్రమించారు. ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియా అంతా దట్టమైన అడవుల్లో ఉంది. దీంతో అడవుల్లో రెయిన్ గేజ్ స్టేషన్లు ఏర్పాటు చేసి, వాటిని ప్రాజెక్టు వద్ద ఉన్న స్కాడా కేంద్రానికి అనుసంధానం చేశారు. వరద సమాచారం అందుకోగానే గేట్లను ఏకకాలంలో తెరవనున్నారు. అడవుల్లో వర్షాలు కురిసిన తర్వాత ప్రాజెక్టుకు వరద చేరడానికి 9 గంటలు పడుతుందని అంచనా వేశారు. ఆ సమయానికి ముందే 18 గేట్లను ఎత్తేసి ప్రాజెక్టును ఖాళీ చేయాలని నిర్ణయించారు. దీని వల్ల రిజర్వాయర్‌పై ఒత్తిడి తగ్గి ప్రమాదం నుంచి కడెం ప్రాజెక్టు బయటపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# తీరనున్న నీటి కష్టాలు ...

### త్వరలో ఎస్‌ఎల్‌బీసీ సొరంగం తవ్వకం
### నెలాఖరున పునఃప్రారంభిస్తామన్న నిర్మాణ సంస్థ
### శ్రీశైలం వైపు నుంచి సీపేజీ కట్టడికి చర్యలు ముమ్మరం
### నవంబరులో రెండు వైపులా ఏకకాలంలో టన్నెలింగ్
### ప్రాజెక్టు పనుల కోసం ఇప్పటికే 50 కోట్లు విడుదల
### త్వరలో సవరణ అంచనాలకు ప్రభుత్వ ఆమోదం



హైదరాబాద్, : శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగం త వ్వకం పనులను పునఃప్రారంభించేందుకు ముహూర్తం ఖరారైంది. ఈ నెలాఖరు నుంచి టన్నెల్ తవ్వకం చేపట్టనున్నట్లు నిర్మాణ సంస్థ ప్రకటించింది. తవ్వకానికి ప్రతిబంధకంగా ఉన్న సీపేజీ కట్టడికి జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎసఐ) సహకారంతో పనులు చేపడుతున్నారు. సీపేజీ కొంత దూరం దాకా ఉంటుందని గుర్తించి, దానిని కట్టడి చేసే పనులు ప్రస్తుతం పూర్తిస్థాయిలో జరుగుతున్నాయి. సీపేజీ కట్టడి పూర్తికాగానే ఇన్‌లెట్ (శ్రీశైలం జలాశయం వైపు) నుంచి టన్నెల్ తవ్వకం చేపడతామని నీటిపారుదల అధికారులకు నిర్మాణ సంస్థ సమాచారం ఇచ్చింది. ఇక టన్నెల్ బోరింగ్ మెషిన్‌లో బేరింగులు పాడైపోవడంతో కొత్త బేరింగులు తెప్పించారు. వీటిని బిగింపు పూర్తయ్యాక నవంబరులో ఔట్‌లెట్ వైపు (మన్నెవారిపల్లి-అచ్చంపేట) నుంచి టన్నెల్ తవ్వకం చేపట్టనున్నారు. మరోవైపు సీపేజీతోపాటు బేరింగ్‌ల కోసం నిర్మాణ సంస్థకు రూ.50 కోట్ల నిధులను ప్రభుత్వం ఇదివరకే విడుదల చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ.. చేసిన ప్రతిపాదన మేరకు ఈ నిధులను విడుదల చేశారు. దీంతోపాటు ప్రాజెక్టు నిర్మాణ అంచనాలను రూ.3150 కోట్ల నుంచి రూ.4468 కోట్లకు సవరించాలని ప్రభుత్వానికి కమిటీ ప్రతిపాదించిన విష యం తెలిసిందే. ఈ సవరణ ప్రతిపాదనలకు ప్రభుత్వం త్వరలోనే ఆమోదం తెలిపే అవకాశాలున్నాయి. కాగా, రెండువైపులా నవంబరు నుంచి టన్నెల్ తవ్వకం ప్రారంభిస్తే.. నెలకు 300 మీటర్ల చొప్పున 33 నెలల్లో టన్నెల్ పూర్తి చేయగలమని నిర్మాణ సంస్థ ప్రభుత్వానికి సంకేతాలిచ్చింది. అనుకున్నవిధంగా ఈ ప్రాజెక్టు పూర్తయి.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3లక్షల ఎకరాలకు సాగునీటితోపాటు 516 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు తాగునీరు గ్రావిటీతో చేరనుంది.